మే 16-31, 2022

సంపుటి 02, సంచిక 12

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





# కలం వీరుడు 'సురవరం'

జాగీదారుల దోపిడీ... భూస్వాముల ఆధిపత్య.. హింస...
దుర్భర దారిద్రం.. క్రూరమయిన శిక్షలు... బానిసత్వం... నిర్భంద వసూళ్లు... స్వేచ్ఛా...
స్వాతంత్ర్యాలకు సంకెళ్ళు... ఇదీ ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు ఆనవాళ్ళు.
అటువంటి విపత్కర పరిస్థితుల్లో నిద్రాణమైన తెలుగుజాతిని తట్టి లేపేందుకు
ఉవ్వెత్తున ఎగిసిన కలం కెరటం సురవరం ప్రతాపరెడ్డి. గోలకొండ పత్రికను స్థాపించి
నిజాం నిరంకుశత్వాన్ని ప్రజలకు తెలియజేసిన ధైర్యశాలి ఆయన. తన రచనా శక్తితో,
కార్యదీక్షతో ప్రధానంగా తెలంగాణ ప్రజల్ని జాగృత పరిచి తెలుగు సంస్కృతిని
ప్రపంచానికి చాటిన మహనీయుడు, నిస్వార్థ రాజకీయ నాయకుడిగా,
పలు సంస్థల స్థాపకుడిగా, సారస్వత భగీరథుడిగా సురవరం ప్రతాప రెడ్డి చేసిన కృషి
ఎనలేనిది. 28 మే, 1896న జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు...


*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI**, Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor,
Near NTR Stadium  Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




కాల యవనికపై కళగా మిగిలే సాహిత్య రేఖను చిత్రించిన వెల్మల **జయపాల్ రెడ్డి** కవిత.. **"ప్రతిధ్వని"** 42



29 పసితనపు కోరికను సున్నితంగా చెప్పిన **మురళి**... **"ఇనుప తీగ"** కథ...



13 ఆధునిక వ్యవస్థలోని అల్లకల్లోలం చిత్రించిన **రామా చంద్రమౌళి** కథ... **"జారుడు బండ"**



37 బాల్య చాపల్యం జీవితాన్ని తిప్పిన మలుపులు చిత్రించిన **శేషారత్నం** కథ **"మాంజా"**



23 తెలంగాణ సాంస్కృతిక పతాక **మామిడి హరికృష్ణ**తో **వెల్దండి శ్రీధర్** ముచ్చట



09 **అంబేద్కర్** ఆత్మను ఆవిష్కరించిన **ఉత్తరం**...



08 పద్యం సారస్యతను తెలిపిన **సుప్వని** కవిత... **పద్యామృతము**



02 చకోరమై వీక్షిస్తున్నాను అని చలింపచేసే **పొన్నం రవిచంద్ర** కవిత... **వీక్షిస్తున్నాను...**

ఓడిన దుష్టరాజు కపటం తెలిపే **బెల్లంకొండ** నాటి కథ.. **భక్త విజయము**.. ......పేజీ 05

మకుటం ముందున్న **"నీవు"** శతకాన్ని పరిచయం చేసిన **గాజుల రవీందర్** ......పేజీ 19

జీవితం జీవించడానికే అని చెప్పిన కవి రంగు చక్రపాణిని పరిచయం చేస్తున్న **బాణాల "వయస్సు సవాల్ చేస్తున్న సృజన కారుడు"** వ్యాసంలో.....పేజీ 33

ప్రాణం విలువ తెలిసి లారీ డ్రైవర్‌ని కవితీకరించిన **మండలస్వామి** ....పేజీ 07

ఆమెలో నిజమైన మార్పును ఆశించిన **వకుళ** కవిత... **ఆమె మారింది??** ...పేజీ 12

శ్రమజీవి త్యాగం చెప్పిన **విరించి** కవిత... **"వాళ్ళు వస్తారు"**...పేజీ 22

ఉగాదులు ఉత్సవీకరించే ప్రియురాలిని తలచుకొంటూ **కరిపె రాజకుమార్** కవిత... **మెహబూబా**....పేజీ 04

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత

# వీక్షిస్తున్నాను...!!

పొన్నం రవిచంద్ర , 94400 77499



నిన్నే వలచిన నా మనసును మరిచావు
నీకై వేచిన నా తలపులను కూల్చావు .....
విరహమనే విధి కౌగిలిలో నన్ను బంధీని చేసావు
హృదయమనే ఎద వాకిటిలో నన్ను ఒంటరి చేసావు.....
అయినా.....

నాలో నీ ధ్యానం ఆగలేదు..
నాలో నీ ధ్యాస ముగియలేదు ....
నా ప్రేమ తరగలేదు..
నా గాయం మానలేదు....

నిన్నటి నీ వలపులో
వేల వసంతాలను చూసాను
అదే నిజమని నమ్మాను....
నిన్నటి నీ సన్నిధిలో
వేల మధువులను గ్రోలాను
అదే శాశ్వతమని తలిచాను....

క్షణం క్షణం..... అనుక్షణం....
నీ శ్వాసలో మునిగాను
అదే నా ఉచ్ఛ్వాసగా బతికాను.....
నీ ఒడిలో ఒదిగిన వేళ
నీ నీడ నేనై నడిచిన తోవ
ప్రపంచాన్ని మరిపించి.. నన్ను మైమరిపించి
చెలీ..! ఏది ఆ తరుణం?
ఇది ఎన్ని యుగాల సమాగమం !?

నీకై నిరీక్షణ తీయదేనని తెలుసు
నీకై అన్వేషణ మధురమేనని తెలుసు
అయినా.....
అంతరాల్లో ఎందుకు ఈ ఉద్వేగం?
నరనరాల్లో ఎందుకు ఈ ఆరాటం?

ఆశను తడిమే నిరాశలు
ఆనందాన్ని వేధించే నిట్టూర్పులు
ఊటలా ఉబికుబికి వస్తున్న దుఃఖం....
గాలిలా తేలిపోతున్న వేదన....
ఇలా ఎన్నాళ్ళు ప్రియా??

నాలో ఒకే ఒక్క లోకం ఉంది
ఆ లోకంలో నీకు మాత్రమే స్థానం ఉంది....
ప్రేమైనా.... వియోగమైనా....
అంతా అక్కడే!
జీవనమైనా.... మరణమైనా.....
అంతా అక్కడే! అక్కడే.... అక్కడే!

నీవనే చిత్రం నాలో ఇంకిపోయింది
అది చేజారిపోతే
ఈ జగతిలో ఇంకేదీ నిజం కాదనిపిస్తుంది.
చివరికి ప్రేమ కూడా అబద్ధమే అనిపిస్తుంది....

అంతే కదా !?
నీ పేరే తలుచుకుంటున్న చోటా
నీ ఊసే నెమరేసుకుంటున్న చోటా
నీవు నాకోసం తిరిగి వస్తావని
నను పలకరిస్తావని
చకోరమై వీక్షిస్తున్నాను...!!

సంపాదకీయం


తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-31 మే, 2022

సంపుటి 02 సంచిక 13





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా|| కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614



ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి


# శుద్ధ వచనాన్ని ఆహ్వానిద్దాం

సాహిత్యంలో సాధారణంగా ఒకమాట వింటుంటాం. కవి అనేవాడు వచనానికి దూరంగా ఉండాలని చాలామంది విమర్శ రంగ ప్రముఖులు ఉవాచిస్తుంటారు. భాషా కోవిదులు వచనం కవిత్వాన్ని నాశనం చేస్తుందని తమ అస్పృశ్యతను వచనం మీద ప్రకటిస్తుంటారు. 'వచనమై పుడుతావ్' లాంటి అభిశంసనా వాక్యాలు శ్లేష గర్భిత ప్రయోగాలు ఆధునిక కవులలో చూస్తుంటాం.

నిజంగా వచనం అంత నిరాదరణీయమా? ఈ దుస్సహమైన పెద్దరికం తలమోస్తూ నిశ్శబ్దంగా ఊరుకోవాలా?

నిజానికి వచనమే భాషకు అందం తెస్తుంది. మంచి కవి తన రచనకు ఎంత సాధన అవసరమో శుద్ధ వచన రచనకు కూడా అంత సాధన అవసరం. చిరుచిరు వాక్యాలతో సాగిపోయే వచనం ఎంత ఆర్ద్రంగా ఉంటుంది? సంస్కృత పద పటాటోపం, కవిత్వపు అలంకారిక శైలి దరి చేరనీయక విశుద్ధంగా ఉండే వచనం ఎంత గొప్పది? శుద్ధ వచనం రాసేవాళ్ళు ఎంత అరుదుగా అపురూపంగా ఉంటారు? 'వాక్యం రసాత్మకం కావ్యం' అంటే చిరువాక్యం ఒక కావ్యంతో సమానమైన అర్హత కూడా ఒక్కోసారి సంతరించుకొంటుంది. కవితాత్మకమైన వాక్యాలు సరే కాని నిరలంకారంగా క్లుప్తంగా విషయ ప్రధానంగా ఉండే వాక్య సౌందర్యం ఎంత బాగా చెప్పవచ్చు?

పాత కాలంలో సరళ గ్రాంథికంగా రాసేవారు. కవిత్వలౌల్యం లేకుండా విషయ ప్రధానంగా సాగిపోయే ఈ వచనం కూడా ఆకర్షణీయంగా ఉండేది.

వచన రచనా శైలి ఒక్కో రచయిత ఒక్కో విధంగా పట్టువడుతుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకమైన వ్యక్తీకరణ ఉంటుంది.

తెలంగాణలో వచనం, విసర్గ రమణీయం. చిన్న వాక్యాలతో కొనసాగుతుంది.

ఎక్కడో ఒకసారి నుడికారాలు అలంకారాలు దొర్లిపోవడం వేరు. ఇవి భాషకు మరింత వన్నె తెస్తాయి. కాని కృతకంగా చేసే ప్రకర్ష భాషా సౌందర్యానికి, లక్షించే విషయానికి భంగం కలిగిస్తుంది.

ఈ నాటికీ కొంతమంది వ్యాకరణ పండితులు "బడు" ధాతువు ప్రయోగం ఉండవలసింది అని చెబుతారు. చెప్పదలచుకొన్న విషయ వ్యక్తీకరణకు ఇది ఉండితీరవల్సిందే అని వాదిస్తారు. కొన్ని కర్మణి ప్రయోగాల్లో చేసే సంప్రదాయిక శబ్దాల అవసరం అప్పుడప్పుడూ ఉంటే ఉండవచ్చు. కాని వాటి ప్రయోగం కృతకంగా అవసరానికి మించి ఉంటే భాషా సౌందర్యం దెబ్బతింటుంది.

మానవుని యొక్క సమస్త వ్యవహారాలకు, తన స్వాభావిక జీవనానికి భాషే మూల సాధనం. భాషా సౌందర్యమే మానవ ప్రగతికి హేతువౌతుంది. ప్రయోగమే వ్యాకరణానికి మూలమైనపుడు వ్యవహారికంలో ఓ ప్రయోగాన్ని స్వీకరించడంలో అభ్యంతరం ఎందుకు?

ఆధునికానంతర యుగం వచ్చాక కొత్త ప్రతిపాదనలు వచ్చాయి. అత్యాధునికత భాష ప్రాధాన్యాన్ని అంగీకరిస్తూనే ఒక సంక్లిష్టతను ఆపాదించడానికి కొత్త ప్రతిపాదనలు ప్రవేశపెట్టింది.

కాని పరిణామక్రమంలో ఇది వచ్చినా ఇది కూడా ఏమంత ఆరోగ్యకరమైన అంశం కాదని గ్రహించాలి. భాష ప్రధాన లక్ష్యం భావవ్యక్తీకరణే. అది కవిత్వ రూపంలోకి వెడితే అది వేరే సంగతి. కాని సాధారణ వ్యక్తీకరణలో మాత్రం చిన్నవాక్యాలు, నిరలంకారత, సమాసాలు రాకుండా చూసుకోవడం వెరసి చదివే గుణం సంతరించడం అత్యవసరం అని గ్రహించాలి.

**జై తెలంగాణ, జై జాగృతి**

కవిత కల్వకుంట్ల

కవిత



# మెహబూబా!



కరిపె రాజ్ కుమార్, 81251 44729

ఆమె అధరాలను అందుకోవాలంటే
ఆ సముద్రుడు సహస్ర అడుగులు లంఘించాల్సిందే!
ఆమెను బిగి కౌగిలిలో బంధించాలంటే అతని
శతసహస్ర బాహువులు సుదీర్ఘంగా సాగాల్సిందే!!

తనివితీరా ఆమెను తడమాలంటే.........!
నల్లరేగడి మట్టితో నగ్నంగా తానమాడాల్సిందే
కుంతల పొచ్చెర జలపాతాల నురగలమీద తేలి ఆడాల్సిందే!
తెల్ల పత్తిని నిలువెల్లా కప్పుకున్న ఆమె సోయగాలకు సోలిపోవాల్సిందే!!
సుబాఫూల్ సుగంధ పరిమళాలను ఆఘ్రాణిస్తూ
గోగు పూలజాజిరిని గొంతెత్తి పాడాల్సిందే!
గజ్జెకట్టి ఆడాల్సిందే!!

ఆ నడుము ముడతలలో
చూపు తిప్పుకోనివ్వని సుందర దృశ్యకావ్యాలెన్నో!
నియమం తప్పని నిత్యవసంతుడు
చివురు కన్యలతో చీరకట్టిస్తాడు!
గిరిగీసుకున్న గ్రీష్ముడు!
ఆ లలిత లావణ్యాన్ని తాకడానికి సంవత్సరకాలం సంకోచిస్తాడు!!
స్వప్నమా! సాకారమా! తేల్చుకునేలోపే
ప్రవరాఖ్యుల పాదాలకు కళ్లెం వేసేస్తుంది!
అక్కడే ఆగిపొమ్మని అధికారంతో ఆదేశిస్తుంది!!

ఉగాదులామెను ఉత్సవీకరిస్తూ
కోయిలగానాలకు కోరస్ లు పాడుతాయి!
వసంతాలామెను వర్ణరంజితంచేస్తూ వయ్యారంగా ముద్దులాడుతాయి!!
సన్నాయినాదాలు ! డప్పు చప్పుళ్లతో సరిగంగస్నానాలు చేయిస్తాయి!!

హరిత కాషాయ పతాకాలు జుగల్ బందీ చేస్తాయి!
గాంధర్వ గజల్ గానాలు మనసుకు ఊరటనిస్తాయి
మంత్రముగ్ధులను చేసే సూఫీ తత్వాలు
మనోవల్మీక రాగానికి మధురతాళం వేస్తాయి!!

కమ్మని కందోర విందుకాహ్వానించి !అడెల్లిపోచమ్మ
కమానుదాకా సాగనంపి  వినయంగా ఖుదాహఫీజ్ చెపుతుంది
నా మెహబూబా!! ఖుదాకీ కసమ్!!!

*(నిర్మల్ గుట్టలనానుకుని నిత్యవాసంతికలా దర్శనమిచ్చే మెహబూబ్ ఘాట్‌ను తలుచుకుంటూ)*

నాటి కథ

# భక్త విజయము

నాటి భాషలో నాటి కథ....

బెల్లంకొండ వెంకటాచార్యులు
94929 25291

**రచయిత గురించి....**

కీ.శే. బెల్లంకొండ వేంకటాచార్యులు (1905-1937) : తూప్రాన్ సమీపంలోని వడ్డేపల్లి గ్రామంలో జన్మించారు. 'నళినీ భాకరీయము' పద్యకావ్యం, 'శ్రీభాష్యం' వ్యాఖ్యానం, 'సుకుమారి' నాటకం మొదలగునవి వీరి ప్రముఖ రచనలు.

వడ్డెపల్లి యను దేశమున జనపథము సకల వృత్తులచే శాఖోపశాఖల జీవన కార్యములను నిత్య సంతోషంబులు వడయకున్నను స్వేదోపజీవులై సంసారములు గడుపుచుండిరి. అట్టి దేశము నాక్రమించుకొని సామంతమును పరిపాలనం బీడ్చుతున్న ఝూమురాజు కన్నేసి వశపర్చుకొన్నాడు.

ఝూమురాజు రాజ్యంబునకు వశ్న మొదలుగ ప్రాతఃకాలంబున నిద్రించుట యునూ రాత్రివేళల సంచరించుచు యున్ను హుకూమత్... చాలూ నొనరించుచుండె.

రాజున్ను ఇన్నూరు రాజభటులున్ను మంత్రిన్ గణమున్నూ ప్రాతఃకాలంబున నిద్రలేచుడు(ట) నిశివేళన నిద్రించు(డు)ట నిత్యకార్యంబు.

నా రాజ్యమున రాజు కృషీ జీవులను నానాయవస్థల పాలు జేయుచుండెను. నధిక పన్నులు మోపుచుండెడివాడు. పరభాషా వ్యవహారము, పరగృహస్థమున వైవాహిక జీవనము, ముసలి వారిని హింసించుట నూర్గురు జెట్టిలను పోగుచేసుకొని దేశమున కిరాతకములు, అపహరించుట సల్పుచుండె (డి).

నపుడే రక్తము పట్టుచున్న యువకిశోరములున్ను ముదుసలి వారున్ను, నారీమణులున్ను జంకు చుండెడివారు. గాన నందరు దేశస్థులు నొక రాత్రి సమావేశమొనరించి ఝూమురాజునకు మాన్యమునకు కొంత ధనమో ధాన్యమో అర్పణమిచ్చుచు మీదట నాతని యవస్థలు లేకుండునట్లు ప్రాధేయపడవలెనని నిర్ణయించిరి. నా ప్రకారంబుగా రాజు చెంతకు చేరువారెవరు? నతని రాయభారము నెరపువారెవరను సంశయము కలిగినది.

నంతనొక మల్లనవీరుడు నతని సహచరగణం సంసిద్ధులయిరి.

★ ★ ★

మల్లనవీరుడని నాలకించి తన స్వార్థపరత్వము నాలోకించి రాజు అంగీకరించెను. నద్దినంబు నుండి ఫస్లీమాపన నూరు కుంచెల ధాన్యము కొలచి నిచ్చుచుండిరి. రాజు మల్లన వీరునికిన్నీ నతని సహచర గణానికిన్ని తన స్థానమునిచ్చున్నట్లు ప్రకటించెను.

తాత్కాలికానందమునకు పాత్రులయినను నదొక మృతసరోవరతుల్యము. మల్లన్న నాయకుని ఆధిపత్యమున జనపథమ్మున సకల వృత్తుల యువకులను బలీకృత ఫౌజునందు నియమిక చేయునాజ్ఞలు వచ్చుచున్నందున వడ్డేపల్లియ ప్రజలు నిరాశ నిస్పృహలు పడయుచుండిరి.

నంత బిజిలీపూరునందున్న శంకర సేనాధిపతిపై ఝూమురాజు కన్నుంబడెను. బీదరు నర్తకిని చెరబట్టు ప్రయత్న మున్నూ, బీదరు భూమనార్యుని వధించుటను మల్లయ్య కప్పగించిరి.

★ ★ ★

వడ్డెపల్లియ నుండి బిజిలీపూరునకు, బీదరు కోహిర మహారాష్ట్రమునకు ననేక సంబంధములు కలవు. పంటగాలమున నిద్దేశముల మధ్య సహకారము కలదు. వ్యవసాయ పంటలున్నూ, కుప్పలు నూర్చుకాలమున్నూ వేరువేరునగుట వలన వడ్డెపల్లియ ప్రజలు మాఘఫాల్గుణ మున నటు ప్రజలు ఆషాఢ శ్రావణము లందు నిటు రాకయు వ్యవసాయమున సహకారంబులు చేసి ఫలసాయానం తరము అడ్డం ధాన్యఫలములు నందుచుండెడివారు.

చామలు, ముర్రలు, కొర్రలు కోటి ధాన్యములతో కరువు కాటకముల



యందు అడవి అలములు, కాయలు, రసములతో చావులేని బొక్కతోలునైనను జీవించుచుండిరి.

ఝామురాజు తన వేలితో తన కన్న కడుపునే చీల్చునట్టుల మల్లన నాయకుని సారథ్యమున నాక్రమించపూని యానంద కేళి ననుభవించుచుండిరి.

ఇవ్విధమున రాజ్యవ్యూహములు విషసంక్రమయిన మల్లనాది నాయకులు మనసుమారి రాజునకనుకూలమయిరి.

ఝామురాజు యుప్పుదిని ఇన్నాళ్ళు బతికినాము గాన సహకారం చేయ నొల్లమని వారించిరి. నందు తిరుగుబాటు దారులను మల్లన నాయుడు నణచివేసె.

నయిననూ నిరుప్రాంతముల సఖ్యతలోపము కలిగిన పంట నూర్పు కాలంబులనందు ప్రజలు రాకపోకలు, బంధువైరములు, అకాల కలహములు మృత్యుపీడలు, మనోవ్యాకులతలు అధికములయ్యేను.

★ ★ ★

ఇది నిట్లుండ రంగంప్యాట రంగనాయకుల వారి సన్నిధి నుండి పరిత్యాగులు బైరాగులు అయి వైష్ణవ, దాసర, జంగము, చక్రాంకిత దారులు నేత స్వర్ణ భూపాల, సకల భూమిక్కరులంతా స్వధర్మేనిధనం శ్రేయఃపరధర్మే భయాంహాఃధర్మ రక్ష, రక్ష ధర్మ స్మరణీయులు బీదరు, మహారాష్ట్రములకు బయలుదేరిరి.

ప్రయాణ పొడవునా వైష్ణవులు వైశ్యాది కాపులను సకల జనులను ప్రోగుచేసి తబలా హార్మోనియం పెట్టె రాగముల యందు హరినామస్మరణ, హరికథాలాపములు నొనరించగా దాసరులు దాసస్యదాస పరిచారిక దేశసేవయందు దుష్టశిక్షణ శిష్ట రక్షణ ప్రహ్లాదీయుల చక్రాంకితధారులు విష్ణులీలలున్నూ, నేత భజనలను స్వరచిత్ర శిల్ప చాతుర్యమున్ను భూపాల ధరణీక్కరుల పదవిన్యాసముల తోడనూ ప్రజల నాకట్టుకొనుచూ జనబిందువు సింధువుగా పాలనురగల కెరటములుగా మారి సాగిపోవుచుండిరి.

అది నాతికోడు మైదాన ప్రాంతము. మల్లన ఫౌజు అశ్వములపైన వికటహాసము చేయుచున్నది. బిజిలీపూరు, బీదరు మహారాష్ట్రముల పలు ప్రాంతములను కైవసము చేసుకొను వ్యూహరచన చేయుచున్నది. నంతలో సింగన తొడలమీదినందాకా ధోవతి దోపుకొని చిరుతలు మ్రోగించుచూ నఖండ నారసింహ నామము నుచ్ఛరించు చుండెను. దాసు ప్రహ్లాద విజయమును ఆలపించుచుండ నా గ్రామ సమీపము

**"అయ్యో! విధి ఎంత బలీయమైనదీ, నేనెంత నీచుడనైతి"నని సోదరుడు కుమిలిపోవుచుండ భక్తజనమంతయు మల్లనను హిరణ్యకశ్యపుని వలె భావించిరి. అయినను సింగన వారించగా మల్లన ధైన్యము చూసి వదిలివేసిరి. నింత వైట్ ప్రభువు మకరాకారపు మోటారు వాహనంపై వచ్చి కాల్పులు జరిపించెను. నొక చిల్లగింజ ప్రమాణము ఇనుప గుండు మల్లన బొండిగలోకి దిగెను.**

గ్రామములందు జనంబులు తండోపతండంబులుగా వచ్చిరి.

సింగనను చూసిన వెంటనే మల్లన బృహన్నలను గన్న భీష్ముని వలె హతావశు డయ్యె. సింగన స్వయాన సోదరుడు. ధర్మపరుడు, నిత్యకర్మిష్ఠ, మల్లయుద్ధ వీరుడు జ్యేష్ఠసోదరుడు. ఝామురాజు చెంతకు పోయిన తోడనే హేవగించుకొని మంజీరకా పరిత్యాగులు పాదయాత్ర అందు అర్ఘ్యాంజలి సేవలందను ధ్యానమొనరించుచుండెను. తలవని తలంపున నా సోదరులు ఎదురుపడిరి.

నిట్టి సంకటమును పసిగట్టి ఝామురాజు షోలాపురం ఫౌజు స్థావరమునుండి లార్డు వైటు ప్రభువు సేనలతో రప్పించి రహస్య గుడారము లందుండెను.

సింగన్నను చూసిన మల్లన తోడనే అశ్వమును వీడివచ్చి మాతృగారి క్షేమసమాచారములున్నూ పరవిశేషము లున్నూ ప్రశ్నించెను.

కప్పము చెల్లించలేని స్థితినందు గృహమునందలి వ్యవసాయ జీవములను ఝామురాజు, జాగీరులు తరలించుకొని పోవగా చింతాక్రాంతులై మాతృ వియోగము కలిగినదనియు, చితికి అగ్ని నుంచగా నీవు రావైతివని తానే కష్టము చేసితిననియూ నుడివెను.

"అయ్యో! విధి ఎంత బలీయమైనదీ, నేనెంత నీచుడనైతి"నని సోదరుడు కుమిలిపోవుచుండ భక్తజనమంతయు మల్లనను హిరణ్యకశ్యపుని వలె భావించిరి. అయినను సింగన వారించగా మల్లన దైన్యము చూసి వదిలివేసిరి.

నింత వైట్ ప్రభువు మకరాకారపు మోటారువాహనంపై వచ్చి కాల్పులు జరిపించెను. నొక చిల్లగింజ ప్రమాణము ఇనుప గుండు మల్లన బొండిగలోకి దిగెను. బేమాను అనుచూ ఝాము రాజును దూషిస్తున్నలోపే మరికొన్ని ఇనుప గుండ్ల వర్షము భక్త సమూహాముపైకి జల్లించిరి.

సోదరుడా నరసింహావతారమెత్తుమని మల్లన అరుచుచూ ఆయు తనువుల నిష్క్రమించెను.

సింగన భక్తజన నరసింహ స్తోత్రముల మధ్య ధరణినందు ఉషోదయమువలె ఒక దుముకున మెరుపువలె మెరిసి వైటు ప్రభువుపై పడెను. నతను చంకయందు ఎక్కి మెడలు కుమ్మరి చక్రమువలె నాడించెను. బొండిగల వేళ్ళు దూర్చినతని చాతిని చింపివైచెను. పొట్టనందలి ప్రేగులు బయల్వెడునట్లు రెండు చేతులు దూర్చి దోసిళ్ళ పేగులు తెంచివైచెను.

భక్తజనం వీరంగం వేసినంతనే అట్టహాసము నోపలేక వచ్చిన సైన్యము వెనుదిరిగినది.

భక్తజనుల నిట్టివిజయమున ఝామురాజు నక్కజిత్తులు నోడినవి.

***('మెతుకు కతలు' కథాసంపుటి నుండి)***

కవిత

# లాంగ్ రైడర్



**డా॥ మండల స్వామి, 91776 07603**

చీకట్ల ఇక్కట్లు లెక్క చేయడు
దూరాల లెక్కల్లో మునిగి తేలుతాడు
అవసరాల రాసులు వెంటేసుకుని
అలుపెరుగక సరఫరా చేస్తుంటాడు

ఇంటి ప్రేమలు నెమరేస్తూ
నిద్రాహారాలు నిర్లక్ష్యం చేస్తుంటాడు
క్యాబిన్ సింహాసనంపై కూర్చుని
రహదారులెన్నో గెలిచి వస్తుంటాడు

రబ్బరు చక్రాల కాళ్ళతో నడిచే
టన్నుల బరువుల దేహాన్ని
ఎక్స్ లేటర్ అంకుశంతో
అదుపు చేసే మేటైన మావటి



మైలు రాళ్లతో ముచ్చటిస్తూ
సిగ్నల్స్ కి సెల్యూట్లు చేస్తూ
గడియకో గండంలా గడిపేస్తూ
కొండంత నమ్మకంతో కదిలి పోతుంటాడు

వర్షధారలు స్వైపు చేసే వొయ్పర్లు
బ్రేకులతో ఆడుకునే స్పీడ్ బ్రేకర్లు
ఇండికేటర్లు హారన్ల ట్రాఫిక్ హోరులో
శబ్ద సునామీలకెదురీదుతాడు

తెల్ల కాంతులెగజిమ్మే హెడ్లైట్లు
సమయానికి హెచ్చరించే రేడియం స్టిక్కర్లు
టక్కర్లు తప్పించే డిప్పర్లెన్ని ఉన్నా
అప్రమత్తతే అతడి అసలైన ఆయుధం

అత్యవసర వేళల్లో
ఆక్సిజన్ ఆయుష్షు పోసే
ఆపద్బాంధవుడు
తన స్వేదానికి వెల తక్కువైనా
ప్రాణం విలువ మరువని త్యాగధనుడు
లాంగ్ రైడర్ ...లారీ డ్రైవర్.

కవిత

# పద్యామృతము!



సుప్పని సత్యనారాయణ, 94926 26910



ఉ॥ పద్యము నవ్యమై సతతభావసుధారస పానమౌ సదా
పద్యము భవ్యమై భువన భాండములన్నియు నేలుచుండు నా
పద్యము హృద్యమై సుగుణ భాసురమై వెలుగొందు సాహితీ
విద్యల సారమున్ దెలిపి విశ్వమునూయల లూపుచుండదే!

చం॥ దినమున కొక్క పద్యమును తీరిచిదిద్దనిదే మనంబునన్
కనుగొనలేని కోర్కెనను గాబరవెట్టి రసానుభూతిచే
ఘనతరయూహలున్విమల కైతల నూత్న పదాల శ్రేణిలో
నను నిరతంబు సంతసము నందగజేయదు కావ్యదీప్తికై!

ఉ॥ పద్యము గానయోగ్యమగు పద్యము భావసుధా రసమ్మగున్
పద్యము నిత్యనూతనము పద్యము సర్వరసైక కావ్యమౌ
పద్యము హృద్యమై వరలు భాసిలు కైతల సేద్యమందు నై
వేద్యము తెల్గుతల్లికిని వేడుక నొందగ మానవాళికిన్!

సీ॥ అవధానకేళిలో నచ్చెరువొందించు
ప్రతిభను బంచును పద్యమొకటె!
శతక కావ్యకళల శతపత్ర పుష్పమై
పరిమళంబుల బంచు పద్యమొకటె!
శాసనారణ్యాల శ్వాసయై ప్రాచీన
భావాలు వెదజల్లు పద్యమొకటె!
తిరుగుగుండెలపైన వెలుగుచును కీర్తి
పందిరై వెలుగొందు పద్యమొకటె!

తే॥గీ॥ ఆధిపత్యపు పీఠాల నదరజేసి
కాసులకు లొంగలేదనె ఘనత వడసి
'వాడి' తగ్గలేకను తెల్గువాడి యశము
వరలజేతువు పద్యమా! వందనమిదె!

వ్యాసం

# వివక్షలు, అసమానతలకి సమాధి కట్టాలి...

**కళ్ళు చెమర్చే సంఘటనలు తెలిపిన ఉత్తరం.... ఇది అంబేద్కర్ తన భార్యకు రాసినది..**

రమా, ఎలా వున్నావు రమా?

నాకు ఈరోజు నువ్వు మరియు యశ్వంత్ చాలా ఎక్కువగా గుర్తుకొస్తుండడంతో మనసంతా చాలా దిగులుగా వుంది. ఈ మధ్య కాలంలో నేను చేసిన ప్రసంగాలు అత్యంత చర్చనీయ అంశాలుగా వార్తల్లో నిలిచాయి. రౌండ్ టేబుల్ సమావేశంలోని నా ప్రసంగాలు బాగున్నాయని, ప్రేరణాత్మకంగా ఉన్నాయని ఇక్కడి వార్తాపత్రికలు రాశాయి. దీనికంటే ముందుగా, రౌండ్ టేబుల్ సమావేశంలో నా పాత్ర గురించి ఒకసారి అవలోకనం చేసుకుంటే..... తరతరాలుగా అణచివేతకు గురవుతున్న ప్రజల దీనమైన ముఖాలు నా కళ్ళముందు కదలాడాయి. వేల సంవత్సరాలుగా నా ప్రజలు పేదరికంలోను, వేదనలోను మగ్గుతున్నారు. అనునిత్యం వారు అనుభవిస్తున్న బాధలనుండి వారికి విముక్తి లభించదని, వారి కష్టాలకు అంతం లేదని వారు గాఢంగా నమ్ముతున్నారు. ఈ విషయం నన్ను తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది రమా, కానీ ఈ దురాగతంపై పోరాడేందుకు అవసరమైన మేధస్సుని నేను సాధించాను. బహుశా నా మనసులో చాలా వేదన వుంది మరియు నా హృదయంలో ఎన్నో భావోద్వేగాలున్నాయి.

నాకు చాలా నిరాశానిస్పృహగా వుంది. నేను మన ఇంటిని, మిమ్మల్నందరిని చాలా మిస్సవుతున్నాను. నాకు నువ్వు, యశ్వంత్ పదేపదే గుర్తుకురావడంతో మిమ్మల్ని మిస్సయ్యాను అన్న బాధ నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. నాకు వీడ్కోలు చెప్పేందుకు నీవు నౌక దగ్గరకు వచ్చావు. నౌక వద్దకు నన్ను సాగనంపేందుకు రావద్దని నేను నిన్ను వారించినా కూడా ఉండబట్టలేక నా మాట పెడచెవిన పెట్టి నువ్వు అక్కడికొచ్చావు. నేను రౌండ్ టేబుల్ సమావేశాలకు పయనమవుతుండగా, అక్కడ చుట్టూ వున్నవారు నాకు జేజేలు పలకడం నీ కళ్ళ ముందరే జరిగింది మరియు అందుకు నువ్వే ప్రత్యక్ష సాక్షివి. ఆ సన్నివేశాన్ని నీ కళ్ళతో వీక్షించాక నీ హృదయం ఆనందంతో నిండిపోయిందని నాకు అర్థమైంది. మాటలతో నీ సంతోషాన్ని నువ్వు చెప్పలేకపోయావు కానీ నువ్వు వ్యక్తం చెయ్యాలనుకున్న సంతోషమంతా నీ కళ్ళు సుస్పష్టంగా వ్యక్తపరిచాయి. నీ మాటల కంటే నీ మౌనమే ఎక్కువ భావాలను పలికించింది. నీ నోటి నుండి వచ్చిన మాటల కన్నా, నీ కళ్ళ నుండి రాలిన కన్నీళ్ళే అంత్యంత భావయుక్తంగా గోచరించాయి.

ఇక్కడ లండన్లో ఉదయం నిద్ర లేవగానే నాకు ఈ ఆలోచనలతో మనసంతా బాధతో నిండిపోయి దుఃఖం తన్నుకు వస్తోంది. నువ్వు ఎలా వున్నావు రమా? మన యశ్వంత్ ఎలా వున్నాడు? వాడు నన్ను మిస్సవుతున్నాడా? వాడికి కీళ్ల నొప్పులు తగ్గాయా? వాడిని జాగ్రత్తగా చూసుకో రమా. మన నలుగురు పిల్లల్ని మనం కోల్పోయాం ఇక మనకు మిగిలింది మన యశ్వంత్ ఒక్కడు మాత్రమే. నీ మాతృత్వానికి వాడు ప్రతీక. మనం వాడిని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. యశ్వంత్ని ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడి తనకి విద్యాబుద్ధులు నేర్పించు. రాత్రి వేళలో నిద్ర లేపి చదివించు. మా నాన్న నన్ను అర్ధరాత్రి నిద్రలేపి చదివించడం కోసం తాను అర్ధరాత్రి వరకు మేల్కొని నన్ను నిద్రలేపి తాను అప్పుడు పడుకునేవాడు. నేను చదవడానికి ఉపక్రమించిన తరువాతే ఆయన నిద్రపోయేవాడు. నాకు అలవడిన ఈ క్రమశిక్షణ ఆయన నేర్పినదే. మొదట్లో అర్ధరాత్రి నిద్రలేచి చదవాలంటే సోమరితనం వల్ల నాకు చాలా కష్టంగా అనిపించేది. ఎందుకంటే అర్ధరాత్రి నిద్రలేచి చదవడం కంటే హాయిగా ముసుగుతన్ని నిద్రపోవడం సుఖంగా ఉండేది. కానీ ఒక్కసారి వెనుతిరిగి చూసుకుంటే అలా చదువు కోసం నిద్రను త్యాగం చేయడం నా జీవితానికి ఎంతో ఉపయోగపడింది. ఈ విజయంలో సింహభాగం మా నాన్నకే చెందుతుంది.

నన్ను ఉన్నత చదువులు చదివించడం కోసం మా నాన్న ఎన్నో త్యాగాలు చేశాడు. నా జీవితంలో వెలుగులు నింపడం కోసం మా నాన్న రేయింబవళ్లు ఎంతో కష్టపడ్డాడు. ఆయన ఆనాడు పడిన శ్రమకు ఫలితం ఈరోజు నా కళ్ళముందు స్పష్టముగా కనపడుతోంది. ఇదంతా చూస్తుంటే ఈరోజు నాకు చాలా ఆనందంగా వుంది రమా...



రమా, మన యశ్వంత్ కూడా బాగా చదువుకోవాలి. పుస్తకాల పట్ల ఆసక్తిని, జిజ్ఞాసను యశ్వంత్ హృదయంలో మనం రగిలించాలి. డబ్బుతో, ఆడంబరాలతో ఎలాంటి ఉపయోగం లేదు రమా. ఈ విషయాన్ని నువ్వు అనునిత్యం నీ చుట్టు పక్కల గమనిస్తూనే వుండివుంటావు. జనం భోగభాగ్యాలకోసం, సౌఖ్యాలకోసం యుగ యుగాలుగా నిరంతరంగా పరిగెడుతూనే వున్నారు. డబ్బుసంపాదన అనే ఒకే ఒక్క లక్ష్యం దగ్గరే అటువంటివారు ఆగిపోతారు. వారు జీవితంలో పైకి ఎదగరు. అటువంటి జీవన విధానంతో మనం సంతృప్తి చెందరాదు రమా. మన చుట్టూ కష్టాలు, వేదన తప్ప మనం మరొకటి చూడం. పేదరికం మాత్రమే మన సహచరి. కష్టాలు మనలను విడిచి వెళ్లవు. అవమానాలు, వంచన, అలక్ష్యము, నిరాదరణ ఒక నీడలాగా మనల్ని వెంటాడుతూనే వున్నాయి. ఇదంతా గాఢాంధకారమైన చీకటిలా, ఎడతెగని, అనంతమైన కష్టాల కడలిలా వుంది.

మన రక్షకులుగా మనమే ఉండాలి. మనకు మార్గదర్శకులుగా మనమే ఉండాలి. మనం ఎన్నుకొన్న మార్గంలో మనమే దీపాలు వెలిగించాలి. ఈ మార్గంలో ప్రయాణించి మనం విజయం సాధిస్తాం. ప్రస్తుత సమాజంలో మనకు

**ఆయన ఆనాడు పడిన శ్రమకు ఫలితం ఈరోజు నా కళ్ళముందు స్పష్టముగా కనపడుతోంది. ఇదంతా చూస్తుంటే ఈరోజు నాకు చాలా ఆనందంగా వుంది రమా... రమా, మన యశ్వంత్ కూడా బాగా చదువుకోవాలి. పుస్తకాల పట్ల ఆసక్తిని, జిజ్ఞాసను యశ్వంత్ హృదయంలో మనం రగిలించాలి. డబ్బుతో, ఆడంబరాలతో ఎలాంటి ఉపయోగం లేదు రమా.**

ఒక సముచిత స్థానం లేదు కాబట్టి ఆ సముచిత స్థానాన్ని మనమే సంపాదించాలి. సమాజంలో మనం ఒక దుర్భరమైన స్థితిలో వున్నాం కాబట్టి యశ్వంత్‌కు ఉన్నతమైన విద్యను అందిస్తావని ఆశిస్తున్నాను. యశ్వంత్‌కు మంచి బట్టలు అందించు మరియు తనకు శుచి, శుభ్రత, మంచి, మర్యాదలు నేర్పించు. యశ్వంత్ మనసులో ఒక ఉన్నతమైన ఆశయాన్ని నువ్వు కలిగించాలి.

నేను నిన్ను, మన యశ్వంత్‌ను చాలా ఎక్కువగా గుర్తు చేసుకుంటుంటాను. ఒక చెట్టు ఆకులు ఒక్కొక్కటిగా రాలిపోయినట్లు నీ ఆరోగ్యం కొద్దికొద్దిగా క్షీణిస్తోందని నాకు తెలుసు. ఈ విషయం నాకు తెలియనిది కాదు రమా. కానీ నన్ను ఏం చేయమంటావ్ రమా? ఒక వైపు ఈ అంతంలేని దుర్భర పేదరికం, మరొక వైపు అనంతమైన జ్ఞాన సముపార్జన చెయ్యాలనే నా మొండి పట్టుదలతో నేను తీసుకున్న దృఢ సంకల్పం నాకు కనిపిస్తున్నాయి.

జ్ఞాన సముపార్జన చెయ్యాలి అనే నా తపనతో నేను మిగతా విషయాలు అస్సలు పట్టించుకోవడం లేదు. కానీ నాకు వున్న ఒకానొక బలమైన ఊతానివి నువ్వే. నా వెన్ను, దన్ను నువ్వే రమా. నా బాధ్యతంతా నువ్వే చూసుకుంటూ నీ కన్నీళ్లతో నా మానసిక స్థైర్యాన్ని పెంచుతావు. నాకు ఎల్లవేళలా నీ తోడు ఉందన్న భరోసా నన్ను కార్యోన్ముఖుడ్ని చేసి ఏ ఆటంకం లేకుండా ఈ అనంతమైన జ్ఞాన సముపార్జన చేసేలా నన్ను ప్రోత్సహిస్తోంది. రమా, నిజానికి నేను కరుడుని కాను. నీ సహకారంతో నా అచంచలమైన జ్ఞానదాహాన్ని తీర్చుకుంటున్నాను. నా ఈ ప్రయాణంలో ఏ చిన్న ఆటంకం ఎదురైనా నాకు బాధ కలిగి, నా మానసిక ప్రశాంతతకు భంగం కలిగి నాకు ఆగ్రహం తెప్పిస్తుంది. నాకు కూడా ఒక హృదయం వుంది రమా. నేను చాలా నిరాశా నిస్పృహల్లో వున్నాను, కానీ నేను ఒక విప్లవం తీసుకొచ్చే పనికి బద్దుడనై వున్నాను. నా ఆశయ సాధనలో భాగంగా నా కోరికలను అణచుకోవాల్సి వస్తోంది. ఈ కారణంగా కొన్నిసార్లు నువ్వు, యశ్వంత్ కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనేది నిజం. కానీ ఈరోజు నేను ఒక చేత్తో ఉబికివస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ మరొక చేత్తో నీకు ఈ ఉత్తరం రాస్తున్నాను. మన "పట్లే"ను (యశ్వంత్) జాగ్రత్తగా చూసుకో రమా. వాడిని నువ్వు దండించవద్దు. ఒకసారి నేను వాడిని కొట్టాను. తనకి ఆ సంఘటనని మరలా గుర్తుకురానీయకు. మన యశ్వంత్ నీలో ఒక భాగం.

మన సమాజంలోని మానసిక, మత వివక్షలను, మరియు సామాజిక ఆర్థిక అసమానతలను నిర్మూలించే విధానాన్ని మనం తప్పక కనుక్కోవాలి. మన దైనందిన జీవితంలో పెనవేసుకొని ఒక భాగంగా మారిన ఈ వివక్షలు, అసమానతలకి చరమగీతం పాడి వాటికి సమాధి కట్టాలి. వీటిని మన సమాజంలోని ప్రజల జ్ఞాపకాల్లోంచి చెరిపివేయాలని మనం కోరుకోవాలి.

ఈ ఉత్తరాన్ని చదివేటప్పుడు నీ కళ్ళ వెంట ఉబికివచ్చే కన్నీళ్ళని నేను ఊహించగలను. నీ గుండె దుఃఖంతో భారంగా వుండివుంటుంది. నీ పెదవులు వణుకుతూ ఉండవచ్చు కానీ నీ భావోద్వేగాల్ని వెల్లడించగలిగే పదాలు నీ వద్ద లేవని నాకు తెలుసు రమా. నువ్వు చాలా బలహీనమైన మానసిక స్థితిలో ఉన్నావని నేనెఱుగుదును రమా.

> **సమాజంలో మనం ఒక దుర్భరమైన స్థితిలో వున్నాం కాబట్టి యశ్వంత్‌కు ఉన్నతమైన విద్యను అందిస్తావని ఆశిస్తున్నాను. యశ్వంత్‌కు మంచి బట్టలు అందించు మరియు తనకు శుచి, శుభ్రత, మంచి, మర్యాదలు నేర్పించు. యశ్వంత్ మనసులో ఒక ఉన్నతమైన ఆశయాన్ని నువ్వు కలిగించాలి.**

రమా, నువ్వు నా జీవితంలోకి రాకపోయివుంటే నా పరిస్థితి ఎలా వుండివుండేదో నేనూహించలేను. నువ్వు నా అర్థాంగివి కాకపోయివుంటే నా జీవితం ఎలా ఉండేది? జీవితంలో భోగభాగ్యాలు మాత్రమే కావాలని కోరుకునే వేరెవరైనా నన్ను ఈపాటికి వదిలిపెట్టి వెళ్లిపోయేవారు. పస్తులుండాలని, ఆవు పేడ కోసం వీధుల వెంట వెతుకుతూ వెళ్లాలని, ఆ పేడతో పిడకలు చేసి వాటిని పొయ్యిలోకి వాడుకోవడం ఎవరికి ఇష్టం ఉంటుంది? అటువంటి పిడకల వంటచెరకు కోసం బొంబాయి మహానగరంలో ఎవరు వెదుక్కుంటూ వెళతారు? చిరిగిపోయిన పాతబట్టలను ఇంట్లో కుట్టుకుంటూ, పేదరికంతో నిండిన నా మాటలు వింటూ, ఒక్క అగ్గిపెట్టెతో నెలంతా సర్దుకోవాలని, ఇంట్లో కొద్దిగా వున్న ఉప్పు, పప్పు, చింతపండుతో సర్దుకోవాలని చెప్పే నా బికారి మాటలు విని నీలా మరొకరు సర్దుకుపోగలరా?

నా మాటలను లెక్కచెయ్యకుండా నువ్వు నన్ను ఎదిరించి ఉంటే ఏం జరిగివుండేది? నా హృదయం పగిలిపోయి నా ఆశయానికి తిలోదకాలు ఇచ్చేవాడిని. నా కలలు చెదిరిపోయి నేను ఖిన్నుడనైపోయేవాడిని. నేను ఇన్నేళ్ళుగా ఓపికగా ఎదురుచూస్తున్న వాటన్నింటిని కోల్పోయేవాడిని. నా కోరికలు, ఆశలు, ఆశయాలు అన్ని అసంపూర్తిగా మిగిలిపోయి దుఃఖంతో, వేదనతో మిగిలిపోయేవాడిని. నేను ఎందుకు పనికిరానివాడిగా, చరిత్రహీనుడిగా ఉండిపోయేవాడిని.

నన్ను ఎంత జాగ్రత్తగా చూసుకుంటావో నీ గురించి కూడా అంతే జాగ్రత్త వహించు. నేను అతి తొందరలో తిరిగి నీ వద్దకొస్తాను. దిగులు పడకు రమా.

అందరిని అడిగినట్లు చెప్పు.

నీ,

భీమ్ రావ్,

లండన్,

30 డిసెంబర్ 1930.

*- తంగేడు డెస్క్*

నాటి కవిత

# ఆమె మారింది??



వకుళ వాసు, 99891 98334



ఆమె మారింది నిజమే
కట్టెలపొయ్యి నుంచి గ్యాస్ స్టౌవ్ కు
బట్టలుతకడం నుంచి వాషింగ్ మిషన్ వరకు

ఆమె మారింది నిజమే
రుబ్బురోలు నుంచి మిక్సి వాడటంకు
నల్లాకు మంచినీళ్ళు పట్టుడు దగ్గరనుండి
ప్యూరిఫైర్ నుంచి బాటిల్స్ పట్టి ఫ్రిజ్‌లో పెట్టుడు వరకు

ఆమె మారింది నిజమే
పెరట్లో కూరగాయలు తెంపుకొచ్చుడు నుండి
స్కూటిమీద రైతుబజార్ కి వెళ్ళడం వరకు
రాతెండి గిన్నెల్లో కూరలు వండుడు నుండి
ప్రెస్టీజ్ పాత్రల వాడకం వరకు
ఆమె మారింది నిజమే
మగవారితో సమానంగా చదువుల్లో
పోటీపడి ఉద్యోగాలు సంపాదించి
జీతం ఎంతొస్తదో నెలకోసారి మెసేజ్ లో
చూసుకొని కొన్ని క్షణాలు సంబరపడేవరకు...

ఆ తరువాత ఇంటి లోనని కార్ లోననీ పిల్లల స్టడీ లోననీ
అన్నీ ఆడవారిపేరుమీద తీస్తే వడ్డీరేటు తక్కువ చేసి ఇచ్చే
ప్రభుత్వ బ్యాంకుల నుండి భర్త వరకు తాను కోల్పోయిన
ఆర్థిక సాధికారతకు కుములుతూ

తనకు తానే అంతా నాకుటుంబం కోసమే కదా
అనుకుని సంభాళించుకుంటూ
మారని విధిరాతపై కొత్తగా
మారిన అనుకునే ఆమె మారింది నిజమే కదా...

# జారుడు బండ

**మనుషుల జీవితాల అవ్యవస్థిత లక్షణాన్ని చిత్రించిన ఆశా వర్కర్ కథ...**



రామాచంద్రమౌళి
93901 09993

ఉవ్వెత్తు నుండి దబాల్న దూకిన జలపాతంతోపాటు తనుకూడా అ పెద్ద జారుడుబండపై బడి జరర్ర్ర్ర్‌న జారి.. ఇంకా జారుతూ.. జారుతూ కిందికి.. ఇంకా కిందికి .. లోయల్లోకి.. అగాధాల్లోకి.. పర్వతం పైనుండి జరజరా జారుతున్న ఒక పెద్ద బండరాయిలా..., ఊపిరాడ్డం లేదు.. శరీరం గడ్డకట్టి పోయింది.. స్తబ్ధించి పోయింది తను. కొయ్యబారిపోయింది. ఆ అతివిశాలమైన పాకురు పట్టిన జారుడు బండ.. తెగిపోదు.. బల్లపరుపులా.. అతి వెడల్పుగా విస్తరించి.. దానిపై.. మనిషి.. తను నున్నని గాజుపలకపై జరజరా జారిపోతున్న ఇనుపగోళీలా.. దూసుకు పోతూ జారిపోతూ.. వచ్చీ వచ్చీ.. దబాలున ఆ లోతైన లోయలోకి కూలిపోయి.. తునాతునకలై.. విచ్ఛిన్నమైపోతూ.. ఛిద్రమై.. ఎర్రగా రక్తం.. విరజిమ్ముతూ.. ఆకాశమంతా అరుణారుణమై, ఒక్కసారిగా భయవిహ్వలతతో ఉద్విగ్నమై ఉలిక్కిపడి లేచి కూర్చుని పూర్తిగా చెమటపట్టిన శరీరం గజగజా వణికిపోతూండగా తనను తాను చూచుకుంది కోమల. తలపై ఎవరో ఓ పదికిలోల సుత్తెతో చటుక్కున బాది.. ఎదుట నిలబడ్డట్టు.. తల దిమ్మెక్కి ఏదీ అర్థంకావడంలేదామెకు. తాను స్పృహలోనే ఉందా అని మనసును వెదుక్కుంటోందామె.

కల.. అసలు భారతదేశాన్ని, ఆ మాటకొస్తే మొత్తం ప్రపంచాన్నే కరోనా మహమ్మారి గత ఐదు నెలలుగా తన మృత్యుతాండవంతో కరాళనృత్యం చేస్తూ వికటాట్టహాసంతో లక్షలమందిని పొట్టనపెట్టుకుని హైదరాబాద్‌లో కూడా ఎల్లెడలా 'లాక్‌డౌన్' లో ఊపిరాడకుండా ప్రజలందరినీ బంధించిన దుష్టకాలంలో..

ప్రత్యేకంగా వరంగల్లు నుండి ఇక్కడి హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌కు.. ఒక అద్భుతమైన సేవికగా గొప్ప ట్రాక్ రికార్డ్ ఉన్న ఒక 'ఆశ' వర్కర్ డిప్యుటేషన్ పై.. రప్పించబడి..., ఒక్కొక్కటిగా.. రాలుతున్న చూరునీళ్ళ చినుకులవలె.. జ్ఞాపకాలు తిరిగి స్పృహిస్తున్నట్టు.., ఓహో... తను ఒక సుదీర్ఘ కలగంటూ.. చచ్చి చావునోట్లోకి వెళ్తూ.. బతికి, అంతా సుదీర్ఘ కలా.. జారుడుబండ పైకి పతనమై.. హమ్మ...

అప్పటికి వరుసగా 22 గంటలనుండి గాంధీ హాస్పిటల్లోని కరోనా ఎమర్జెన్సీ వార్డ్లో, మధ్య క్షణం కూడా విశ్రాంతి లేకుండా పని చేస్తూనే ఉంది ఆశ వర్కర్ కోమల. ఒంటిపై పి.పి.ఇ కిట్.. ముఖంనిండా మాస్క్. ఎక్కడా శరీరం బయటికి కనబడకుండా మొత్తం కవరైపోయిన ఒక ఆస్ట్రనాట్ వలె వేషం. ఆ భీకర అవతారం కింద ఎవరెవరో తెలియని అందరూ అజ్ఞాతవ్యక్తులే. చుట్టూ అంతా మృత్యునృత్యం. ప్రతిరోజూ వందలమంది కరోనా పాజిటివ్ పేషంట్స్. ఎవరు ఎవరో తెలియని ఎందరివో రాకపోకలు. అందరిలోనూ గాఢ దుఃఖం. ఏ క్షణాన చావు తమను తన్నుకుపోతుందో అన్న భయం నిండిన కళ్ళు అందరివీ. డాక్టర్లు.., నర్సులు, ఎ.ఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు.. బయట వందల సంఖ్యలో పోలీసులు.. బయట ప్రపంచమంతా... హైదరాబాద్ మహానగరం.. దయ్యం వస్తుందని బెదిరించినప్పటి పసిపిల్లల్లా బిక్కచచ్చి.. కంటోన్మెంట్ జోన్స్, కర్ఫ్యూలు., మొత్తం జగత్తంతా స్తంభించిపోయి.. సకలమూ గప్ చిప్ ఎవరింట్లో వాళ్ళు.. ఎవరి గోడలమధ్య వాళ్ళు.. ఎవరి 'వర్క్ ఫ్రం హెం' గోల వాళ్ళది..

నగర వీధులన్నీ దుఃఖం వాసన. మృత్యువు వాసన.. కన్నీళ్ళ శుద్ధవాసన. కన్నీళ్ళలో తడుస్తున్నప్పుడు మనుషులు శుభ్రించబడి పునీతులౌతారా.. అని అనిపిస్తున్న పవిత్ర సమయమది.

కోమలకు అప్పటికి తాను రెండు రోజులుగా నిద్రపోలేదనీ.. మూడు రోజులుగా ఏ ఆహారాన్నీ ముట్టలేదనీ, ఐసియులో తన చేతుల్లోనే ప్రాణాలను విడుస్తున్న ఎందరో కరోనా

కథ

వ్యాధిగ్రస్తులకు వెంటిలేటర్స్, ఆక్సిజన్ పైప్స్, సెలైన్ బాటిల్స్ ఏర్పాటుచేస్తూ.. ఆక్సీమీటర్ లెవెల్స్ చూస్తూ... అవే కళ్ళలో మాయాక్రియల్లా కదులుతూ...

ఫ్రంట్ లైన్ వారియర్స్.. తాము. దైవదూతలు. ప్రాణదాతలు.. కదా అని ఏ భాషకూ అందని తృప్తిని ఆస్వాదిస్తూ,

కోమల మెలమెల్లగా పూర్తి స్పృహలోకొస్తూ., 2005లో... భారత ప్రభుత్వంలోని ఆరోగ్య మరియు కుటుంబ మంత్రిత్వశాఖ 'అక్రిడిటెడ్ సోషియల్ హెల్త్ ఆక్టివిస్ట్' అంటే ఆశ కార్యకర్తగా.. దిక్కు మొక్కు లేని సామాజికవర్గాల నిరుపేదలను ఆరోగ్య ప్రదాత వ్యవస్థతో సంధానం చేయగల పవిత్ర వృత్తిని ఎంచుకుని ఆ రోజు.. ఒక సన్నగా వాన చినుకులు కురుస్తున్న మధ్యాహ్నం.. తనూ శేఖర్.. ఇద్దరూ వచ్చి వరంగల్ డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయంలో రిపోర్ట్ చేసినప్పుడు, ఎంత సంతృప్తితో కూడిన చిరునవ్వో.. తనముఖంపై.. శేఖర్ కన్నుల్లో. అప్పటికి అతనికి తనకూ పెళ్ళై నాలుగు నెలలే అయింది.

"కోమలా.. మనం మనుషులమై పుట్టినందుకు మన జన్మను సార్థకం చేసుకుంటూ సమాజంలోని మన సహ మానవులకు సేవ చేయగల వృత్తిలోనే కొనసాగుతూ తరించిపోవాలె. అందుకే నేను ఇదిగో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ చేరిన. నువ్విప్పుడు ఆశ వర్కర్‌గా చేరినా. సరియైన దారినే ఎంచుకున్నం మనం.. కదా" నవ్వు.

శేఖర్ నవ్వితే పున్నమి వెన్నెల విరిసినట్టుండేది. ఇప్పుడు శేఖర్ ఎక్కడున్నాడో. ఒక నెలరోజుల కిందటే చెప్పిండు.. ప్రభుత్వంలో ఒక మంత్రికి అంగరక్షకునిగా వేశారని తనను. అది తన నిజాయితీకి, సమర్థతకూ ఒక గొప్ప గుర్తింపనీ అన్నాడు. కోమల తలెత్తి చూస్తే ఎదురుగా గడియారంలో మూడుగంటల పది నిముషాలు.. తెల్లవారుతుందా ఇక.

నాల్గవ అంతస్తు...ఐసియు వార్డ్ నిశ్శబ్దంగా.. ఒక పాములపుట్టలా భయంకరంగా ఉంది. సరిగ్గా అప్పుడే ఒక తుఫాను గాలి తెప్పలా తెల్లరంగు పిపిఇ కిట్టు ధరించిన వ్యక్తి చేతిలో ఏదో సెలైన్ బాటిల్‌తో పరుగెత్తినట్లు దూసుకు పోయిండు కోమల ప్రక్కనుండి. మనుషులను గుర్తుపట్టేట్టు లేదు. చటుక్కున అతని వీపు భాగాన్ని చదివింది. మార్కర్ పెన్నుతో పేర్లు రాసి ఉంటై వెనుక వీపుపై అందరికీ. డాక్టర్ రాజారావు అని ఉంది. హాస్పిటల్ సూపరింటెండెంట్. ఎవరికో ప్రాణాపాయం ఉంది. అందుకే ఆ పరుగు, కోమల అతనికి సహాయంగా ఉండేందుకు దిగ్గున లేచి అతని వెనుక పరుగెత్తింది. రెండు నిముషాల్లో... క్రితం రోజే తీవ్రమైన శ్వాసకోశ కరోనా సమస్యతో చేరిన నలభై ఆరేండ్ల కిషన్ రాథోడ్. చావుబతుకుల్లో..

డాక్టర్ రాజారావు చకచకా సెలైన్లోకి ప్రాణ రక్షకి ఇంజక్షన్ను సెలైన్లోకి ఇంజెక్ట్ చేస్తూండగా కోమల అతనికి చేయూతగా ప్రక్కనే స్టాండ్‌ను సెట్ చేసి.. పనిలో నిమగ్నమైపోయింది. ఆయన ఆమెను గుర్తుపట్టి "కోమలా" అన్నాడు. ఆమె పులకించిపోయింది.. ఆ చిన్న గుర్తింపుకే. ఒక మనిషికి ప్రాణదానం చేసే ఆ కీలక ప్రయత్నంలో ఎవరికీ అర్థంకాని ఒక దివ్య సంతృప్తినిచ్చే క్షణం అది. రాథోడ్ శ్వాస అందక గిలగిలా తన్నుకుంటున్నాడు. ప్రక్కనున్న సహరోగులు ఉద్విగ్నులై గమనిస్తున్నారు కళ్ళు మూసుకుని అంతా..! 'తాము కూడా' అన్న భయవిహ్వలతతో, మృత్యుభీతి అందరి చుట్టూ అగ్నివలయంలా. అప్పటికే గబగబా ఇద్దరు సీనియర్ డాక్టర్స్ ఉరికొచ్చిండ్లు. ఒకరు పల్మనాలజిస్ట్ రవిశంకర్, ఇంకొకరు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ నాగేందర్. అందరూ రాత్రింబవళ్ళు కరోనా పేషంట్స్ తో సహజీవనం చేస్తున్న వాళ్లే తమ ప్రాణాలకు తెగించి.

> **డాక్టర్ రాజారావు చకచకా సెలైన్లోకి ప్రాణ రక్షకి ఇంజక్షన్ను సెలైన్లోకి ఇంజెక్ట్ చేస్తూండగా కోమల అతనికి చేయూతగా ప్రక్కనే స్టాండ్‌ను సెట్ చేసి.. పనిలో నిమగ్నమైపోయింది. ఆయన ఆమెను గుర్తుపట్టి "కోమలా" అన్నాడు. ఆమె పులకించిపోయింది.. ఆ చిన్న గుర్తింపుకే. ఒక మనిషికి ప్రాణదానం చేసే ఆ కీలక ప్రయత్నంలో ఎవరికీ అర్థంకాని ఒక దివ్య సంతృప్తినిచ్చే క్షణం అది.**

తమ నూటా ఎనభైమంది ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు ఏ క్షణమైనా కరోనా సోకే పెను ప్రమాదం చాలావరకు పొంచి ఉంది. అప్పటికే ఆ కొద్దినెలల్లో ఇరవై ఆరు మంది.. డాక్టర్స్, సపోర్టింగ్ స్టాఫ్, ఆశ వర్కర్స్, పారిశుధ్య కార్మికులకు కరోనా ఇంఫెక్టై.. తొమ్మిదిమంది దాకా మరణించారు కూడా. ఆ సమాచారం రహస్యంగా ఉంచబడింది.

చుట్టూ ఉద్విగ్నతతో గుమికూడిన మొత్తం ఐదుగురు ఎక్స్‌పర్ట్స్. చేతనైనంత ప్రయత్నం చేస్తుండగానే.. పేషంట్ రాథోడ్ తుదిశ్వాస విడిచాడు.

ఆ కరోనా మరణం ప్రభావం ఎంత భయంకరంగా ఉంటుందంటే... పరమ హింస.. కొద్ది క్షణాలు. తర్వాత అకస్మాత్ శాశ్వత విముక్తి రప్పున ప్రాణాలు పోగానే.

డాక్టర్ రాజారావుగారు.. దీర్ఘంగా పిపిఇ కిట్లో నుండే నిట్టూర్చి.. దుఃఖంతో వెళ్ళిపోయాడు నిస్సహాయంగా.

సరిగ్గా అప్పుడే లోపలినుండి తన్నుకొస్తున్న దుఃఖంతోపాటే... కోమలకు ఎనిమిదవ తరగతి చదువుతూ తమ ఊర్లో ఒంటరిగా మిగిలిపోయిన తన ఒక్కగానొక్క బిడ్డ శైల జ్ఞాపకమొచ్చింది. ఎందుకో అప్పుడే చెరువులో నుండి ఒడ్డుపైబడి గిలగిలా కొట్టుకుంటున్న పర్కపిల్లలా కోమల హృదయం తండ్లాడింది.

ఆమె ఒంటినిండా దుఃఖమే. ఎందుకో అర్థం కాలేదు కోమలకు.

2

ఆ అర్ధరాత్రి ఒకటి ఇరవై నిముషాలు దాటి.., నిద్రిస్తున్న అగ్నిపర్వతంలా. లోపల



రాజకీయ కుట్రలూ కుతంత్రాలతో కుతకుతా ఉడుకుతున్న లావావంటి బయటికి కనబడని విషద్రవంతో కునారిల్లుతున్న ఆ ఆరంతస్తుల పాలరాతి భవనం ముందు... జడలు విప్పుకున్న రాక్షసిలా నిలబడ్డ మర్రి చెట్టుకింద.. సిమెంట్ చప్టాపై ఒంటరిగా తన చేతిలోని లోడెడ్ స్టెన్ గన్ బట్‌పై గడ్డాన్నానించి.. తీక్షణంగా చూస్తున్నాడు శేఖర్.

అతని మనసు అంటుకున్న అడవిలా ఉంది. హృదయం చాలా రోజులుగా చీముపట్టి సలుపుతున్న పుండులా ఉంది.

'అంగరక్షకుడు' తను. ఎవరికి.. పవిత్రమైన ప్రజాస్వామ్యంలో దేవుళ్ల వంటి ప్రజలకు ప్రాతినిధ్యం వహించవలసిన జననేతలకు.. రక్షణగా.. వాళ్ళకు ఎవ్వరి నుండి ప్రాణాపాయం ఏర్పడకుండా అప్రమత్తంగా కాపలా కాస్తూ.. రక్షిస్తూ.. పార్లమెంటరీ ప్రొవిజన్స్ అట్లా చెబుతూంటే... వాటిని మిస్‌యూజ్ చేస్తూ ఈ దేశంలో ప్రధానమంత్రి నుండి పంచాయితీ సర్పంచ్ దాకా.. అందరికీ గన్‌మెన్లే. అందరికీ వెంట కాపలా కుక్కలా ఒక స్టేటస్ సింబల్ వలె.. వెనుకా ముందూ, ఇరు ప్రక్కలా చేతుల్లో గన్స్‌తో... ఏమిటిది. ఆ చోటా మోటా సోకాల్డ్ నాయకుల నైతిక స్థితిగతులేమిటి. విలువలు ఏమిటి. వ్యక్తిత్వాలేమిటి, వాళ్ల కుట్రపూరిత నీచ రాజకీయ జీవితపు లోతుల్ని చూస్తే... ప్రజాస్వామ్యానికి పట్టిన శనివంటి ఈ దుర్మార్గులకా' మేము కాపలాకాస్తూ అపాత్ర రక్షణ కల్పిస్తున్నది అని లోలోపల కుమిలిపోయిన సందర్భాలెన్నో.

కాని ఏమీ చేయలేని నిస్సహాయత.. జీతంకోసం.. కుటుంబపోషణకోసం.. ఒప్పుకున్న ఉద్యోగానికి న్యాయం చేయడం కోసం.. మనసును చంపుకుని, ఆత్మ ఘోషిస్తున్నా అంతర్గత హింసను భరిస్తూ, ఎన్నాళ్ళిలా. నచ్చని పని చేస్తూ ఒక యంత్రంలా జీవిస్తూ.. ఊహూ...,

ఎవరో రచయిత రాశాడు మొన్న తను చదివిన కథలో. ఆత్మ అగ్ని. అది నిన్ను దహిస్తుంది. అంతిమంగా అది నిన్ను నిశ్శేషం చేస్తుంది' అని.

ఔను ఆత్మ అగ్ని. అది తన ఆత్మకు నచ్చని మొదట్లో గన్ మ్యాన్ నుండి మొదలుకొని సెక్యూరిటీ ఆఫీసర్‌గా... ఎదుగుతూ.. ఎందరెందరో మంత్రులకూ, విఐపిలకూ, కొన్నిసార్లు ఆహ్వానితులుగా వచ్చే దేశవిదేశ అతిథులకు సెక్యూరిటీ డ్యూటీలలో... కాని ఏ ఒక్కరోజూ ఈ దుర్మార్గమైన డ్యూటీని ఆనందించింది లేదు తను. ఇప్పటివరకు ఏ ఇరవై మందికంటే ఎక్కువే సోకాల్డ్ మంత్రుల దగ్గర పని చేయొచ్చు తను. కాని.. ప్చ్, ఐతే ఈ మధ్య పదేపదే ఆత్మ ప్రశ్నిస్తున్న విషయమేమిటంటే.. శేఖర్.. ఇట్లా నీ ఆత్మకు నచ్చని జీవితాన్నే జీవిస్తూ నీకు నచ్చినట్లు ఒక్క రోజు కూడా బ్రతకకుండానే చచ్చిపోతవా. అసలు నిజమైన నువ్వు ఏమిటి అని గుండెల్లోకి గునపంలా ప్రశ్నను గుచ్చుతున్నపుడు... ఇక వశం కావడంలేదు తట్టుకోవడం. ఈ లివింగ్ ఎగనెస్ట్ ద విల్.

సిగ్గేస్తోంది శేఖర్కు ఈ మధ్య నిరంతరం. బండపై యాసిడ్ పడగానే బుస్సుమని పొంగినట్లు.. ఆత్మ లోపల తీవ్రంగా దహిస్తూ హింసపెడ్తోంది.

కథ

ఎట్లా... ఎట్లా... హా...

ముఖ్యమంత్రిని గద్దె దింపేందుకు రహస్యంగా వివిధ అపోజిషన్ నాయకులతో, కోవర్టులైన ఇంటి దొంగలతో కోట్లకొద్ది రూపాయల బేరాలతో.. కాంట్రాక్టులతో, వ్యూహాలతో... క్విడ్ ప్రోకో.. లతో, తెలుస్తోంది అంతా.

రాజకీయులకూ, కుట్రదారులకు తెలిసీ తెలియని విషయాలేమిటంటే.. తమ రహస్యాలలో చాలావరకు తమ గన్‌మెన్‌లకూ, డ్రైవర్లకూ అన్నీ తెలుస్తాయన్న సంగతి. అందుకే ఆ దుర్మార్గులు కీలకమైన చోట మామూలు సెక్యూరిటీని ఇంటికి పంపించి.. అతినమ్మకమైన ఒకరిద్దరిని ఉంచుకుని... అనివార్యంకదా ఎవర్నో ఒకర్ని నమ్మడం.

ఇప్పుడు ఆ నమ్మకమైన వ్యక్తి.. తను. ముఖ్యమంత్రి రాత్రి తొమ్మిది నుండి పదకొండుదాకా మొత్తం రెండు వేలకోట్ల రూపాయలు ఎవరెవరికి చేతులు మారి... ఎప్పుడెప్పుడు ఎవరిద్వారా ఎలా డబ్బు పంపిణీ జరగాలి అనేదానికి ప్రణాళికను ఫైనల్ చేసి.. కొందరు నిష్క్రమించిన తర్వాత... మిగిలిన ఒకరిద్దరితో మందు పార్టీ... ఒంటిగంట తర్వాత... వాళ్లు కూడా వెళ్లిపోయారు.

శేఖర్ ఒక్కసారిగా గుండుసూది గుచ్చుకున్న గాలిబుడగలా భళ్ళున పగిలి ముడుచుకుపోయాడు. హత్యా వధా ఒక్కటి కాదని ధర్మమీమాంస పుస్తకంలో చదివాడు తను ఈ మధ్య. ఒకణ్ణి ఏ వ్యావహారిక కారణం వల్లనైనా చంపితే అది హత్య. అది శిక్షార్హమైంది. కాని ప్రజాకంటకుణ్ణి, సామాజిక శత్రువును నిర్మూలించడం అది వధ. కలుపు నిర్మూలన, ఇది ప్రశంసార్హమైందీ, వేడుకగా పండుగ చేసుకోదగ్గదీ అని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఇప్పుడీ మంత్రి వల్ల ఎంత అనర్థం జరుగబోతోందో తెలుసు తనకు. కొంతమేరకు ధర్మం ధ్వంసమౌతోంది. ప్రభుత్వం పతనమౌతోంది. వ్యక్తిగతంగా పరమనీచుడైన ఒక దుర్మార్గుని నిర్మూలన అవశ్యమైన ఒక చికిత్స వంటిదేగదా, దుష్టాంగ నిర్మూలన. శేఖర్ మొబైల్ మోగింది. ఉ. మంత్రే.

టయోటా ఫార్చ్యూనర్‌ను స్టార్ట్ చేసి భవనం పోర్టికో దిక్కు కదుల్తూ, గబగబా ఒక సందేశాన్ని తన మొబైల్లో రికార్డ్ చేశాడు.. ఒక నిముషం నిడివి.

'ఆత్మను చంపుకుని పరమ దుర్మార్గులకు రక్షకులుగా వ్యవహరించడం.. ఒక రకంగా దేశద్రోహమే. ఈ క్షణం నేను నా ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాను'.

బాగా తాగి.. ఊగుతూ.. శృంగార విఫలతవల్ల చితికిన మనసుతో ఒక్కో మెట్టు దిగుతూ వస్తున్న మంత్రి గన్ రేంజ్‌లోకి రాగానే ట్రిగ్గర్‌ను నొక్కిండు శేఖర్. తుపాకీ గుళ్లు ఒక జెట్‌లా అతని శరీరంలోకి దూకుపోయి, అంతా... ఎర్రగా రక్తం.. ఎగజిమ్మి, తిరిగి వచ్చి ఫార్చ్యూనర్‌లో శేఖర్ ఒక యోగిలా ప్రశాంతంగా కూర్చున్నాడు చేతిలో నిర్మూలనాయుధంతో.

సరిగ్గా ఆ కల్కి గాంధారి వేళ.. అక్కడ శేఖర్, కోమలల కూతురు శైల..

3

"శైల అంటే అర్థం ఏమిటే నాయినా " అనడిగింది శైల ఒకరోజు.. తను మూడవ క్లాస్ చదువుతున్నప్పుడు తండ్రి శేఖర్‌ను. అప్పుడు పల్లెటూర్లోని ఆ చిన్న ఇంట్లో పీటపై కూర్చుని కూరగాయలు కోస్తూ అమ్మ కోమల కూడా ఉందక్కడ.

"శైల అంటే పర్వతం లేక పెద్ద కొండ అని అర్థం బిడ్డా. పర్వతం ఒకచోట ఉంటే ఇక ఎప్పుడూ కదలక మెదలక అక్కడే ఉంటదికదా స్థిరంగా, అట్లనే నువ్వుకూడా స్థిరచిత్తంతో జీవితంల బాగా చదువుకొని పైకి రావాలె. మీ అమ్మ నేను బాగా చదువుకోవాలని ఎంతో అనుకున్నం. కాని మాకు ఆ అదృష్టం దక్కలేదు. స్థిరమైన జీవితం దొరుకలేదు మాకు. నీకు మేమున్నంగదా. మంచిగ చదువుకొని పెద్దగైనంక కలెక్టరమ్మవు కావాలె నువ్వు సరేనా నాన్నా" అని అన్నడు నాన్న.

అమ్మ కోమల ఒట్టిగనే నవ్వింది ఆశగా శైలదిక్కు చూస్తూ.

అర్ధరాత్రి. చీకటి. ఒంటరిగా ఇంట్లో..

"శైల అంటే పర్వతం లేక పెద్ద కొండ అని అర్థం బిడ్డా. పర్వతం ఒకచోట ఉంటే ఇక ఎప్పుడూ కదలక మెదలక అక్కడే ఉంటదికదా స్థిరంగా, అట్లనే నువ్వుకూడా స్థిరచిత్తంతో జీవితంల బాగా చదువుకొని పైకి రావాలె. మీ అమ్మ నేను బాగా చదువుకోవాలని ఎంతో అనుకున్నం. కాని మాకు ఆ అదృష్టం దక్కలేదు. స్థిరమైన జీవితం దొరుకలేదు మాకు. నీకు మేమున్నంగదా. మంచిగ చదువుకొని పెద్దగైనంక కలెక్టరమ్మవు కావాలె నువ్వు సరేనా నాన్నా" అని అన్నడు నాన్న.

ఆశ వర్కర్‌గా ప్రత్యేకంగా కలెక్టర్ చేత ఎంపిక చేయబడి వరంగల్ అర్బన్ జిల్లానుండి హైదరాబాద్ గాంధీ దవాఖానకు కరోనా పేషంట్స్‌ను చూచుకోడానికి ఫ్రంట్ లైన్ వారియర్గా వెళ్ళింది కోమల. రెండు నెలలాయె ఇప్పటికి ఇంటికి రాక. నాన్న శేఖర్‌ది వీఐపిల సెక్యూరిటీ డ్యూటీ. కదలడానికి వీలే పడదు. ఇక్కడ తనకు వరంగల్ నగరంలో ఉన్న కార్పొరేట్ బడి వాళ్ళు నాన్నతో మొత్తం సంవత్సరం ఫీజు కట్టించుకుని 'ఆన్ లైన్' క్లాస్‌లు నడుపుతున్నారు. తను బాగ చదువుకుని పైకి రావాలని నాన్న కోరిక. అందుకే ఆన్‌లైన్ క్లాస్‌ల కోసం ఒక స్మార్ట్ ఫోన్, దానికి ఇంటర్నెట్ కావాలంటే రెండు రోజులల్ల పంపించిండు నాన్న ఒక పోలీస్ అంకుల్‌తోని. ఎంత సంతోషం కలిగిందో ఆ స్మార్ట్ ఫోన్‌ను వాడ్డం మొదలు పెట్టిన రోజు. తమ ఇంటి ప్రక్కనే ఉన్న తమ బడిలోనే పదోతరగతి చదివే జాన్సన్ వచ్చి "మీ నాయిన నాకు ఫోన్ చేసి ఆ స్మార్ట్‌ఫోన్‌ను ఎట్ల వాడాలో చెప్పుమన్నడు నీకు" అని.. ఫోన్‌ను చేతిలోకి తీసుకుని అటుఇటు తిప్పి, "అరే ఇది సెకండ్ హ్యాండ్‌ది. ఐనా ఫర్వాలేదు..

కథ

సాంసంగ్. మంచి కంపినే..'' అని ఇంటర్నెట్ ఎట్ల ఆన్ చేయాల్నో.. టివికి ఎట్ల కలుపాల్నో చెప్పి 'ఆన్‌లైన్' లెక్కల సారు క్లాస్ మొదలయ్యేదాక ఉండిపోయిండు. శైలకి ఎంతో ఆనందం కలిగి ఉక్కిరిబిక్కిరైపోయింది. అంతా కొత్తకొత్తగా, జాన్సన్ పోయిన తర్వాత మగ పిల్లాని గాలి తాకినట్లై... ఏదో పిచ్చిపిచ్చిగా అనిపించింది కాస్సేపు. ఐతే గంటలు గడుస్తున్న కొద్దీ.. ఎందుకో జాన్సన్ మళ్ళీ వస్తే బాగుండునని కూడా అనిపించింది శైలకు. ఒంటిగంటదాకా ఆన్‌లైన్ క్లాస్ నడిచింది. కాని పాఠం ఏమీ అర్థం కాలేదు. తరగతి గదిలో కూర్చుని సార్ చెబుతున్నపుడు అర్థమైనట్లు లేదది. ఏమిటో. అమ్మ ఫోన్ చేసింది. దవాఖానలో కరోనా పేషంట్లతో చాలా రద్దీగా ఉందనీ.. కరోనా లాక్‌డౌన్ వల్ల బయటికి అస్సలే పోవద్దనీ.. మళ్ళీ రేపుగానీ తర్వాతగానీ చేస్తాననీ చెప్పి పెట్టేసింది.

మధ్యాహ్నం అన్నం వండుకోవడం.. ఏదో ఒక కూర.. పచ్చడి. తిని మళ్ళీ స్మార్ట్‌ఫోన్. దాంతో ఎంతసేపు గడిపినా... ఇంకా ఇంకా దాంతోనే గడపాలని విపరీతమైన కోరిక. ఏమేముంటయో దాంట్లో.. అన్నీ చూడాలని ఆతురత. కాని నాన్న ఈ సెకండ్ హ్యాండ్ సెట్టు ఎందుకు పంపిండో. కొత్తదైతే బాగుండు.

ఇంతలోనే... మధ్యాహ్నం మూడౌతూండగా జాన్సన్ వచ్చిండు మళ్ళీ 'శైలా' అని పిలుచుకుంటూ. వస్తూ వస్తూనే "నీకు ఫోన్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాలె.. ఫ్రీగనే ఉన్నవా'' అని అదోరకంగా మత్తుగా చూచి.. ఏదో కవ్వింత. శైలకు ఒళ్ళు జల్లుమంది.

"చెప్పు'' అంది అప్రయత్నంగానే.

అప్పటికే శైల టివిని చూస్తోంది. జాన్సన్ అటు చూస్తే... "అర్జున్ రెడ్డి'' సినిమా వస్తోంది. సినిమాలో శృంగార సన్నివేశాలు చూస్తూ జాన్సన్ శైలదిక్కు చూశాడు కావాలని.

శైల విభ్రమంతో చూస్తూ.. ఆమె ముఖమంతా జేవురురంగు, వాంఛోద్విగ్నత.

"బాగుందా అట్ల'' అని అంటూ జాన్సన్ ఆమె చేతిలోని ఫోన్ను లాక్కుంటూ. కావాలని ఆమె చేయికి తాకి.. ఇంకా విజృంభించి.. పైపైకి..

"ఈ స్మార్ట్‌ఫోన్ సెకండ్ హ్యాండ్ అని చెప్పినగదా. వాడు దీన్ని వాడుకున్నప్పటి కొన్ని ప్రోగ్రాంస్ ఉన్నై దీంట్లో. ఇదిగో దీన్ని నొక్కి చూస్తే.. అవన్నీ కనిపిస్తై నీకు. చూడు. నేను మళ్ళీ రాత్రికి వస్తా ఏడు గంటలకు. ఒ.కె నా'' అని జాన్సన్ శైల కన్నుల్లోకి క్షణం సేపు సూటిగా చూచి..

"ఒ.కె. ఏడింటికొస్తవా'' అంది.

"ఔను... రెడీగా ఉండు'' అని తుఫాన్‌లా వెళ్ళిపోయిండు జాన్సన్.

రెడీగా ఉండడం దేనికి. ఆన్‌లైన్ క్లాస్‌ల గురించి చెప్తాడా. సరిగ్గా అప్పుడే శైల వాళ్ళ ఇంటి ప్రక్కనే ఉన్న ట్రాక్ పైనుండి ఏదో రైలు కూతవేస్తూ అతివేగంగా వెళ్ళిపోయింది. ఆమె గుండెకూడా అట్లే వేగంగా..

> **తమ ఇంటి ప్రక్కనే ఉన్న తమ బడిలోనే పదోతరగతి చదివే జాన్సన్ వచ్చి "మీ నాయిన నాకు ఫోన్ చేసి ఆ స్మార్ట్‌ఫోన్‌ను ఎట్ల వాడాలో చెప్పుమన్నడు నీకు'' అని.. ఫోన్‌ను చేతిలోకి తీసుకుని అటుఇటు తిప్పి, "అరే ఇది సెకండ్ హ్యాండ్‌ది. ఐనా ఫర్వాలేదు.. సాంసంగ్. మంచి కంపినే..'' అని ఇంటర్నెట్ ఎట్ల ఆన్ చేయాల్నో.. టివికి ఎట్ల కలుపాల్నో చెప్పి 'ఆన్‌లైన్' లెక్కల సారు క్లాస్ మొదలయ్యేదాక ఉండి పోయిండు. శైలకి ఎంతో ఆనందం కలిగి ఉక్కిరి బిక్కిరైపోయింది.**

శైలకు చిత్రంగా, గమ్మత్తుగా, మత్తుగా అనిపిస్తుండగా.. బయటి తలుపులకు గొళ్ళెం వేసుకుని.. టి.వి ముందు కుర్చీలో కూలబడ్డే...

టైం చూస్తే... ఐదున్నర.

జాన్సన్ ఏడు గంటలకొస్తానన్నాడు. ఇంకా గంటన్నర. తొందరగా వస్తే బాగుండు. ఎందుకో జాన్సన్ కావాలనిపిస్తోంది. ఎందుకు.

'దీన్ని అడొలసెన్స్ ఏజ్ అంటారు' అని చెప్పింది టీచర్ మొన్న జాన్సన్ ఇంట్లో ఆన్‌లైన్ క్లాస్ విన్నపుడు. అడొలసెన్స్ వయసులో హృదయం అతి సున్నితంగా స్పందిస్తూ ఉద్విగ్నంగా ఉంటుంది అని కూడా చెప్పింది టీచర్.

శైలకు ఇంతకు ముందు జాన్సన్ చెప్పిన ఆ సెకండ్ హ్యాండ్ స్మార్ట్‌ఫోన్ ఓనర్ స్వంత ప్రోగ్రాంస్‌ను చూడమని జాన్సన్ చెప్పిన సంగతి జ్ఞాపకమొచ్చి.. ఆ కీ ని నొక్కింది. చటుక్కున ఒక ఫుల్ స్క్రీన్ ఓపెనై ఒక శృంగార చిత్రం మొదలయ్యింది. అయ్యో.. తప్పు చేస్తోంది తను.. చెడ్డపని.. పిల్లలు చేయకూడని చెడ్డపని. ఇప్పుడెట్లా. ఈ రోజు తనకు అనవసరమైన పూర్తి స్వేచ్ఛ లభించింది.

జాన్సన్‌ను రాత్రి ఏడు గంటలకు రావద్దని చెప్పాలె. వస్తే అతను ఏమేమి చెప్తాడో ఇంకా. చెప్పడమే కాకుండా ప్రాక్టికల్స్ ఏదైనా చేస్తాడా.. తను ఒంటరిగా ఉంది కాబట్టి.. ఛ్ఛ.. ఏమో. జాన్సన్‌కు ల్యాండ్‌ఫోన్ నంబర్ కలుపబోయింది. కాని కలుపలేక. 'జాన్సన్ రావాలనే ఉందా తనకు' డయలింగ్ ఆపేసింది. చేతిలోని కొత్త పాత మొబైల్‌లో ఇంకా రతికార్యం జరుగుతూనే ఉంది.

బయట వర్షం మొదలైంది ఎప్పుడో. శైలకు ఆ స్పృహే లేదు.

చేయి చాపకముందే సకల సౌకర్యాలూ, అవకాశాలూ, అన్ని సుఖాలూ అందుబాటులోకి వచ్చి ఒడిలో వాలుతున్న ఈ అతిస్వేచ్ఛాయుత సందర్భంలో..

ఎనిమిదవ తరగతి చదువుతున్న శైల కంపిస్తున్న చిగురుటాకులా చలించిపోతూ.. కళ్ళు మూసుకుంది.. మొబైల్‌లో నడుస్తున్న సినిమా బాపతు ఆ స్త్రీ మత్తెక్కించే సన్నివేశాలు... శైలను ఒక రకంగా దహించివేస్తోంది. ఆమెలో వేడెక్కిన రక్తం జరజరా త్రాచుపాములా

కథ

ప్రాకుతూ పిచ్చెక్కిస్తోంది.

శైల ఒళ్ళంతా పట్టిన చిరు చెమటతో ఆనందిస్తుండగా.. ఐదు నిముషాలు తక్కువ ఏడుకే జాన్సన్ వచ్చి బెల్ నొక్కి..

ఇప్పుడు జాన్సన్ ఏమేమి చెబుతాడో..

ఆమె శైల సహకరిస్తూ అంగీకరిస్తుందా.. వాడు అతిశక్తివంతమైన మొబైల్ మీడియా.. మాక్స్ ప్లేయర్‌లూ, హెచ్.డి. మస్సాజ్ పోర్నో సైట్లూ మీడియలో కోకొల్లలుగా వెల్లువెత్తుతున్న ఈ కాలంలో ఏ టీనేజరైనా.. టెంప్టౌతుంది. ఇండక్షన్ మరి.

బయట చటుక్కున మొదలైన వాన ముదిరి.. జడివానగా మారుతూండగా.. జాన్సన్.. శైలకు మొబైల్‌లో ఒక పూర్తి పోర్నో సైట్ను ఓపెన్ చేసి ముందుంచాడు. జాన్సన్‌కు ఈ మొబైల్ ఆపరేషన్సన్నింటినీ ఒక ఇంటర్ ఫ్రెండ్ నేర్పిండు.

శైల కొత్త అనుభూతుల్లో పరమానం దంగా చూస్తోందంతా. ఆమెకు చాలా దాహంగా ఉంది. కొత్తగా కూడా ఉంది. అన్నీ కావాలనిపిస్తోంది.

ఒక పావుగంట తర్వాత వివశయై శైల జాన్సన్ దిక్కు చూస్తుండగా.. ఆమెను అతను తనపైకి లాక్కుంటే.. ఆ పసిమొగ్గ వాలిపోయింది మత్తుగా. చుట్టూ ఎన్నో మిఠాయిలను ఒక పసివాని ముందుంచి చోద్యం చూస్తున్నట్లు... ఈ వ్యవస్థ.. ఈ అవకాశాలు... ఈ తరాన్ని భ్రష్టుపట్టిస్తున్న వర్తమానంలో ఎవరు ఎవరిని నిందించాలో అర్థంకాదు. ఈ రాత్రంతా ఇక్కడే ఉండి పోనా శైలా, బయట వర్షం కురుస్తోంది కదా'' అని గోముగా జాన్సన్ అంటే,

'ఊఁ' శైల మత్తుగా అని,

వర్షం ఉధృతి పెరిగింది. రైలు ఒకటి గర్జిస్తూ వేగంగా వెళ్ళిపోతూంటే.. శైల కళ్ళు మూసుకుంది హాయిగొలిపే నిద్రలోకి జారుకుంటూ.

మర్నాడు జాన్సన్‌కు సకల మొబైల్ విద్యలను నేర్పే ఇంటర్ స్నేహితుణ్ణి తీసుకొచ్చాడు జాన్సన్ శైల దగ్గరికి. ఆ ఫైరోజు మరో ఫ్రెండ్. జాన్సన్ "ఎంజాయ్ శైలా'' అన్నపుడు, ఎందుకో శైల జాన్సన్ చెంపపై బలంగా ఒక చరుపు చరిచి.. "గెటవె ఫ్రం మై హౌజ్... మా నాన్నకు చెబుతా ఇప్పుడే మొబైల్లో. థింక్ ఏం జరుగుతుందో. సెక్యూరిటీ ఆఫీసర్ ఆయన షూట్ చేస్తాడు మీ అందర్నీ'' అని అరిచింది శైల పిచ్చిపట్టినట్టు.

ఆ రాత్రంతా ఒక్కక్షణం కూడా నిద్రపోకుండా గడిపి ఆత్మావలోకన చేసుకున్న శైల అమ్మ కోమలకు ఒక మెసేజ్ పెట్టింది. "అమ్మా.. ఇక్కడ ఆన్‌లైన్ క్లాస్‌లు లేకుంటే మునిగిపోయేది ఏమీలేదు. నేను మీ దగ్గరికి గాంధీ హాస్పిటలుకు రేపు ఉదయం వచ్చి కలుస్తా. మీ రక్షణ కావాలె నాకు''

వెళ్ళి పైన ఒక బల్లి పడ్డ తర్వాత మలినమైన శరీరాన్ని శుభ్రపర్చు కోవాలనుకున్నట్టు శైల తన వాష్‌రూంలోకి వెళ్ళిపోయింది.

లోపలికి వెళ్ళగానే శైల చేసిన మొట్ట మొదటిపని చేతిలోని మొబైల్ ఫోన్‌ను కమోడ్ హోల్‌కి విసిరి నిండా నీళ్ళతో ఫ్లష్ చేసి.. సరిగ్గా అప్పుడే వస్తున్న రైలు శబ్దం శైలకు ఎంతో కొత్తగా, గొప్పగా, ఉత్సా హంగా వినిపించింది.. ఆ క్షణం.

4

మనుషుల జీవితాలు ఎవరికివారివే ఐన స్వతంత్ర వ్యవస్థలా..? సామూహిక సాపేక్షాలా?

కవిత

# దిక్కారస్వరం



**వేణుశ్రీ**, 83280 67855



సీ. నాటికవులురాజు నాశ్రయమొందుచు
కావ్యాలనర్పించి కష్ట పడక
భోగలాలసులైన భూపతులుపొగడ
శృంగారకావ్యాల సొంపుగాను
కావ్యనాయికలను ఘంటానసృష్టించి
రాజులనొప్పించ రాసినారు
కావ్యాలరాజుల కంకితమీయక
దిక్కరించినకవి దిగ్గజమ్ము

తే. సాటికవులెన్ని జెప్పిన పాటిగొనక
తండ్రిమాటకుయిడుముల తనయుడుబడె
అట్టివాడికేపోతన్న అంకితమ్ము
పొసగనొసిగిన కవిరాజు పుట్టెనిచట

వ్యాసం

# తెలుగులో తొలి ఆద్యమకుట శతకం “నీవు”

“నీవు” శతకంలోని కొత్తదనం చూపించిన వ్యాసం...



గాజుల రవీందర్
98482 55525

తెలుగు సాహిత్యంలో శతకం విశిష్ట ప్రక్రియ. తెలుగులో కవిత్వం వెలువడిన తొలిదశనుంచే శతకాల అంశాలు, లక్షణాలు కనిపించాయి. సుమతీ శతకం వేములవాడ బద్దెగుడు రచించిందేననే అభిప్రాయాలు పలువురు సాహిత్య చరిత్రకారులు ఇటీవల వ్యక్తం చేశారు. కాగా 10వ శతాబ్దంనుండే శతకరచన మొదలయింది. ఎన్ని ప్రక్రియలు అవతరించి కాలక్రమంలో నశించినా ఈ నాటికీ దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతున్న ప్రక్రియ శతకం మాత్రమే.

శతకం అనగానే వంద పద్యాలు అని ఒక స్ఫురణ కలిగినట్లుగానే ఏదో ఒక మకుటం ఉండడం కూడా ఒక లక్షణం. సుమతీ, భాస్కరా, సర్వేశ్వరా వంటివి ఒకే పదం కలిగిన మకుటాలు. విశ్వదాభిరామ వినురవేమ వంటివి ఒక పాదం మకుటంగా కలవి. దాశరథీ కరుణాప యోనిధీ వంటివి వృత్తపద్యాలలో సగం పాదం వరకు ఆక్రమించినవి. ఇంక సీసపద్య శతకాల్లో ఎత్తుగీతిలోని రెండు పాదాలు మకుటంగా ఉన్నవి కూడా ఉన్నాయి. “భూషణ వికాస శ్రీధర్మపుర నివాస, దుష్ట సంహార నరసింహ దురితదూర” వంటివి. ఈ మకుటాలన్నీ పద్యాంతంలో పాదాంతంలోనే పాటించడం జరిగింది. మకుటం ఒక సంబోధనగా అవికూడా ఏదో ఒక దైవాన్ని ఉద్దేశించినవే ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల సామాజి కాంశాలు ఇతివృత్తాలుగా వెలువడిన శతకాలలో మకుటాలు వేరు వేరు విధాలుగా ఉన్నాయి.

ఈమధ్యకాలంలో డా॥ గంద్ర లక్ష్మణరావు రచించిన నీవు శతకం విలక్షణంగా ప్రయోగించడం జరిగింది. మకుటం అంటే కిరీటం. కిరీటం తలమీద ఉండాలికాని చివరన పాదాంతంలో ఉండ డమేమిటి? అని భావించి ముందే మకుటాన్ని ప్రయోగించి రచించారు. మకుటం చివరన ఉండడం వలన పద్యరచనలో సౌకర్యం ఎక్కువ. ఒక సంబోధన చివర గణంగానో రెండు




గణాలుగానో ఉంటే మిగతా పద్యమంతా యథేచ్ఛగా వాడుకోవచ్చు. వృత్తాలలో మత్తేభ, శార్దూలాలకు ఒకే మకుటం ఉపయోగించవచ్చు. అట్లే ఉత్పల చంపకమాలలకు.

ఎక్కడో కొందరు ఒక పదాన్ని మకుటంగా ఎంచుకొని ఆ పదంగాని ఆ అర్థం వచ్చే మరోపదం గాని ఎక్కడైనా ఉపయోగించినవి కూడా ఉన్నాయి. ఆచార్య రావికంటి వసునందన్ ‘శ్రీచరణ శరణాగతి’ వేయిపద్యాల శతకం. ప్రతిపద్యంలో చరణం అని అర్థం వచ్చే పదం ఉంటుంది. కాని ఒకేపదం ఒకేచోట ఉండే నియమం పాటించబడలేదు. ఇట్లాంటివి అరుదుగా ఉన్నాయి.

మకుటం ముందుండడం వలన అది ఒక పదమైనా, రెండుపదాలైనా, అర్ధపాదమైనా, పాదమైనా మొదట ఉండే గణం, ప్రాస, మొదటి పాదంలో యత్యక్షరము మారదు. అది తప్పక పాటించవలసిన కట్టుబాటుగా కవి తానే స్వయంగా ఏర్పాటు చేసుకున్నట్ల వుతుంది. శతకం మొత్తం ఒకే ప్రాసలో ఉండి తీరాలి. అవే గణాలతో మొదలు కావాలి. అట్లాంటి నియమాల కట్టుబాట్లు ఉన్నప్పటికీ డా. గంద్ర లక్ష్మణరావు నీవు శతకాన్ని అలవోకగా రచించడం విశేషం.

ఏక ప్రాస శతకం కూడా గతంలో రంయ్యాల వేంకట లక్ష్మీనరసింహా

వ్యాసం

చార్యులుగారు సురగిరి శతకం రచించారు. అయితే అందులో మకుటం చివరనే ఉంది. ఈ శతకంలో మకుటం ముందే ఉండడం విశేషం.

'నీవు' అనే మకుటం ఎదుటి వారిని ఉద్దేశించినట్లుగా కనపడుతుంది. ఇందులో నీవు అని పరమాత్మ స్వరూపాన్ని ఉద్దేశించి అనేక భావాలు వెలయించారు. ఉపనిషత్తుల్లో 'తత్త్వమసి' అది నీవయి ఉన్నావు అని ఏ అర్థంలో చెప్పబడిందో ఆ అర్థంలో "నీవు"ను ప్రయోగించారు.

శతకం మొత్తం ఉత్పలమాలలో నీవుతో ప్రారంభించి రచించారు. 111 పద్యాలు నీవుతోనే మొదలవుతాయి.

అక్కడక్కడా సంబోధన వలె, అక్కడక్కడ ఆయన విశేషాలు వర్ణించినట్లుగా నీవు కనపడుతుంది. అన్ని భక్తి శతకాలలో వలె ఇందులో ఒక దైవాన్ని గురించిగాని, ఒక క్షేత్రాన్ని గురించి గాని చెప్పలేదు. ఎక్కడా ఏ దైవం పేరుకూడా ప్రస్తావించలేదు. కేవలం పరబ్రహ్మ స్వరూపాన్ని మాత్రమే వ్యక్తం చేశారు. అత్యంత జటిలమైన వేదాంత విషయా లను ఎంతో సులువుగా తేలికైన పదాలలో

> **పూలకు** అందమైన రూపాన్ని ఇచ్చేది నీవే, వాటిలో తీయని తేనెలను కూర్చేది నీవే, వాటిపట్ల ఆకర్షితమై తుమ్మెదలను చుట్టు తిరిగేటట్లు చేసేది నీవే అయినట్లు మనిషికి కూడా ఈ సృష్టిలో ఎన్నో అందాలు, ఆకర్షణలు ముందుంచి, వాటిపట్ల వ్యామోహితుడయేటట్లు చేసేది కూడా నీవేనని మమ్ములను భ్రాంతిలో పడవేసేవాడవు నీవే నని ఆ పరమాత్మను స్తుతించడమూ సున్నితంగా విమర్శించడమూ రెండూ చేశారు. అంతేకాదు మనిషి అసత్యములైన, తాత్కాలికములైన అందాల పట్ల ఆకర్షితులై అందులో ఎట్లా చిక్కుకొని పోతారో మనకు ఒక హెచ్చరిక వంటిది చేశారు.



ఆద్యమకుటంతో రచించి తెలుగు కవిత్వంలో ఒక వినూత్న ప్రయోగానికి నాంది పలికారు.

నీవు సమస్తమై నిలిచి నిత్యవిశేషముగా రహించుటన్

నీవె స్వరూపమై జగము నిండను చేరిన చేతనత్వమై

నీవే యనంతకాలముల నిద్దపు కాంతులు నాత్మరూపమై

నీవె మహత్వ తత్త్వమని నిన్ను మనమ్మున నే దలంచెదన్

ఇది అంకిత పద్యం వలె రచించారు. సమస్తము తానై, జగమే స్వరూపమై, అనంతకాలాలలో కార్యములు తానై, సర్వకాల సర్వావస్థలయందు తానై ఉన్న స్వరూపమేదో దాన్ని మహత్వ తత్త్వమని భావించారు. ఇది వేదాంతసారము. ఉపనిషత్తుల్లో బోధించిన సత్యము. అనేక ఉపనిషత్తులలో పరబ్రహ్మను గురించి విపులంగా చర్చించడం జరిగింది. ఈశ, కేన, కఠ, ముండక, మాండూక్య మొదలైన పది ప్రధాన ఉపనిషత్తులలో ఆయా దేవతల పేర్లు లేక పరమాత్మను గురించి చర్చించి వివరించడం ఉంటుంది. అదే ఇందులో ప్రతిపాదించారు.

నీవు సుమాలకెల్ల రమణీయములైన సురూపమిచ్చి, నె

త్తావులు నింపివేసి మధుధారల నద్దియు ముద్దుగొల్పగా

క్రేవల నున్న భృంగములు గిర్రున చుట్టున చేరుచుండు, నం

తే విరితేటులట్లు మము తీయని తీరని భ్రాంతి ముంతువే

.... అంటారు.

పూలకు అందమైన రూపాన్ని ఇచ్చేది నీవే, వాటిలో తీయని తేనెలను కూర్చేది నీవే, వాటిపట్ల ఆకర్షితమై తుమ్మెదలను చుట్టూ తిరిగేటట్లు చేసేది నీవే అయినట్లు మనిషికి కూడా ఈ సృష్టిలో ఎన్నో అందాలు, ఆకర్షణలు ముందుంచి, వాటిపట్ల వ్యామోహితుడయేటట్లు చేసేది కూడా నీవేనని మమ్ములను భ్రాంతిలో పడవేసేవాడవు నీవే నని ఆ పరమాత్మను స్తుతించడమూ సున్నితంగా విమర్శించడమూ రెండూ చేశారు.

అంతేకాదు మనిషి అసత్యములైన, తాత్కాలికములైన అందాల పట్ల ఆకర్షితులై అందులో ఎట్లా చిక్కుకొని పోతారో మనకు ఒక హెచ్చరిక వంటిది చేశారు.

అటు మూలపదార్థమైన పరబ్రహ్మను ఇటు లౌకిక జగత్తును, మానవ జీవితాన్ని ముక్కోణాలలో దర్శింపజేశారు. భగవంతుడు సాకారుడా? నిరాకారుడా? అనే చర్చ ఎంతో కాలం నుండి జరుగుతున్నది. ఈ విషయాన్ని పద్యంలో

నీవు శరీరివే యయిన నీలపు రంగున నుంటివంచు, యే

వేవొ మహాయుధమ్ము లను నిత్యము దాల్చెదవంచు, నింక నీ

జీవ సమస్తమెల్లపుడు చిత్తమునందునే నిల్పుదంచు, ని

న్నేవిధినైన చూడవచ్చునని యెన్నియొ గాథల నల్లుచుండిరో....

అంటారు. విష్ణువైనా, రాముడైనా నల్లని వాడని, నీలమేఘశ్యాముడని, శంఖచక్రాలు లేదా ధనుర్బాణాలు ధరించేవాడని ఈ జగత్తంతా అతి కనుసన్నలలోనే ఉంటుందని ఇతిహాస పురాణాలన్నీ చెపుతు న్నాయని చెపుతున్నారని, పైగా అతని మహిమలు కథలుగా అల్లుచున్నారని అన్నారు. ఇందులో విష్ణువు అనీ, రాముడనీ ధ్వనించడమే కాని సూటిగా చెప్పలేదు. కథలుగా అల్లడం అనడంలో పురాణాలు స్ఫురిస్తున్నాయి. పద్యంలోని పదాలతో అనేకార్థాల, విషయాల, స్ఫురణ

వ్యాసం

కల్గించడం ఉత్తమ కావ్య లక్షణం అంటారు. ఈ శతకంలోని పద్యాలనిండా ఇట్లా విస్తృతార్థాలు, వ్యాఖ్యానాలు చేయడానికి వీలుగా ఉన్నాయి. కేవల తాత్వికార్థాల ప్రతిపాదనలే కాక సమకాలీన మానవుల తీరుతెన్నులను కూడా వ్యంగ్యంగా ఈ కావ్యంలో చూపించారు.

నీవు జలమ్ము వాయువును నిస్తుల
తేజము యాకసం
బీవె యనంగ జెప్పెడి నివేద
పురాణములెన్నియైన మా
కీవు సమమ్ముగా బ్రతుకనీవు
సుఖమ్ముగ నెన్నియున్న మా
జీవనమంగడిన్ గల
నశేషపదార్థములందు భిక్షయా.

నీరు, వాయువు, వెలుతురు అన్నీ నీవే అయినావని వేదాలు చెపుతున్నాయి. అవన్నీ అందరికీ సమంగా ఇచ్చినావని చెపుతున్నాయవి. కాని మేము భూమిమీద ఎన్ని ఉన్నా అంగట్లో అన్నీ ఉండి మాకేమీ లేని బీదల వలెనే ఉన్నామని దీనిలో మొరపెట్టుకుంటాడు. సృష్టిలో అన్నీ అందరికోసం ఏర్పడినవే. కాని అందరికి అన్నీ సమంగా అందడం లేదు. ఇది మా నిర్వహణలోపమా? నీ నాటకమా? అని ప్రశ్నిస్తాడు. అలాగే దీనిలో ఇక్కడి దీనత్వాన్ని చూపించడం ఉన్నాయి.

నీవు ఘనాఘమ్ము గా.... - గర్జన చేసెదవుగాని అవసరమైన చోట వర్షం కురిపించవు. జనం దాహంతోను, నేల పంటలు లేకుండాను కరువును ఏర్పరుస్తున్నావు అని ప్రశ్నించారు. భగవంతుని భక్తులు ప్రశ్నించడం అనేక భక్తి శతకాలలో ఉంది. కాని ఈ శతకంలో తార్కికంగా ప్రశ్నించడం విశేషం.

నీవొక గంద్ర గొడ్డలివి..... అనే పద్యంలో కవి తన ఇంటిపేరును, పరశు రామావతారాన్ని స్ఫురింపజేశారు. అంతేకాదు. పరశురాముడు క్షత్రియు లను హతమార్చినాడని చెప్పక దురహంకృతి దూరం చేసినావని అనడం మానవులు, ముఖ్యంగా పాలకులు, ఏ కాలంలో నయినా దురహంకారంతో




**నీరు, వాయువు, వెలుతురు అన్నీ నీవే అయినావని వేదాలు చెపుతున్నాయి. అవన్నీ అందరికీ సమంగా ఇచ్చినావని చెపుతున్నాయని. కాని మేము భూమిమీద ఎన్ని ఉన్నా అంగట్లో అన్నీ ఉండి మాకేమీ లేని బీదల వలెనే ఉన్నామని దీనిలో మొరపెట్టుకుంటాడు. సృష్టిలో అన్నీ అందరికోసం ఏర్పడినవే. కాని అందరికి అన్నీ సమంగా అందడం లేదు. ఇది మా నిర్వహణలోపమా? నీ నాటకమా? అని ప్రశ్నిస్తాడు. అలాగే దీనిలో ఇక్కడి దీనత్వాన్ని చూపించడం ఉన్నాయి.**

ఉండగూడని వైనాన్ని వ్యక్తం చేశారు. ఇట్లా ఎన్నో పదాలు సాభిప్రాయాలుగా, సరికొత్త అర్థాల ప్రతిపాదకాలుగా ప్రయోగించారు. ఇది పండితులకు, భక్తులకు, వేదాంతులకు సామాన్యులకు కూడా ఉపయోగపడే విధంగా రచింపబడిన శతకం, 111 పద్యాలలో 'వ' కార ప్రాస పాటించబడింది. నీవుతో మొదలైన 111 పద్యాలలో యతి 'నీ' కు మైత్రిని పాటించడం జరిగింది. తెలుగు శతకసాహిత్యంలో ఇది ఒక మైలురాయి వంటిదిగా భావించవచ్చును.

ఈ శతకంలోని విశేషాలను 'కస్త్వమ్' పేరుతో డా. మాదిరాజు బ్రహ్మానంద రావుగారు, త్వమేవాకాహం పేరుతో శ్రీ గజానన్ తామన్ గారు, లోనారసి పేరుతో శ్రీ గురిజాల రామశేషయ్యగారు, ఇంకా ఆచార్య రావికంటి వసునందన్ గారు, డా. సంగనభట్ల నరసయ్య గారు పీఠికలలో విశ్లేషించినారు.

మహామహోపాధ్యాయులు సంస్కృత మహాకవి పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథిగారు వీరి పద్యాలు చదివి ఇరవై శ్లోకాలలో అభినందనలు ఆశీస్సులు అందించారు.

డా. గంద్ర లక్ష్మణరావు రచించిన ఈ పద్యశతకంలో విషయం ఎంత జటిలమైనదైనా పదాలు అంత లలితంగా, అంత అలతిగా వాడినారు. పద్యంలో ఎక్కడ ధార కుంటుపడకుండా, కృత్రిమత్వం లేకుండా ఉండడం పద్యరచనా శిల్పం, అర్థాన్వయంలో సాధారణ పాఠకుడు కూడా గ్రహించ గలిగేంత సులువుగా ఉన్నాయి. మా చావులు మమ్మె చావుమని, అంగట్లో అన్నీ ఉన్నా మా నోట్లో శని అని, కాలునిలంబడదొక్కచోట వంటి జాతీయాలు నుడికారాలెన్నో ఈ పద్యాలలో ఒదిగిపోయి ఆ చెపుతున్నది పాఠకుడేననే ఆత్మీయతను కలిగిస్తాయి.

తెలుగు పద్యం వ్యవహారభాషకు దగ్గరగా ఉంటుందనడానికి ఈ పద్యాలు సాక్ష్యాలు. “నీవు పదార్థరూపమా? అవును, నిజగమెల్ల పదార్థరూపమై” నీవు శివుండవే యయిన నిల్చుట యేల శవాల మధ్యలో?”, నీవు జగమ్మునెప్పుడును నిల్పగ జూచెడు నేర్పరుండవే “ వంటి ఎత్తుగడలతో పద్యాలు అలవోకగా ప్రశ్నోత్తరాల వలె, సంభాషణల వలె సాగిపోతుంటాయి. తావుల తావుదప్పుచున్ వంటి ప్రయోగాలలో యమకం తొంగిచూస్తుంటుంది. పద్యనిర్మాణంలో కొత్త మెలకువలెన్నో చూపగలిగినవి ఉన్నాయి.

వచనకవిత్వం, నాటకం, విమర్శ వంటి వివిధ ప్రక్రియలలో రచనలు చేసిన గంద్ర లక్ష్మణరావు ఈ కావ్యంతో సరికొత్త ప్రయోగం చేశారు. అనేక విశేషాలతో సాగిన ఈ నీవు శతకం పరబ్రహ్మ తత్వాన్ని తెలిపే పద్యకావ్యంగా తత్వార్థంలో ప్రయోగించడంతో దీనిని కావ్యంగా చెప్పవచ్చు. ఇట్లాంటి శతకం తెలుగు సాహిత్యంలో ఇంతవరకు వేయి యేండ్లలో రాలేదు. ఇది తెలుగులో తొలి ఆద్యమకుట శతకం.

కవిత



# వాళ్ళు వస్తారు..

విరించి లక్ష్మి, 94414 44060

మార్కెట్లో కుళ్లిన వ్యర్థాల కంపుతో,
దోమల చీమల దాడితో
మనం అసహనంగా వున్నప్పుడు
చెత్తంతా ఊడ్చేసి, బ్లీచింగ్ చల్లేసి
మన అసహనాన్ని బండిలో పోసుకుపోతారు...

వాళ్ళు వస్తారు....
లెట్రిన్ టాంక్, డ్రైనేజీ నిండి కంపుతో
మనం విలవిల్లాడినపుడు, బక్కెట్లతో
తోడిపోసి మనకు ప్రాణవాయువు పోసి
మన అసమర్థతను మూటకట్టకెళతారు....

వాళ్ళు వస్తారు...
మనం సరదాగా వాహ్యాళికి వెళుతున్నపుడు
ప్లాస్టిక్ సంచులు, పారేసిన టీకప్పులు వైపు
మనం అసహ్యంగా చూసినప్పుడు, వాటిని వేరేసి
మన అసహ్యాన్ని గోనెలో నింపుకెళతారు...

వాళ్ళు వస్తారు....
అంతలేసి సదువుల బరువులతో వంగిపోయిన
మన పిల్లల బరువులను మనమెత్తుకుని
వారి టై, షూస్ నలగకుండా బద్రంగా బస్ ఎక్కిస్తూ
తనకు మించిన జీవిత బరువును మోస్తున్న వారిని
ఆశ్చర్యంగా చూసినపుడు, మన ఆశ్ఛర్యాన్నికూడా
సునాయాసంగా మోసుకెళతారు...

వాళ్ళు వస్తారు....
కుత్సిత మనుషులుగా మనముండి
స్వార్థపు కోరల్లో నిదురిస్తూ మన మనసులనే
కడగలేని మనము, సమాజంలోని మురికంతా
స్వహస్తాలతో ఎత్తిపోసిన వారిని
ఆనందంగా చూసినప్పుడు
మనల్ని ఈసడించుకుంటూ పోతారు
ఆదిమన్నలు...

ముఖాముఖి

# ప్రజల్లో తెలంగాణ సోయిని కలిగించడానికి ప్రయత్నించాను....

## - మామిడి హరికృష్ణ

ప్రముఖ రచయిత, కవి, సినిమా విమర్శకులు, అనువాదకులు, సంపాదకులు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి, తెలంగాణ భాష మరియు సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణతో డా॥ వెల్దండి శ్రీధర్ ముఖాముఖి.



**తెలంగాణలో కొన్ని వందల వేల మంది కళాకారులకు ఇవాళ మీరొక ఆశాదీపంగా కనిపిస్తున్నారు. అట్లాంటి సందర్భంలో మీరు ఈ స్థాయికి రావడానికి తోడ్పడినటువంటి మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి?**

Charity starts at home అని మనకి ఇంగ్లీష్‌లో ఒక Proverb ఉంది Psychological స్టడీస్‌లో గాని ఎక్కడ చూసినా కూడా అర్థమయ్యే సత్యం ఏమిటంటే రెండు అంశాలు ఒక వ్యక్తిని డిసైడ్ చేస్తాయి. ఒకటి Heredity రెండవది Environment దాన్ని మనం Nature Philosophy అని కూడా అంటాం. మాది వరంగల్ జిల్లా శాయంపేట అనే గ్రామం. శాయంపేట అనే ఊరు బాగా జియోగ్రాఫికల్‌గా మంచిగా లోకేట్ అయిన ఊరు. దేవుని చెరువు, నల్లకుంట, రాళ్ల కుంట ఇంకొక చెరువు నాగసముద్రం ఈ నాలుగు చెరువుల మధ్య ఉండే ఊరు. మా కుటుంబ నేపథ్యం ఏంటంటే మా ముత్తాత పేరు మామిడి చంద్రయ్య. చంద్రయ్య పద్మశాలి కులం గనక చేనేత వృత్తిలోనే ఉండేవాడు. కానీ మా తాత వెంకటరాజం చాలా కష్టాలు పడి ఒకటో రెండో తరగతి వరకు చదువుకున్నాడు. చదువుకున్న తర్వాత ఆయనకుండే ఒక విజన్ వల్ల కులవృత్తిని కాకుండా అప్పట్లో పూజా బీడీ ఫ్యాక్టరీ అని ఉండేది. ఆ బీడీ ఫ్యాక్టరీలో మేస్త్రీగా జాయిన్ అయ్యాడు. అక్కడ ఉంటూ మెలకువలు అన్నీ నేర్చుకుని తనకు వచ్చిన ఆదాయాన్ని చిన్న వ్యవసాయ భూములపైన ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టి తర్వాత ఒక దశకు వచ్చే సరికి దాదాపు 12 నాగళ్ల వ్యవసాయం, దాదాపు ఇరవై నాలుగు ఎద్దులు, ఆవులతో ఒక పెద్ద కొట్టం మెయింటెన్ చేస్తూ పెద్ద భూస్వామిగా ఎదిగిండు. ఆయనకి నలుగురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. పెద్దకొడుకు పెద్దకొడుకును నేను. మా తాతకు కొంచెం ఆర్థికంగా మంచి స్తోమత ఉండడం వల్ల మా నాన్నని డాక్టర్ కోర్సు చదివించాడు. ఆయుర్వేదం మెడిసిన్ కోర్స్ ఐదేళ్ల చదివాడు. ఆయనకు ముగ్గురు బిడ్డలు, ఒక కొడుకు. ముగ్గురు బిడ్డల్లో చిన్న బిడ్డ స్వరాజ్యం మా అమ్మ. అమ్మ కూడా చదువుకుంది. అప్పట్లో సెవెంత్ క్లాస్ పాస్ అయింది. ఇంట్లో కొద్దిగా అకడమిక్ అట్మాస్ఫియర్ ఉండేది. మా నాన్న, మా అమ్మ కోసం అనేక పుస్తకాలు తీసుకురావడం జరిగింది.

మొదటి ఈనాడు పేపర్ మా ఇంట్లోనే వచ్చింది. మొట్టమొదటి కరెంటు బల్బు వెలిగింది మా ఇంట్లో. ఊర్లో మొట్ట మొదటి సైకిలు ఒనరు మా నాన్న. చిన్నప్పటినుండి చదువుకున్న వాతావరణంలో ఉండటం వల్ల కులవృత్తి పరమైన సంస్కృతి నాకు ఇక్కడ అబ్బలేదు. వ్యవసాయ సంస్కృతి మాది. అంత పెద్ద వ్యవసాయం అయినా కూడా నాకు వ్యవసాయంతో కనెక్షన్ దొరకలేదు.

**చేనేత కుటుంబంలో పుట్టినప్పటికి కూడా వ్యాపార రంగంలో స్థిరపడిన ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఉన్న మీ విద్యాభ్యాసం ఎలా జరిగింది? ఏం చదువుకున్నారు మీరు?**

శారదా విద్యా నికేతన్ అని ఊర్లో కొత్తగా ఇంగ్లీష్ మీడియం స్కూల్ పెట్టారు. అది పెట్టినప్పుడు వాళ్ల ఉద్దేశం ఎట్లా ఉందంటే తక్కువ కాలంలో ఎక్కువ రిజల్ట్ చూపించాలి. ఊరు వాళ్ళందరికీ ఒక నమ్మకం కల్పించాలి. అందుకే ఆరు నెలలకే ఒక క్లాస్ చొప్పున రెండు సంవత్సరాలలో నాలుగు తరగతులు కంప్లీట్ చేశారు. ఆ విధంగా నేను టెన్త్ క్లాస్ వచ్చేసరికి అండర్ ఏజ్ ఉన్నానని నన్ను టెన్త్ క్లాస్ ఎగ్జామ్ రాయనివ్వ లేదు. స్పెషల్‌గా డీ-ఈవో దగ్గర్నుండి పర్మిషన్ తీసుకొని అప్పుడు నేను ఎగ్జామ్ రాయాల్సి వచ్చింది. తర్వాత ఇంటర్మీ డియట్, డిగ్రీ రెండు కూడా లాల్ బహదూర్ కాలేజ్ వరంగల్‌లో చదువు కున్నా. ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ కాకతీయ యూనివర్సిటీలో చదివాను. తర్వాత బి.ఇడిలో జాయిన్ అయ్యాను. తర్వాత హైదరాబాద్‌కు రావాలి ఉస్మానియా యూనివర్సిటీలో చదవాలి అని ఒక ఆశ ఉండేది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్‌లో ఎమ్మెస్సీ సైకాలజీలో జాయిన్ అయ్యాను. అయిపోయిన తర్వాత మళ్ళీ లా రాశాను. స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చింది. జాయిన్ అయ్యాను. తర్వాత కాంపిటీటివ్ ఎగ్జామ్స్ అన్ని రాయడం మొదలైంది. ఒక ఎనిమిది ఉద్యోగాలు వచ్చాయి. ఎనిమిది ఉద్యోగాల్లో ఉన్న దాంట్లో బెటర్ అని సెలెక్ట్ చేసుకొని దాంట్లో జాయిన్ అయ్యాను.

**అంటే మీరు చెబుతున్న దాన్ని బట్టి మీ కుటుంబంలో ఎవరూ కూడా సాహిత్య రంగంలో కానీ కళారంగంలో కానీ లేరని అర్థమవుతుంది?**

లేదు లేదు. సాహిత్య వాతావరణం బాగానే ఉంది. మా నాన్న, అమ్మ మంచి చదువరులు. మా ఇంట్లో పెద్ద లైబ్రరీ ఉండేది. ఇంట్లో అకడమిక్ అట్మాస్ఫియర్ మరియు లిటరరీ అట్మాస్ఫియర్ చాలా ఉండేది. శరత్ చంద్ర ఛటర్జీ బుక్స్, రవీంద్రనాథ్ టాగూర్ బుక్స్ ఉండేవి. ఆ విధంగా నాకు పుస్తకాలతో అక్షరాలతో, సాంస్కృతిక విషయాలతో చాలా పరిచయం. ఇంకొకటి ఏంటంటే మా ఊర్లోకి సురభి నాటకాలు వచ్చేవి. సురభి నాటకాల వాళ్లు దాదాపు నెల రోజులు వేసేవాళ్ళు. అప్పుడే నేను చెల్లియో చెల్లకో, ఆలమందలవిగో ఇట్లాంటి పద్యాలు వినడం, వాళ్ళు రిహార్సల్ చేస్తుంటే మా నాన్నతో పాటు కలిసి వెళ్లి చూడటం ఇలా ఉండేది. తాత కళ్లం దగ్గర కావలి ఉండేవాడు. అప్పుడు నేను చేయాల్సిన పని మా తాత ముందర పాట పాడాలి. అప్పట్లో నేను పాడే పాట ఏంటంటే "శివరంజని నవరాగిణి" అనే పాట పాడుతూ ఉండేది. నాకు అర్థం తెలియదు ఏం తెలియదు. అప్పట్లో అది పాపులర్ పాట. ఆ విధంగా సాహిత్యం, సంస్కృతి, నాటకం, అకడమిక్ ఇవన్నీ కూడా మిళితమై ఉండేవి.

**ఇంత మంచి సాహిత్య నేపథ్యం ఉన్నటువంటి మీరు మొదట రచన వైపు ఎట్లా మొగ్గు చూపారు. తొలి దశలో రాసినటువంటి రచనలు ఏమైనా గుర్తున్నాయా?**

అ.. ఉన్నాయి. చిన్నప్పటి నుండి చదవడం బాగుండేది గనక అన్ని పేపర్ కటింగ్స్ చేసుకుని పెట్టుకునే వాడిని. చందమామ, బుజ్జాయి, బాలమిత్ర, బాలజ్యోతి అని ఉండేవి. ఆంధ్రజ్యోతిలో అవసరాల సూర్యనారాయణ అని మ్యాథమెటిక్స్ గురించి రాసేవాడు. అవి లాజికల్‌గా మెదడుకు మేతలాగా పనిచేసేవి. చందమామలో జానపద కథలు అద్భుతమైన కాల్పనిక శక్తిని, సృజనాత్మ కతను పెంచే విధంగా ఉండేవి. అవి అందించే సందేశాలు చాలా బాగుండేవి. జాతక కథలు These are all the things I have been exposed at the very early years. మా ఇంట్లో కూడా సాహిత్య వాతావరణం ఉండటం ఇవన్నీ చూస్తున్నప్పుడు నాకు కూడా అనిపించేది నేను కూడా రాయాలి అని. కొన్ని భావనలు కలిగేవి. వాటిని ఎలా అమలు చేయాలో తెలీదు. ఏం చేస్తే బాగుంటుందో తెలీదు. చెప్పే వాళ్ళు లేరు. అప్పుడు నేను కూడా ఒక పేపర్ తెద్దామని చందమామ సైజ్‌లో 'హరివిల్లు' అని ఒక లిఖిత పత్రిక కూడా ప్రారంభించాను. నేను నా సొంతంగా కథలు రాయడం చేసేవాణ్ని. హరివిల్లు అనే పత్రికను మూడు సంచికలు తీశాను. బొమ్మల లిఖిత పత్రికను అచ్చం చందమామ ఫార్మాట్‌లో 20 పేజీలతో వేసినది. ఫస్ట్ నా పేరు నేను అక్షరాల్లో చూసుకుంది మా స్కూల్లో 'కెరటం' అనే ఒక మ్యాగజైన్ పెట్టారు. అప్పుడు గంటా రాంరెడ్డి అని మా హెడ్మాస్టర్ ఉండేవాడు. ఆయనకు సాహిత్యం వీటి పట్ల ఆసక్తి బాగా ఉండేది. స్కూల్ అయిపోయిన తర్వాత టెన్త్ క్లాస్ రూమ్‌లో కూర్చొని చదువుకునే ఫెసిలిటీ ఇచ్చేవాడు. నాకు ఇంగ్లీష్ బాగా వస్తుందని వాళ్ళు అనుకొని నాకు ఒక ట్రాన్స్‌లేషన్ కవిత ఇచ్చారు. ఇస్తే నేను ట్రాన్స్‌లేట్ చేశాను. అది నాకు ఇప్పుడు గుర్తు లేదు. కానీ ఆ కవిత మీద ఎం. హరికృష్ణ 9th అని ఉంటుంది. అది మొదటిసారిగా అక్షరాల్లో నేను చూసుకున్న నా పేరు. అమ్మ చాలా మెచ్చుకుంది నన్ను. అమ్మ మెప్పు పొందిన తర్వాత అమ్మ మెచ్చుకునే పని చేయటం అనేది నాకు ఇష్టం అయిపోయింది. వరంగల్‌లో ఉన్నప్పుడు కూడా మా కాలేజీ మ్యాగజైన్ ఉండేది. లాల్ బహదూర్ కాలేజీలో కాలేజీ మ్యాగజైన్‌కి డిగ్రీ ఫస్ట్ ఇయర్, సెకండ్

ఇయర్, థర్డ్ ఇయర్ మూడు సంవత్స రాలు నేను ఎడిటర్‌గా సెలెక్ట్ అయ్యాను. స్టూడెంట్ వైపు నుండి ఒకరు లెక్చరర్ వైపు నుండి ఒకరు గైడ్‌గా ఉండేవారు. అలా మూడు సంవత్సరాలు హ్యాట్రిక్‌గా నేను మా కాలేజీ మేగజైన్ ఎడిటర్‌గా ఎంపికయ్యాను. అప్పుడు కూడా నా పేరు చూసుకుని మురిసిపోయాను. అది కూడా చాలా ఇంట్రెస్ట్‌ని క్రియేట్ చేసింది. ఆ తర్వాత పత్రికల్లో రాయడం. పబ్లిష్ చేయడం. ఆంధ్రజ్యోతి, ఉదయం, వార్త పత్రికలకు రాయడం పబ్లిష్ అవుతూ ఉండటం అలా జరిగేది. ఉస్మానియా క్యాంపస్‌కు వచ్చిన తర్వాత అప్పుడు సిరీస్ ఆఫ్ ఆర్టికల్స్ రెగ్యులర్‌గా రాయడం జరిగింది. అందులో సినిమా అనాలసిస్, సినిమా రివ్యూస్, ఓల్డ్ సినిమా మీద, ఇండియన్ సినిమా మీద, కవితలు రాయడం ఇలా సాగిపోయేది. ఆంధ్రప్రభ సాహితీ గవాక్షం, ఆంధ్రజ్యోతి వివిధ, ఉదయంలో రసన అని వచ్చేది అన్నిట్లో రాయడం.. ఉదయం వాళ్లది ఒక సండే సప్లిమెంట్ ఉండేది. ఉదయం వీక్లీ అని ఉండేది. ఇలా ఎప్పుడు పుస్తకాలతోనే. నా ప్రపంచమే పుస్తకాలు. నేను ఎక్కువగా గడిపేది కూడా పుస్తకాలతోనే. ఇప్పటి వరకు నా ఎంటైర్ లైఫ్‌లో అత్యధిక కాలం గడిపినవి రెండే రెండు ప్రాంతాలు. ఒకటి లైబ్రరీ హాలు. ఇంకొకటి సినిమా హాలు.

**అనువాదకులుగా మొదలైనటువంటి మీరు ఇప్పటివరకు అనువాద రంగంలో ఎలాంటి కృషి చేశారు?**

ఇతర భాషల పోయెట్రీని ఇంగ్లీష్ భాషలో చదివినప్పుడు ఒకసారి గుండె కొట్టుకుంటుంది. తెలుగులో చేస్తే బాగుండునని అనిపిస్తుంది. ఠాగూర్ గీతాంజలి, చిత్రాంగద మొదలైన వాటిని చదివినపుడు ఇంత సెన్సిబుల్‌తో ఉన్న వాక్యాలు కదా తెలుగులోకి చేస్తే ఇంకా బాగుండు అని అనుకుంటున్న టైమ్‌లోనే ఇంటర్మీడియట్ ఆ టైమ్‌లో చలం గీతాంజలి నాకు దొరికింది. ఠాగూర్ గీతాంజలిని చాలామంది అనువాదం చేశారు. కొంగర జగ్గయ్య, బెల్లంకొండ రాందాసు చేశారు. వీటిలో చలం అనువాదం నాకు చాలా నచ్చింది. అదే సమయంలో రాచమల్లు రాంచంద్రారెడ్డి 'అనువాద సమస్యలు' పుస్తకం కూడా చదివాను. ఎట్లా చేయాలి సూత్రం ఏంటి అనేది. ఎక్కువశాతం పుస్తకాల మీద ఆధారపడ్డాను. మనుషుల మీద కంటే పుస్తకాలు నాకు గైడ్స్. పుస్తకాలే నన్ను మార్గదర్శనం చేస్తాయి. ఇప్పటికీ నాకు రెండు లాంగ్వేజెస్ పైన మంచి ప్రొఫెషన్సి ఉంది. అనువాదాలు చేస్తే బాగుండు అని తట్టుకోలేని పరిస్థితుల్లో చేసిన పని. ఎంత వరకు వెళ్ళింది అంటే నమస్తే తెలంగాణ పత్రికలో ఒక సంవత్సరం పాటు 'ప్రపంచ కవిత' పేరుతో అనువాదాలని వరుసగా సిరీస్‌లాగా చేసేంతవరకు వెళ్ళాయి. ఒక భాష అని కాదు. లాటిన్ అమెరికానా లేదా ఆఫ్రికానా దానితో సంబంధం లేదు. ఎక్కడైతే ఒక హ్యూమన్ ఎగొనీ, ఒక హ్యూమన్ పెయిన్ ఏ వాక్యాల్లో అయితే మానవుని అస్తిత్వ పరివేదన ఉంటుందో ఆ కవితలు ఆకట్టుకునేవి. వాటిని మన వాళ్ళకు అందించాలి. తెలుగులోకి అనువాదం చేయాలనే ఆలోచనతో అలా చేసుకొంటూ వచ్చాను. తెలంగాణ ఉద్యమం విస్తృతంగా నడుస్తున్న సమయంలో ఈ ప్రపంచానికి ఒక సాలిడారిటీ కావాలి. సాలిడారిటీని కూడగట్టడం కోసం నాకు ఏమి అనిపించిందంటే Why dont we take Telangana cause and Telangana poems into Engilsh. But that we can able to draw the attention of the other regions people ఇతర ప్రాంతాల ప్రజల యొక్క ఆసక్తిని మనం చెప్పొచ్చు. మన వేదనేంటో చెప్పొచ్చు అనే ఆలోచనతోనే వాటిని ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేయడం మొదలుపెట్టాను. అంటే ఇంగ్లీష్‌లో ఉన్న కవిత్వాన్ని, లిటరేచర్‌ని తెలుగులోకి ట్రాన్స్‌లేట్ చేయడం ఒకవైపు అయితే తెలుగులో ముఖ్యంగా తెలంగాణలో వచ్చిన కవిత్వాన్ని, సాహిత్యాన్ని ఇంగ్లీష్‌లో ట్రాన్స్‌లేట్ చేయడం కూడా చేశాను. వాటిలో Frontline Formations ఒకటి. దీన్ని దామోదర్ గారు ఎడిట్ చేశారు. దీంట్లో తొమ్మిది, పది మందిమి కలిసి ఒక 150 కవితల్ని ట్రాన్స్‌లేట్ చేయడం జరిగింది. అందులో ఇరవై ఐదుకు పైగా కవితల్ని నేను ట్రాన్స్‌లేట్ చేశాను. What my intention is that to take cause of Telangana to the world through means of English language, because that is the only way to express our own agony, pain, desire and ambitions. అనువాదం ద్వారా కొన్ని విషయాలు తెలుస్తాయి. కొన్ని సంస్కృతుల పట్ల, డైవర్సిటీ పట్ల మనకు రెస్పెక్ట్ పెరుగుతుందని అర్థమైంది. అందుకే సమాంతరంగా నేను అనువాదాన్ని కూడా చేస్తూ వచ్చాను. నా సొంత కవిత్వాన్ని ఎలా అయితే సృష్టిస్తూ, రాస్తూ వచ్చానో అనువాద కవిత్వాన్ని, అనువాద సాహిత్యాన్ని కూడా అంతే ఇష్టంతో రాస్తూ వచ్చాను.

**సుషుప్తి, ఒంటరీకరణ, ఊరికి పోయిన యాళ్ల అని మూడు కవితా సంపుటాలు వెలువరించారు మీరు. ఈ సందర్భంగా మీకు అభినందనలు తెలుపుతూ, ప్రధానంగా మీరు మీ కవిత్వం ద్వారా పాఠకులతో ఏ విషయాలను పంచుకోవాలను కుంటున్నారు. ఏ కోణంలో మీ కవిత్వం కొనసాగింది?**

ఒక్క పర్‌స్పెక్టివ్ అని కాదిక్కడ. మనిషికి ఎన్ని కోణాలు ఉన్నయో అన్ని. మనుషుల్ని నేను ఎట్లా చూస్తానంటే 360 డిగ్రీల కోణంలో చూస్తాను. కవిత్వం కూడా చేయాల్సిన పని అదే. ఇక్కడ నేననే కాదు ప్రతి కవి తనని తాను 360 డిగ్రీల్లో ఆవిష్కరించుకునే ప్రయత్నంలో భాగంగానే కవిత్వం రాస్తాడు. నా సుషుప్తి కవితా సంపుటి 2020లో పబ్లిష్ అయింది. ఊరికి పోయిన యాళ్ల 2018లో, ఒంటరీకరణ 2019లో పబ్లిష్ చేశాను. మూడు సంవత్సరాల్లో పబ్లిష్ చేసినవి. కానీ అవి రాసిన నేపథ్యం, కవితా కాలం మాత్రం అంతకంటే 30 సంవత్సరాల ముందటిది. దాంట్లో ఒక్క కోణం అని చెప్పలేను. సుషుప్తి అనే కవితా

ముఖాముఖి

సంపుటిలోనివి నేను వెరీ ఎంగేజ్‌లో అంటే నేను డిగ్రీ కాలేజీలో చదువుతున్న సమయంలో 1986 నుండి 1989 మధ్య రాసిన కవితలవి. ఆ టైంలో నాకు నా మనసులో నేను అధ్యయనం చేసిన మేరకు నాకు అర్థమైన మేరకు నా జీవిత కోణంలో నుండి నేను రాసిన కవిత్వమది. తరువాత ఒంటరీకరణాన్ని నేను అధ్యయనం చేస్తున్న క్రమంలో మళ్లీ హైదరాబాద్ వచ్చినప్పుడు 1993 నుండి 2002 మధ్య కాలంలో నేను రాసిన కవితలు. పబ్లిష్ అయిన కవితలలో నుండి కొన్ని కవితల్ని ఎంపిక చేసి దాంట్లో పబ్లిష్ చేశాను. ఒక Typical తెలంగాణ విలేజిలో ఉండేటువంటి జీవన చిత్రమంతా ఊరికి పోయిన యాళ్లలో కనిపిస్తుంది.

**1989 లో మీరు కవిగా మొదలైనట్టు చెప్పారు కదా! అప్పటి కవిత్వానికి ఇప్పుడు వర్తమానంలో వస్తున్నటువంటి కవిత్వానికి ఏం మార్పులు లేదా తేడాలు గమనించారు?**

1986లో అప్పుడు ఉన్న కవిత్వానికి ఇప్పుడు వస్తున్న కవిత్వానికి మధ్య చాలా తేడా ఉంది. రెండు అంశాలుగా దీన్ని చూడొచ్చు అని భావిస్తున్నాను. విమర్శకు డిగానే కాకుండా కవిగా కూడా. నా పరంగా నేను రాస్తున్న కవితా వస్తువుల్లో, శైలిలో, శిల్పంలో వచ్చిన మార్పులు ఒకటైతే, ఇంకొకటి నా సమకాలీన కవులుగాని ఇప్పుడొస్తున్న కవులుగాని రాస్తున్న కవితా వస్తువులు, వాళ్ళ శిల్పంలో వచ్చిన మార్పులు. మూడవ దేంటంటే ప్రపంచవ్యాప్తంగా వివిధ సాహిత్యాల్లో వివిధ భాషల్లో వస్తున్న పరిణామాలు మార్పులు. ఈ మూడు కోణాల్లో చెప్తే తప్ప నా కవిత్వాన్ని విశ్లేషించడం సాధ్యం కాదు. ఎందుకంటే No born is an Island. ఈ ప్రపంచంలో ఎవ్వరు కూడా ఏ కాకి కారు. ఏకాకిగా ఉంటారు కానీ తన మీద అన్ని ప్రభావాలు ఉంటాయి. ఎప్పుడైతే కవి అనేవాడు నిరంతర అధ్యయనశీలి, నిరంతర పరిశీలనాశక్తి కలిగినవాడు. తను ఏం చదవకపోయినా తన మీద ఏ ప్రభావం లేకపోయినా ప్రపంచాన్ని, సమాజాన్ని గమనిస్తూ ఉంటాడు గనుక ఆ సమాజంలో జరుగుతున్న పరిణామాలు ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు ఇజాల పరంగా మార్పు వచ్చింది. ఒకటి భాషాపరంగా, రెండవది కవితా వస్తువు పరంగా మార్పు వచ్చింది. మూడవది శిల్పం దాన్ని ప్రజెంట్ చేసే విధానంలో కూడా మార్పు వచ్చింది. ఎందుకంటే మనం విస్తృతంగా అధ్యయనం చేస్తున్నప్పుడు ప్రపంచ సాహిత్యంలో, ప్రపంచ కవిత్వంలో ఒక వస్తువుతో కూడిన కవితను ఎలా వ్యక్తం చేశారు? అది ఫస్ట్ పర్సన్ లో వ్యక్తం చేశారా? థర్డ్ పర్సన్‌లో వ్యక్తం చేశారా? లేదా ఒక సంభాషణ శైలి, సంవాద శైలి, డైలాగ్ మెథడ్‌లో కూడా కవిత్వం రాయడం అనేది సంప్రదాయంగా ఉంటుంది. కొన్ని కొన్ని వస్తువులు కొన్ని కొన్ని తరహాలలో రాస్తే బాగుంటాయి. అవి జనంలోకి ఎక్కువగా వెళ్తాయి.




జనాలను ఆలోచింపజేస్తాయి. అందుకని ఆ వస్తువుని ఎంపిక చేసుకునే విధానాన్ని బట్టి తీరును బట్టి దాన్ని మార్చుకుంటూ వచ్చిన పరిణామం నా కవిత్వంలో నాకు కనిపించింది. నేను తెలుగు నుండి ప్రపంచం సాహిత్యం వైపుకు మారిన శైలికి ఆ తీరుకి నా కవిత్వం అంతా కూడా ప్రతిబింబంగా ఉంటుంది. నేను మొదట్లో పూర్తిగా తెలుగు సాహిత్యాన్నే ఎక్కువగా చదివి తెలుగు భాష నుండి వచ్చాను కనుక ఇతర భాషల్లో ఉన్న రీతులను సంప్రదాయాలని, హైకూలని చదువుతూ ఉన్న క్రమంలో వాటి శైలిని కూడా అందిపుచ్చుకోవడం వాటిని మనలోకి అడాప్ట్ చేసుకోవడం అనేది జరిగింది. ఆ జరిగిన ప్రాసెస్ అంతా నాకు నా కవిత్వంలో కనిపిస్తుంది.I dont want to confine my self only to Telugu language. Collective Unconciousness (సామూహిక అచేతనం) అని ఆల్ఫ్రెడ్ అడ్లర్ చెప్తాడు. Collective Unconciousness అనే ఫీలింగ్ వల్ల ఆర్క టైప్స్ అనే ఒక కాన్సెప్ట్ వల్ల మనుషులందరూ అంటే మనమెట్ల కొత్త కోణంలో ఆలోచించాలి. హ్యూమన్ సైకలాజికల్ టెండెన్సీ చెప్పడం అనేది అతను చెప్పాడు. ఇలా ఎక్కడెక్కడ ఏవైతే అవసరం ఉంటుందో ఆ టెర్మినాలజీ వాడటానికి కూడా నేనెప్పుడూ వెనుకంజ వేయలేదు. అది అక్కడ ఆప్ట్‌గా ఉంటుందని భావించడం వల్ల ఆ సైంటిఫిక్ టెర్మినాలజీని ఆ సబ్జెక్ట్‌లో ఉన్నట్లే వాడుతూ నా కవిత్వాన్ని చెప్పిన మార్పు నా కవిత్వంలో నాకు కనిపిస్తుంది. చాలా పరిణామం అయితే ఉంది. నాకు నేనే కాదు సమకాలిక కవిత్వంలో మార్పు లొచ్చాయి. వస్తు పరంగా, శిల్ప పరంగా కండిషన్ పరంగా, భాష పరంగా సమకాలీన కాలంలో వచ్చే పరిస్థితులు కూడా ఉంటాయి. మారుతున్న వస్తువులు తెలంగాణ ఉద్యమం అప్పుడు తెలంగాణ ఉద్యమం గురించి తర్వాత ప్రపంచంలో జరుగుతున్న పరిణామాల గురించి కవిత్వంలో మార్పు కనిపిస్తుంది.

ముఖాముఖి

**మీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి ఎలాంటి కృషి చేశారు. ఆ విశేషాల గురించి చెప్పండి?**

ఉస్మానియా యూనివర్సిటీలో నేను 1993లో వచ్చాను అప్పటికే ఇంకా తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఈ నేపథ్యం అంతగా లేదు కానీ తెలంగాణ భాషపట్ల తెలంగాణ మాండలికంలో కవిత్వంపట్ల నాకు ఒక మంచి సోయి ఉంది.

**2001 తరువాత వచ్చినటువంటి మలిదశ తెలంగాణ ఉద్యమంలో భావజాలవ్యాప్తికి మీరు చేసినటువంటి కృషి గురించి చెప్పండి?**

2001తర్వాత మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములు అవ్వటం ఈ సందర్భం నాకు చాలా బాగా నచ్చింది. ఎందుకంటే అప్పటి నుండి తెలంగాణ భాషలో కవిత్వం రాయడం, సాహిత్యం రాయడం, కథలు రాయడం ఒకవైపు అయితే ఇంకొక సామర్థ్యం నేపథ్యం ఊపు తోడవ్వడం అనేది ఏ కవికైనా ఏ రచయిత కైనా మరింత ఉత్సాహాన్ని ఇచ్చే అంశం. నాకు కూడా జరిగింది. ఈ సందర్భంలో నేను ఏం చేశానంటే తెలంగాణలో విస్మృతమైన మహనీయుల గురించి మన చరిత్ర గురించి తెలంగాణ సాహిత్యంలో ఉండే అంతర్గత కోణాలు ఏవైతే ఉన్నాయో, తెలుగు సాహిత్యంలో చెప్పబడుతున్న కొన్ని విస్మరించిన అంశాలని వివిధ రకాల సాహిత్యము, కవిత్వము లేదంటే వ్యాసాల రూపంలో, విమర్శ రూపంలో రాస్తూ వచ్చాను. దాని ద్వారా నేను ఒక ఐడియాని ఇవ్వడం. ఉదాహరణకి అప్పటి వరకూ 1910లో తొలికథ 'దిద్దుబాటు' వచ్చిందని తెలుగు సాహిత్యంలో ఒక భావన ఒక ఆలోచన ఉండేది. దాన్ని కాదని సంగిశెట్టి శ్రీనివాస్‌లాంటి పరిశోధకులు ఆధారాలతో సహా శాస్త్రీయంగా సాధికారికంగా నిరూపించారు. బండారు



**తెలంగాణలో విస్మృతమైన మహనీయుల గురించి మన చరిత్ర గురించి తెలంగాణ సాహిత్యంలో ఉండే అంతర్గత కోణాలు ఏవైతే ఉన్నాయో, తెలుగు సాహిత్యంలో చెప్పబడుతున్న కొన్ని విస్మరించిన అంశాలని వివిధ రకాల సాహిత్యము, కవిత్వము లేదంటే వ్యాసాల రూపంలో, విమర్శ రూపంలో రాస్తూ వచ్చాను.**

అచ్చమాంబ 1901 ప్రాంతంలోనే పదేళ్ల క్రితమే గురజాడ అప్పారావు కంటే ముందే కథలు రాసింది. ఇలాంటి వాటిని మనం చదివి, వేరే సేకరించిన అంశాలు ఏవైతే ఉన్నాయో వాటిని వ్యాసాల రూపంలో అందించడం. తెలంగాణకి సంబంధించిన ఒక సోయిని ప్రజల్లో కలిగించేటట్లు చేయడం. తెలంగాణ ఆకాంక్షను వ్యక్తం చేసే కవితలు రాయడం వివిధ పత్రికలలో ప్రచురించడం. వివిధ వేదికలపైన వాటిని చదవడం జరిగింది. ఇంకొక వైపున ఏం జరిగిందంటే తెలంగాణలో వచ్చిన తెలంగాణ కవితలని ఇంగ్లీష్‌లోకి ట్రాన్స్‌లేట్ చేయడం జరిగింది. ట్రాన్స్‌లేట్ చేయడం ద్వారా ఏమిటంటే మన దగ్గర ఆల్రెడీ అందరూ తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములుగా ఉంటున్నారు. అంతర్జాతీయంగా, జాతీయ స్థాయిలో తెలంగాణ కాజ్ పట్ల ఒక అవగాహన కల్పించాలనే కారణం చేత ఇది కూడా చేయడం జరిగింది. ఈ విధంగా నేను చేసిన వర్క్ అంతా ఎక్కువగా క్రియేటివ్ పరమైన అంశాల్లోంచి చేయడం జరిగింది. అలాగే టీవీ షోస్‌కి, గేమ్ షోస్‌కి రాస్తున్నప్పుడు కానీ తెలంగాణ పరమైన అంశాలను దాంట్లో చొప్పించే ప్రయత్నం చేయటం. సంతోషపడుతూ చెప్పాల్సిన విషయం ఏంటంటే నమస్తే తెలంగాణ పత్రిక ఏర్పాటు తర్వాత కొత్తమార్గం వేస్తున్నారు. ఫీచర్స్ ఏం పెట్టాలి? దాంట్లో శీర్షికలు ఏముండాలి? ఎలాంటి అంశాలు దాంట్లో పెట్టడం ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని చూపించొచ్చు అనేది డిస్కషన్స్ జరుగుతున్న సందర్భంలో సినిమా గురించిన చర్చ వచ్చింది. చర్చ వచ్చినప్పుడు సినిమా గురించి ఏం చెప్పినా మళ్ళీ ఆంధ్ర ప్రజలకు సంబంధించిన సినిమానే రాయాల్సి వస్తుంది కదా! అలాంటప్పుడు ఎందుకు అనే దశకు కూడా వచ్చింది. అప్పుడు ఆలోచించిన అంశం ఏంటంటే తెలంగాణలో సినిమా పెద్దగా లేదు. నిజానికి చెప్పాలంటే ఎప్పుడో 1974లో అంతకు ముందు ధీరుబాయ్ గంగూలీ టైంలో 1921 కూడా హైదరాబాద్ స్టేట్‌లో తెలంగాణ సినిమా హైదరాబాద్ సినిమా ఉంది. 1974 - 75 ఆ ప్రాంతం నుండి అడపదడపా

కవిత

బి. నరసింగారావు తీసిన కొన్ని సినిమాలు ఉన్నాయి. కానీ మన తెలంగాణ వారికి ఫ్యూచర్ తెలంగాణ ఫిలిం మేకర్‌కి ఒక వరల్డ్ సినిమాని పరిచయం చేయొచ్చు. మిగతా సోకాల్డ్ ఆంధ్ర బేస్డ్ పత్రికలు ఏవైతే ఉన్నాయో వారు ఇవ్వలేని సినిమా సమాచారాన్ని మనం అందించవచ్చు అని ఆలోచించి భారతీయ సినిమా, వరల్డ్ సినిమాల్లో ఉండే విశేషమైన అంశాలు అంతర్జాతీయ స్థాయి సినిమా అని పరిచయం చేసేలాగా ఒక ఫీచర్ పెట్టాల నుకుని దాంట్లో సిరీస్ ఆఫ్ ఆర్టికల్స్‌ని ఒక నాలుగు సంవత్సరాల పాటు నమస్తే తెలంగాణ పత్రికలో నేనే రాయడం జరిగింది. దాంట్లో మిగతా సాహిత్యానికి సంబంధించినవి కూడా రాస్తూ ఉన్నాను. ఇంకొకటి ఏమిటంటే పత్రిక మాత్రమే కాదు మన గోసని, మన భాషని, మన ఆకాంక్షను వ్యక్తం చేయడానికి మనకంటూ ఒక మీడియా ఉండాలి అనేది ఒక ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన లోంచి టీన్యూస్ అనేది పుట్టింది. టి న్యూస్ అనేది ఏర్పడినప్పుడు అప్పట్లో నమస్తే తెలంగాణ పత్రికలో పని చేయడమన్న, నమస్తే తెలంగాణ పత్రికలో వ్యాసాలు రాయడమన్నా, టీ న్యూస్‌లో పనిచేయడ మన్నా లేకపోతే టీ న్యూస్‌లో ప్రొడక్షన్ చేయాలన్నా అదేదో ఫర్బిడన్ జోన్ నిషిద్ధ ప్రాంతం లాంటి పరిస్థితి ఆ టైంలో 2008-09 ప్రాంతంలో నడిచిన సందర్భాలు మనం చూశాం. ఆ టైంలో ప్రేమ్‌రాజ్ అని ప్రోగ్రామింగ్ హెడ్డుగా ఉన్నారు. టీన్యూస్ కొత్తగా ఏర్పడినప్పుడు ఆ ఫీచర్స్ రాసేవారు ఎవ్వరూ లేరు. తెలంగాణలో ఉండే పుణ్యక్షేత్రాల గురించి, తెలంగాణలో ఉండే పర్యాటక క్షేత్రాల గురించి, మన సంస్కృతి గురించి, బోనాల గురించి, బతుకమ్మ గురించి, సమ్మక్క సారక్క జాతర గురించి వీటన్నింటి గురించి మనం చెప్పాలి. మన వాయిస్‌ని, మన గోసని, మన ఆకాంక్షని, మన ఔన్నత్యాన్ని, మన వైభవాన్ని చెప్పాలి అని అనుకున్నప్పుడు దానికి ఎవరూ ముందుకు రాని సమయంలో మళ్లీ నేనే దాంట్లో రాసిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని వందల, వేల వ్యాసాలు, కొన్ని వేల హాఫెనవర్ ప్రోగ్రామ్స్ రాసి వాటిని వీడియో ఫార్మెట్లోకి ఎడిట్ చేయించి దాన్ని టెలికాస్ట్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం టైంలో నా కాంట్రిబ్యూషన్ ఏమిటంటే ఒకవైపు కవిత్వము, సాహిత్యము, వ్యాసాలు, మరొక వైపు ఛానల్స్ పరంగా అలాగే పత్రికల పరంగా వాటికి రాయడం వల్ల నాదైన తరహాలో నేను ప్రజల్లో చైతన్యాన్ని, ఆలోచనని, తెలంగాణ సోయిని వివిధ కోణాల్లో నుంచి తీసుకువచ్చే ప్రయత్నం చేశాను.




ఇంటర్వ్యూ
డా. వెల్దండి శ్రీధర్
9866977741


## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# ఇనుప తీగ

తీపి గురుతుల బాల్యం చిత్రించిన కథ...



వేముగంటి మురళి
96765 98465

ఇల్లంత తిరిగినా పాతయి సెల్స్ గాని, ఇనుప ముక్కలుగానీ దొరుకుతలేవు. దొంతులఅర్ర చీకటి చీకటిగా ఉన్నది. కరెంట్ పోయినట్టుంది. మనసునవడుతలేదు కృష్ణకు. కంసే కం ఒక్క ఇనుప తీగనన్న వెతకాలి. పెద్దబాపు అర్రల పానాల డబ్బున్నది. అండ్ల చానా నట్లు, బోల్టోట్లు ఉంటయ్. ఒక్క తీగనన్న దొరకకపోతదా అనుకోని, పిల్లి లెక్క అర్రలకు జొర్రిండు.

కృష్ణ అర్రలకైతే జొర్రిండు గాని, అసలు పనితనమంతా ఇప్పుడే ఉంటది. చీమ చిటుక్కుమన్నా పెద్దబాపుకు తెలుస్తది. మెల్లగ పనిచేసుకోవలె అనుకోని, తాలప్చెయ్యి కోసం వెతుకుతున్నడు. దొరుకుతలేదు. అయిదు నిమిషాలు అయ్యింది. గచ్చు పక్కనుంచి పెద్దాయి మాటలు వినబడుతున్నయి. అర్రలదిక్కే వస్తున్నదనుకొని మెల్లగ బయిటికొచ్చిండు.

"ఎంరా! కృష్ణ అప్పటి నుంచి నీ కోసమే గుళ్ళ వెతికిన. ఇంట్లనే ఉన్నావ్, జర పెద్దకోమటి నాగభూషణం దుకాండ్లకు పొయ్యి, ఆంప్రొ బిస్కట్ పుడా పట్కరాపో" అన్నది.

పెద్దాయంటే చానా ఇష్టం తనకు. ఏ పని చెప్పినా టక్కున చేస్తా. కానీ ఇప్పుడు బయటికి పోవుడు ఇష్టం లేదు. అయినా దుకాండ్లకు పోవుడు తప్పుతలేదు.

అన్న సైకిల్ తీసుకొని కాంచి తొక్కుకుంటా దర్గా దాటిన. ఎదురుంగ వెంగలోల్ల సీను సైకిల్ సీటు తొక్కుకుంట వచ్చి కట్ కొట్టిండు. కొద్దిగైతే బండలమీది పెద్దమోరీల పడుతుంటి. వెన్కకు తిరిగి తిడుదామంటే ఉల్టా సీనే "పంతులు సైకిల్ నడుపరాకపోతే ఇంట్లకూసోవాలే గని, గిట్ల నడుపుతరా" అని ఎక్కిరిచ్చి పోయిండు.

మెల్లగ రాయిచెట్టు హనుమాండ్ల దాటి కమాన్ దగ్గరికి పోయిన. రోడ్డుమీద స్కూటర్లు వస్తున్నై, పోతున్నై. సైకిల్ హాండిల్ ఎడమచేతితోని, గొట్టం కుడిచేతితోని పట్టుకొని నడుపుకుంట నాగభూషణం కిరాణా దుకాణం ముంగట కష్టపడి స్టాండ్ వేయడానికి ప్రయత్నమంతా చేసి,

"ఓ సేటూ! జర మీ గుమాస్తాని బయటికి రమ్మంటరా జల్ది. సైకిల్ స్టాండ్ వెయ్యొస్తలేదు నాకు. సైకిల్ కిందవడుతున్నది. లోపటినించి గుమాస్తా గాలయ్య వచ్చుకుంట "పంతులు మొన్న గిట్లనేజెస్తివి. సైకిల్ నామీద పడేస్తివి. అంగికంత చైన్ ఆయిల్ అంటి నల్లగైంది. నిర్మా పౌడరేసి ఎంత ఉతికినా మరకలు అట్లనే ఉన్నయి. గొట్టంతొక్కుడు నేర్సుకుంటే పెద్దోనివైతవ్, స్టాండ్ గూడా నీ అంతల నువ్వే వెయ్యొచ్చు"అని సైకిల్ స్టాండ్ వేసి దుకాణం లోపటికి పోయిండు.

కమాన్ గడియారం అయిదు గంటలు కొట్టింది. మనసంతా ఇనుపతీగ, కరాబైన బ్యాట్రీ సెల్స్ చుట్టే తిరుగుతుంటే, లోపల అన్ని రకాల బిస్కెట్లు అక్కడ దొరుకుతయి. మా ఊర్ల మశూర్ దుకాణం ఇది.అక్కడ దొరికే చక్కెరగోలీలు అంటే నాకు చానా ఇష్టం.

దుకాణం అంతాజూస్తున్న మొలలుగొట్టిన గోడలకు నిప్పో కంపెనీవి పెద్దసెల్స్ ప్యాకెట్లు, ఇనుపకొక్కెలు కనవడి మనసునువడితిప్పినై. "పంతులు అట్లనే బీరిపోయినవ్ ఏం గావాలే సామాన్" అని గల్లా పెట్టెమీద కూర్చున్న నాగభూషణం చిన్నకొడుకు, నా జిగ్రీ దోస్త్ నాగేందర్ అన్నడు. "అరే నాగేందర్ నువ్వున్నవా దుకాండ్ల, ఈ సైకిల్ స్టాండేసుడు లొల్లిల నిన్నుజూడలేదు. ఏం సామాన్ లేదు. పెద్దబాపు ఖాతాల ఒక్క ఆంప్రో బిస్కట్ పుడా ఇచ్చి రాస్కో"అన్న. రాస్కో అన్న మాట వినంగనే నాగేందర్ అన్నడు" నిన్న సుభూషణం సారు చెప్పిన లెక్కల్ చేసినవా, లేకుంటే తోలు తీస్తడు. ఎర్కేకదా నీకు" సుభూషణం సార్ పేరు వినంగనే భయమైంది. ఆ సారు మట్టల మీద కొట్టిన దెబ్బల నొప్పి ఇంకా తగ్గలేదు. ఇగ ఇంటికి తొందరగ పొయ్యి లెక్కల్ చెయ్యాలే అనుకొని దుకాణంల నుంచి బయిటికొచ్చి సైకిల్ ఫైడిల్ మీద కాలువెట్టి ఒక్కతొక్కు తొక్కిన అంతే పెద్ద గడియారంలా చిన్నముల్లు లెక్క

క థ

సైకిల్ ఉరుకుతున్నది.

★ ★ ★

ఇనుపతీగ ముచ్చట మర్చిపోయి ఈ రోజుకు మూడురోజులు. కాలం గడియారం కుంజీలెక్క వెన్కకు మర్లదు కదా.

ఆ రోజు ఆదివారం గుడిలో ఉన్న చిన్న రథం లొకలొక అయ్యిందని పెద్దబాపు "అరే! కృష్ణ అ(రలున్న పానాల డబ్బా తీస్క రాపో" అన్నడు. ఆ మాట వినంగనే డబ్బాలుండే ఇనుపతీగ గుర్తుకొచ్చి సంక్రాంతి పండుగకు పెద్ద పతంగి దొరికినంత ఆనందమయ్యింది. వెంటనే ఉర్కి డబ్బా తీస్కొని వచ్చిన. పెద్దబాపు జంధ్యానికున్న తాళంచెయ్యిని తీసి డబ్బా మూత తీసిండు. లోపట ఏం ఉన్నయో కనవడ లేదు. ఏక్ ఇంచ్ పాన మాత్రం నా చేతుల పెట్టిండు.

మొత్తానికి మా ఇంట్ల పనిచేసే ఎడ్డోడు, నేను కలిసి రథం నట్లను టైట్ చేసినం. పెద్దబాపు సంతోషంతోని చెరో చారానా ఇచ్చిండు. మనసు మళ్ళా ఇనుపతీగమీదికి గుంజింది.

★ ★ ★

బడి ఇంట్రవెల్ కొట్టిండు దానయ్య. బయటికి పొయ్యి ఏమన్నా కొనుక్కుందామంటే హెచ్చెమ్ తొడుపునూరి కిష్టయ్య సారు రూంలనుంచే పోవాలి. సారుకి తెల్వకుండ బయటికి పోలేము. అందుకే ఆ ఆలోచన విరమించుకున్న. నాగేందర్ సుభుష్ణంసర్ క్లాస్ మొదలైందని పిల్చిండు. బల్మీటికి క్లాస్ ల కొచ్చిన. సార్ లెక్కల చెపుతున్నడు. బోర్డ్ మీద త్రిభుజం గీసిండు. నా కండ్లకు అది మూడు ఇనుప తీగలను బోర్డ్ మీద అతికించినట్టు గొట్టింది. మళ్ళా మనసు ఇనుపతీగ మీదికి గుంజింది.

రెండో శనివారం బడికి తాతిల్. పశువుల అంగట్ల సైకిల్ గొట్టం నేర్చుకుందామని నాగరాజుని రమ్మన్న. నాగరాజు క్లాస్ ల ఫస్ట్. సైకిల్ తొక్కుట్ల గూడా ఫస్ట్. అందుకే రమ్మన్న.

పొద్దున పదిగొట్టంగ నాగరాజు గీతభవన్ దగ్గర కలిసిండు. ఇద్దరం సైకిల్ నూక్కుంట పశువుల అంగట్లకు పోయినం. ఆ రోజు అమవాస్య అంగడి బందు. నాగరాజు తన సైకిల్ స్టాండేసి, నన్ను మెల్లగ గొట్టం మీద కూర్చోమన్నడు. తను వెనుక క్యారెజ్ పట్టుకొని నన్ను సైకిల్ తొక్కుమన్నడు. నేను మెల్లగ గొట్టం తొక్కుకుంటా అట్లనే సీట్ మీద

> **నాగరాజు** తట్టు సంచి నెత్తికి కప్పుకొని రయ్యుమని వాళ్ళింటి దిక్కు పోయిండు. నేను పెడ్డమోరీ పక్కనుంచి సైకిల్ నూక్కుంట వస్తున్న. బండల మీదికి రాంగనే మాతంగి వాగు పులిగాండ్రింపు లెక్క శబ్దం చేసుకుంట పోతున్నది. ఆకాశంల దిక్కు చూస్తే వాన చినుకులు ఇనుపతీగలు జారిపడ్డట్టు గొట్టవట్టింది. మళ్ళా మనసు అటుదిక్కు మర్రుతుంటే, సైకిల్ నీళ్ళ వేగానికి కొట్టుకపోవట్టింది.

కూర్చున్న, నాగరాజు ఎప్పుడో క్యారెజ్ వదిలేసిండు. నా అంతల నేనే అంగడంత సీట్ తొక్కుకుంట తిరిగిన. కానీ సీట్ మించి ఎట్లా దిగాలనో అర్థమైతలేదు. నాగరాజుని పిలుస్తున్న. తను దూరంగ ఉన్నడు. పడిపోతనేమో అని భయమైంది. ఇదివరకు కాంచి తొక్కుతున్నప్పుడు కిందవడి మోచేయి కొట్కపోయింది. ఈసారి అట్లకాకుడదనుకొని అటుఇటు



చూస్తుంటే తుమ్మచెట్టు కనవడ్డది. దానికింద ఒక బండ ఉన్నది. అంగట్ల పశువులు అమ్మేటోళ్లు వేసుకున్నట్టు ఉన్నరు కూసోనీకి. నాకు చానా ధైర్యమొచ్చింది. సైకిల్ తొక్కుకుంటా ఆ చెట్టు దగ్గరికిపోయి మెల్లగ సీట్ మించి గొట్టం మీదికి దిగి ఎడమకాలుని బండమీద పెట్టిన. నేనూ పడలేదు. సైకిల్ కి ఏంగాలేదు. నాగరాజు ఉరుక్కుంట వచ్చినన్ను గొట్టం మించి దింపిండు. ఇప్పడిదాంక యాడికి పోయినవ్ అన్న నాగరాజుని. నేనేడికి పోలె నీవెన్కనే ఉన్న. మొత్తానికి ఒంటిగంటదాంక సైకిల్ తొక్కి ఇంటిదిక్కు మర్లినం.

మొగులై ఒకటే ఉరుముతున్నది. నాకు భయమైంది. నాగరాజును తొందరపెట్టిన. శరభయ్య గుడిదాంక రాంగనే ముసురందుకుంది. నాగరాజు చానా హుషార్ పిట్ట తన సైకిల్ క్యారియర్ కు తట్టు సంచిని పెట్టుకొనే వచ్చిండు. మెల్లగ వానల తడుసుకుంటనే గీతాభవాన్ దాటినం. నాగరాజు తట్టు సంచి నెత్తికి కప్పుకొని రయ్యుమని వాళ్ళింటి దిక్కు పోయిండు. నేను పెద్దమోరీ పక్కనుంచి సైకిల్ నూక్కుంట వస్తున్న. బండల మీదికి రాంగనే మాతంగి వాగు పులిగాండ్రింపు లెక్క శబ్దం చేసుకుంట పోతున్నది. ఆకాశంల దిక్కు చూస్తే వాన చినుకులు ఇనుపతీగలు జారిపడ్డట్టు గొట్టవట్టింది. మళ్ళా మనసు అటుదిక్కు మర్రుతుంటే, సైకిల్ నీళ్ళ వేగానికి కొట్టుకపోవట్టింది. దాన్ని ఆగవట్టుడు కష్టమైతున్నది. అప్పుడే చెత్రీ పట్టుకొని దవాఖానా నుంచి పాషా వస్తున్నడు. అరే పంతులు సైకిల్ కొట్టుకవోతున్నదా, ఈ చెత్రీ వట్టుకో నేను మీ ఇంటిదాంక తెస్తా సైకిల్ ను అని మెల్లగ ఇంటిదాంక వస్తుంటే కూరగాయల మార్కెట్ నుంచి టమాటాలు, ఆలుగడ్డలు కొట్టు కొస్తున్నయి. కాళ్లకు తాక్కుంటవోతుంటే ఎంతో ఆనందమైతున్నది.

ముసురు ముసలమ్మ వణుకు లెక్క చిన్నగ మొదలై మూడురోజులున్నది. ఇంట్లనుంచి బయటికి పోవుడే గగనమైంది. సాకలోల్ల యాదగిరి పెద్దదర్వాజా ముంగట నిలబడి పిలుస్తున్నడు సీకాటాడుదామని. రాయిచెట్టు కింద మస్తు మట్టి తడిసి ముద్దయ్యింది. సీకు భూమిక మంచిగ దిగుతది. ఇంక మన వాడకట్టోల్లు బయిట మస్తుగున్నరు. నిన్ను సుత రమ్మంటున్నరు అని వెళ్లిపోయిండు యాదగిరి.

గచ్చుల గూనపెంకల మించి బొట్లు బొట్లుగా నీళ్ళ చుక్కలు రాలుతున్నై. బయిటికి పోవాల్నా వద్ద వెనక ముందైతున్న. అమ్మ తిడుతది. బట్టలన్నీ బురద బురుదైతై. అయినా ధైర్యంజేసి ఇంట్ల ఎవ్వలకు చెప్పకుంట రాయిచెట్టు కిందికివోయిన. అక్కడ పెద్ద జాతరనే ఉన్నది. సీకువట్టుకొని రెడీగా ఉన్నడు బామనోళ్ళ సీను. రాయిచెట్టు తడిసిన వెంట్రుకల్లాంటి ఆకులమించి నీళ్ళు దులిపింది. సీకాట పిచ్చిల అంగిలాగు తడిచినా ఎవ్వరూ పట్టించుకుంటలేరు.

నేను సీక్ చేతులకు తీసుకొని భూమిలకు దిగేయవొయినా, అంతట్లనే ఇంట్ల నుంచి అమ్మ పిలిచింది.

సీకు అక్కడనే పారేసి, దోస్తులకు చెప్పకుంటనే ఇంట్లకు ఉరికినా. దర్వాజా ముంగట నిలవడి అమ్మ తిడుతున్నది.

మళ్ళా నా మనసు ఇనుపతీగ మీదికి పోయింది. సీకుగుడా ఇనపదే కదా. దాన్ని ముట్టుకున్నపటి సంది మళ్ళా తీగకోసం ఆలోచన మొదలైంది.

ఆ రోజు ఆదివారం. అందరూ ఎవరి పనిల వాళ్లున్నరు. ఈసారి పకట్బందిగ ఇంట్ల వెతకాలే. దూలం మీద చూసిన. చీమచూపేసుకొని కట్టె అల్మారా వెనక వెతికిన. ఇనుప తీగగాని, కరాబైన సెల్స్ గానీ దొరకలే. టైం లేదు. ఆయనొస్తడు. ధైర్యంజేసి పెద్దబాపును అడుగుదామని గుల్లకు పోయిన.

భయం భయంగనే అడిగిన" పెద్దబాపూ! నాకు ఒక ఇనుప తీగనన్న, పాతయ్ ఖరాబైన సెల్స్ అన్న కావాలి" అన్న.

"ఎందుకురా, అది చిలుం పట్టి ఉంటే చేయిగిట్ట కొస్కపోతే లేనిపోని రప రపరా" అన్నడు.

మంకురుపట్టువట్టిన నేను.

"జీకులెక్కనేవట్టుకున్నవ్ నన్ను" అని పెద్దబాపు నీ పుస్తకాల తనబ్బీ ఉన్నదిగదా దాని అడక్కు చిలుమ్ పెట్టిన రథం గీర శీల మొన్నవెట్టిన తీస్కపో అన్నడు. ఆ మాట విని చిన్న తీగ అడిగితే పెద్దబాపు బరువున్న శీల ముక్క ఇస్తున్నడు అనుకొని, ఒకటే ఇంట్లకు ఉరికిన. ఓర్నీ ఇన్నిరోజుల సంది నాకు కావలసిన దానికోసం వెతికితే గది నా తనబ్బీలనే ఉన్నది. మనసుకు చేదబాయి నిండి పోయినంత సంబురమయ్యింది.

బయిటినుంచి సయ్యద్ తాత గొంతు శ్రావ్యంగ వినవడుతున్నది. పాత ఇనుప సామాన్లు కొంటా, ప్లాస్టిక్ కొంటా...... ఇంకా ఏవేవో రాగాలు దీస్తూ చెప్తున్నడు. నేను ఆ శబ్దం విని రోడ్డుమీదికొచ్చినా.

"ఫంతులూ, ఏం తెచ్చినవ్" అన్నడు సయ్యద్ తాత.

శీల తీసి చేతులవెట్టిన. చేత్తోనే బరువుజూసిలోపట సంచిలేసుకొన్నడు. వేడివేడి బఠాణీలు పిడికెడు తీసుకోని నా ముందటి జేబు కీసల పోషిండు. గంతే గిన్నిరోజుల ఎదురుచూపులు ఖతమైనై. కీసల చేయివెట్టి రెండు బఠాణీ గింజల్ని నోట్లవేసుకొని ఇంట్లకురికినా.

**తను వెనుక క్యారెజ్ పట్టుకొని నన్ను సైకిల్ తొక్కుమన్నడు. నేను మెల్లగ గొట్టం తొక్కుకుంటా అట్లనే సీట్ మీద కూర్చున్న, నాగరాజు ఎప్పుడో క్యారెజ్ వదిలేసిండు. నా అంతల నేనే అంగడంత సీట్ తొక్కుకుంట తిరిగిన. కానీ సీట్ మించి ఎట్లా దిగాలనో అర్థమైతలేదు. నాగరాజుని పిలుస్తున్న. తను దూరంగ ఉన్నడు. పడిపోతనేమో అని భయమైంది. ఇదివరకు కాంచి తొక్కుతున్నప్పుడు కిందవడి మోచేయి కొట్కపోయింది.**

సాహితీ శిఖరం

## సాహిత్య, సంగీత, చిత్రకళల్లో మేటి

# మహాదేవి వర్మ



1982 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

మహాదేవి వర్మ1907లో ఏప్రిల్ 27న జన్మించారు. 1987 సెప్టెంబర్ 11న మరణించారు. తన జీవితాన్ని సాహిత్యమయం చేసుకున్నారు. ఆమె ఆధునిక హిందీ కవయిత్రులలో ఒకరు. హిందీ సాహిత్యంలో ఛాయావాద యుగానికి మూల స్తంభాలుగా భావించబడే నలుగురు సాహిత్యకారులలో ఆమె ఒకరు. ఆధునిక హిందీ కవిత్వంలో ఆమె సేవలకు గాను ఆమెను ఆధునిక మీరా అని కూడా గుర్తింపబడ్డారు. ప్రఖ్యాత కవి సూర్యకాంత్ త్రిపాఠీ నిరాలా ఈమెను విశాల హిందీ మందిరపు సరస్వతిగా అభివర్ణించాడు. మహాదేవివర్మకు గుర్తింపు తెచ్చిన రచనలు, యమ, మేరా పరివార్, పాత్ కె సాథీ. పద్మభూషణ్ (1956), జ్ఞానపీఠ పురస్కారం (1982) పురస్కారాలు ఆమెను వరించాయి.

స్వాతంత్ర్యానికి పూర్వపు భారతదేశంలోనూ, స్వతంత్ర భారతదేశంలోనూ నివసించిన ఈమె బహుళ సమాజంలో పనిచేస్తూనే భారతదేశంలో అంతర్లీనంగా ఉన్న ఉద్వేగాలను, ఆక్రోదనలను చూసి, పరిశీలించి, అంధకారాన్ని పోగొట్టే దృష్టిని ఇవ్వటానికి ప్రయత్నించిన సాహిత్యకారుల్లో గుర్తింపు పొందారు. మహాదేవి కవితలే కాకుండా సమాజోద్ధరణా పనులు, మహిళాచైతన్యం కోసం చేసిన కృషి చాలా ప్రభావితమైంది. ఈమె మానసిక క్షోభను ఎంత హృద్యంగా వర్ణించిందంటే దీపశిఖలో అది ప్రతి మనిషి యొక్క వేదనగా అందరి హృదయాలను హత్తుకుంది. అది పాఠకులనే కాకుండా సమీక్షకులను కూడా లోతుగా ప్రభావితం చేసింది. ఈమె ఖరీబోలీ హిందీ మాండలికంలో వ్రాసిన కవితల్లో అప్పటివరకు కేవలం భృజ్ భాషలోనే సంభవమని అనుకొన్నంత మృదువైన శబ్దాలను పలికించింది. దీని కోసం ఆమె తన సమయంలో వాడకంలో ఉన్న సంస్కృత, బెంగాళీ భాషలలోని మృదువైన పదాలను ఎన్నుకొని వాటికి హిందీ తొడుగులు తొడిగింది. సంగీతంతో పరిచయముండటం వల్ల ఈమె పాటల నాద సౌందర్యం, లయబద్ధమైన వ్యంజనాల శైలి అనితరసాధ్యమైనది. అధ్యాపకురాలిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి పదవీ విరమణ చేసింది. అనంతరం ప్రయాగ మహిళా విద్యాపీఠం యొక్క ప్రధానాచార్యులైంది. ఈమెకు బాల్యవివాహమైనా జీవితం మొత్తం అవివాహిత మాదిరిగానే గడిపింది. ప్రతిభావంతమైన కవయిత్రి, గద్య రచయితైన మహాదేవి వర్మ సాహిత్య, సంగీతాల్లో నైపుణ్యంతో పాటు చక్కటి చిత్రకారిణి, సృజనాత్మక అనువాదకురాలు కూడా. ఈమెకు హిందీ సాహిత్యంలోని అన్ని పతిష్ఠాత్మకమైన పురస్కారాలను అందుకొన్నది. భారత సాహిత్యాకాశంలో మహాదేవివర్మ ధ్రువతారగా వెలుగుతున్నది. గత శతాబ్దంలో అత్యంత లోకప్రియమైన మహిళా సాహిత్యకారిణిగా మహాదేవివర్మ పురస్కారాలు అందుకొన్నది. 2007లో ఈమె జన్మ శతాబ్ది ఉత్సవాలు జరుపబడడం విశేషం. 1991, సెప్టెంబరు 16న ఆమె పేరుమీద భారత ప్రభుత్వం రూ. 2 విలువగల పోస్టల్ స్టాంపును విడుదల చేసింది.



వ్యాసం

# వయస్సును సవాల్ చేస్తున్న సృజనకారుడు

సృజనకారునికి వయో తారతమ్యం లేదని తెలిపే వ్యాసం...



డా॥ బాణాల శ్రీనివాసరావు
79890 69211

సృజనకు వయస్సుతో సంబంధం లేదని రంగు చక్రపాణి గారి కవిత్వం చదివితే ఇట్టే అర్థమౌతుంది. వారు ఎనబది పై చిలుకు వయస్సులో కూడా రెట్టింపు ఉత్సాహంతో కవిత్వం రాస్తున్నారంటే  వారిలో ఎంత సృజనాసక్తి మరియు సృజనాశక్తి ఉందో అర్థం చేసుకోవచ్చు. మనచుట్టూ జరుగుతున్న అనేకానేక సంఘటనలకు వారు కవిత్వంలో స్పందించే తీరు నిజంగా పాఠకుల్ని ముఖ్యంగా కవిత్వ ప్రేమికుల్ని  అబ్బురపరుస్తుంది. ఎంతోమంది సమాజం కోసం దేశం కోసం అంకితమైన మహనీయుల త్యాగాల్ని, వారి సామాజిక సేవాదృక్పథాన్ని తన అక్షరాలతో కవితా మాలలల్లి ఆ త్యాగమూర్తుల మెళ్ళో వేసి సమాజం పట్ల దేశం పట్ల ఒక కవిగా తన బాధ్యతను నిరూపించుకుంటున్నారు.

రోజురోజుకు మానవులలో స్వార్థం పెరిగిపోయి ప్రకృతిని కొల్లగొట్టటం వల్ల సమస్త మానవాళి జీవితాలు ప్రశ్నార్థకంగా గందరగోళంగా మారిన వైనాన్ని "సునామి" అనే కవితలో ఇలా హెచ్చరిస్తారు:

అదుపూ ఆజ్ఞలేని భూగర్భ
జలసంపద కొల్లగొట్టడం మానకపోతే
సమతుల్య
వాతావరణమునకెంతో హానికరం!
అసలు మానవాళి మనుగడకే
ప్రమాదకరం!!

ప్రకృతి ప్రజలకు భగవంతుడిచ్చిన వరం. అటువంటి ప్రకృతిని మానవాళి ప్రయోజనాల కోసం వాడుకోవాలి కానీ కొంతమంది స్వార్థపరులు ధనాశతో ప్రకృతిని ఛిన్నాభిన్నం చేసి భూగర్భ జలసంపదను కొల్లకొడితే మానవాళి మనుగడకే ప్రమాదకరమని వాపోతున్నారు  ఈ సీనియర్ కవి.




రోజూ ఎక్కడో ఓ చోట కామాంధుల పాముకోరల్లోపడి బలైపోతున్న ఆడవాళ్ళ నుద్దేశించి కూడా ఎంతో ఆవేదనతో ఇలా కవితావాక్యాలవుతాడు

అబలలు తమ సహజ, అణకువ
సహన గుణాలకే కట్టుబడి ఉండక
బలమైన నాగులను
మట్టికరిపించిన
గండుచీమల్లా మృగరాజులను
ఢీకొనాలే!

అంటు వారి గుండెల్లో ధైర్యవాక్యాల్ని నూరిపోస్తాడు. అవరమైతే యోగవిద్యలు, కరాటే లాంటి పోరాట కళల్ని నేర్చుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతాడు. ఇటువంటి కామంధుల్ని చీడపురుగుల్ని ఏ చట్టాలు గాని ఏ ప్రభుత్వాలు గాని శిక్షించట్లేదు. ఒకవేళ శిక్షలు పడినా ధనంతో ప్రలోభపెట్టో రాజకీయ పలుకుబడితోనో ఆ శిక్షలనుంచి తప్పించుకోవడం మూలాన తప్పు చేసేవారికి భయం అనేది లేకుండా పోయింది. అందుకే మనదేశంలో శిక్షలు ఇస్లాం దేశాల్లోలా కఠినాతి కఠినంగా

వ్యాసం

ఉండాలంటున్నాడు కవి. బలియైన అబలల మనస్సులు శాంతించాలంటే....

మగ మృగరాజులకు
లింగమార్పే...... సరియైన తీర్పు....

అని ఆ అబలల తరుపున వకాల్తా తీసుకుంటాడు.

"వందేమాతరం-యువతరం" కవితలో... పచ్చదనానికి పర్యావరణానికి విఘాతం కలిగించే దుండగుల్ని శిక్షించి ప్రజల్లో చెట్లయొక్క పచ్చదనం యొక్క ప్రాముఖ్యాన్ని తెలియపర్చి అందరూ ఇళ్లల్లో రహదారుల్లో మొక్కలు నాటి హరితవిప్లవానికి నాంది పలకాలంటారు. ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనను కాపాడుతుందనే నీతి సూత్రాన్ని ప్రబోధిస్తాడు.

"Life is a game we have to play , life is a battle we have to fight" అని అన్నట్లు జీవితాన్ని ఒక ఆటలాగా అనుకోవాలి, జీవితాన్ని ఒక పోరాటంగా తీసుకోవాలి. జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని తట్టుకుంటూ పోరాటపటిమతో ముందుకు సాగిపోయి అనుకున్నది సాధించాలి. కవి ఇక్కడ జీవితంలోని వేదాంతాన్ని మ్యూజికల్ ఛైర్ గేమ్‌తో పోల్చి కవిత్వం చేసాడు ఇలా...

ఈ నేలపై పుట్టిపడ్డప్పుడు ఒక్కడే!
ఈ నేల విడిచి నేలలో
కల్సిపోయేటప్పుడొక్కడే!!
జీవితం జీవించటానికే
ఆ జీవించుటలో 'మ్యూజికల్ ఛైర్స్ గేమ్' ఆటలా
ఆడుతూ పాడుతూ పాట వినుచు

**తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అద్వితీయం, అనిర్వచనీయం. తన జీవితాన్నీ తెలంగాణ సాధించడానికి అంకితం చేసిన త్యాగధనుడు, సిద్ధాంతకర్త. అటువంటి మహానీయుని వ్యక్తిత్వం త్యాగం గురించి చక్రపాణి "మహాప్రస్థానం" అనే కవితలో ఇలా కవితాగానం చేస్తారు...**



జీవించుటయే!!

జీవితాన్ని పరిస్థితులను బట్టి మలుచుకుంటూ, రకరకాల పాత్రలు పోషిస్తూ జీవించాలనేది కవి అంతరంగ అభిప్రాయం.

తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అద్వితీయం, అనిర్వచనీయం. తన జీవితాన్ని తెలంగాణ సాధించడానికి అంకితం చేసిన త్యాగధనుడు, సిద్ధాంతకర్త. అటువంటి మహానీయుని వ్యక్తిత్వం త్యాగం గురించి చక్రపాణి "మహాప్రస్థానం" అనే కవితలో ఇలా కవితాగానం చేస్తారు...

నిరంతర తెలంగాణ గానం చేసి
తెలంగాణ అవతరణకు రోడ్డు నక్షా గీసి
తెలంగాణ సిద్ధాంతకర్త అయ్యాడు
తెలంగాణ జాతిపిత అయ్యాడు
ఎంతనిమ్మలం నీ గళం
ఎంత ఆర్తి తెలంగాణకై నీ కలం
తెలంగాణా ఉద్యమానికి పోసాడు ఆగిపోని ఊపిరి
తెలంగాణ ఉద్యమకారులకిచ్చాడు అకుంఠిత స్ఫూర్తి...
అంటూ జయశంకర్ నిబద్ధతను ప్రతి తెలంగాణవాసి గుండెల్లో నింపుకోవాలంటాడు.

"మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా ప్రపంచదేశాల్లో భారత కీర్తి పతాకను ఎగరేసిన అపర మేధావి డాక్టర్ అబ్దుల్ కలాం త్యాగనిరతిని సేవాగుణాన్ని కీర్తిస్తూ "కర్మయోగి" అనే కవితా ఖండికలో ఇలా వారి వ్యక్తిత్వాన్ని బొమ్మకడతారు...

మానవులను సృష్టించినది కానరాని బ్రహ్మ
దేశభద్రతకై క్షిపణులను సృష్టించిన
శ్రీ కలాం క్షిపణి బ్రహ్మ...

భారతీయులందరు కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశం కోసం పాటుపడితే అదియే ఆయనకు సరియైన నివాళి అంటాడు ఈ కవిబ్రహ్మ.

ఇంకా విశ్వకర్మల గురించి "చేతి వేళ్ళు" అనే కవితలో విశ్వకర్మ కులస్థులైన మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞలు ఐకమత్యంగా ఉండి హక్కుల్ని సాధించుకోవాలని హితవు పలుకుతాడు.

ముసలితనంలో అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరితనంతో సమయాన్ని ఎలా గడపాలో తెలియక ఇబ్బంది పడే ముసలివాళ్లకు "ముదిమి" అనే కవితలో తనయొక్క కవితా వాక్యాలతో వాళ్ళనిలా ఉత్తేజితుల్ని చేస్తారు

Don't go for pill for every ill
మిత్రమా!
Smile and shake of ills with a strong will నేస్తమా!

ఇంకా, "జోహార్లు", "పింఛనుదారు", "నాయన" అనే కవితలు సమాజంలోని రకరకాల రుగ్మతలని సమస్యల్ని ప్రతిబింబించే కవితలుగా చెప్పుకోవచ్చు. ఈ వయస్సులో కూడా ఇంత శ్రద్ధతో క్రమశిక్షణతో కవిత్వాన్ని ప్రేమిస్తూ సమాజాన్ని చాలా దగ్గరగా పరిశీలిస్తూ కవిత్వాన్ని సానపెడుతున్న చక్రపాణి ఈనాటి యువకవులకు ఒక గొప్ప ఇన్స్పిరేషన్ అని చెప్పొచ్చు. ఆయన ముందు ముందు ఇంకా ఎన్నో మంచి మంచి కవితల్ని రాయాలని సాహిత్య సేవ సమాజ సేవ చేయాలని మనసారా కోరుకుంటూ వారి కవిత్వం గురించి ఈ నాలుగు మాటలు రాయటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ....

పుస్తక పరిచయం

# అద్భుత కవితాసరిత్తు

వృద్ధాప్యంలో మనిషి ఎంత యువకునిగా ఉండవచ్చని చెప్పే కవిత్వం గురించిన విశ్లేషణ...



ఆచార్య మసన చెన్నప్ప
98856 54881

వృద్ధాప్యాన్ని స్నేహపూర్వకంగా ఆహ్వానించిన కవి గోపిగారు. 'వృద్ధోప నిషత్తు'లోని కవితలు నా దృష్టిలో "Old age Poems" కావు. "Golden Poems". యౌవనం సింగారమైతే వృద్ధాప్యం బంగారం. బంగారం విలువైనట్లే వృద్ధాప్యమూ మానవజీవితంలో విలువైందే. విలువైన వస్తువు విలువను గుర్తించడమే కవికున్న విలువ.

గోపిగారు ఉపనిషత్తుల ఉద్దేశం తెలిసినవారు. భగవంతునికి సమీపంలో బాగుగా కూర్చొనేటట్లు చేసే విద్యకే ఉప నిషత్తని పేరు. భగవంతుని ప్రసాదమైన వృద్ధాప్యానికి దగ్గరగా కూర్చొమ్మని, దాని తత్వాన్ని తెలుసుకొమ్మని ఈ 'వృద్ధోపనిషత్తు'ను రచించినట్లు నాకనిపిస్తుంది. వృద్ధోపనిషత్తు నిండా కవిత్వమే ఉంది.

శరీరంలోని అవయవాలేవిధంగా శరీరం అస్తిత్వానికి దోహదపడతాయో, జీవితం పరిపూర్ణం కావడానికి బాల్యాది దశలు కూడా ఉపయోగపడతాయి. వృద్ధుడు కాని మనిషుండడు. శిథిలం కాని భవనముంటుందా? ఐతే శిథిలమైన భవనాన్ని పునర్నిర్మించుకోవచ్చు కాని, వృద్ధాప్యాన్ని మార్చుకోలేం కదా అని చాలామంది సందేహం. కాని గోపిగారు వృద్ధాప్యంలో మనిషి ఎంత యువకునిగా ఉండవచ్చునో తన కవిత్వం



ద్వారా చెప్పారు. 'వృద్ధుడు రద్దయిన పద్దు కాదు, మన కృతజ్ఞతకు హద్దు' అని అందుకే అన్నారు. తానెవరో తెలుసు కోవడానికి బాల్యం, యౌవనం అవకాశాన్ని ఇవ్వవు. ఒక వృద్ధాప్య కృతజ్ఞుడైన కవి దృష్టిలో 'వాడవని ఆత్మకథ!' శరీరంలో జీవి ఉంటేనే జీవితం. శరీరానికే ముసలితనం గాని, ఆత్మకెక్కడిది? అందుకే 'వాడవని ఆత్మకథ' అనే ఒక్కమాటలో ఆత్మ శాశ్వతమైందన్న సత్యాన్ని వెల్లడించాడు కవి.

ప్రపంచం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఇదే ధర్మం శరీరానికీ వర్తిస్తుంది. అందుకే కవి 'మార్పంటే పురోగమనానికి ప్రతీక అంటారు. సాధారణంగా వృద్ధులు ఒంటరితనాన్ని అనుభవిస్తుంటారు'. చనిపోయిన సహచరి ఫోటోలోంచి జాలిగా పలకరించినప్పుడు ఒంటరితనం గుర్తుకొచ్చి కన్నీటి చుక్క సముద్రంగా మారుతుందనడం నా వంటి ఒంటరి వాళ్ళను దృష్టిలో పెట్టుకొని చెప్పిన మాటలుగానే భావిస్తాను.

నీళ్ళు తెమ్మని ఎవరిని అడిగినా ప్రయోజనం లేనప్పుడు కన్నీళ్ళ పర్యంత మయ్యే వృద్ధుల కన్నీటి జీవితాలను గోపిగారిలాగా మరొకరు వర్ణించలేరేమో ననిపిస్తుంది. ఎలాంటి కొడుకైనా అమ్మ చివరి యాత్రను చూసి చలించకుండా ఉండడు. కాని ఆ కొడుకు గోపిలాంటి కవి ఐతే, బాధాతప్తహృదయుడై కుండపోతగా మేఘాన్ని కురవొద్దంటాడు. గాలిని గట్టిగా వీయొద్దంటాడు. నదీ ప్రవాహాన్ని ఉరక లేయొద్దంటాడు. ఎందుకంటే అతడు రచిస్తున్నది ...కన్నీటి కావ్యమాయె. అనుభవిస్తేగాని అందరికి అర్థం కాని మనోవ్యథను అక్షరాల ద్వారా అభివ్యక్తం చేయడం మహాకవి ఐతే తప్ప అన్యులకు శక్యం కాదు.

గోపిలో నేనొక తాత్త్వికుణ్ణి దర్శించాను. ఈ ప్రపంచం ఎక్కి దిగే గుర్రమే కావచ్చు కాని అనేకానేక స్మృతులు మనస్సును చీకాకుపరుస్తాయి. అలాంటప్పుడే మనిషి స్థితప్రజ్ఞత్వానికి పరీక్ష!

పుస్తక పరిచయం

వృద్ధులను గౌరవించడమంటే, వృద్ధాప్యాన్ని అసహ్యించుకోకపోవడమే. 'స్థితి' అర్థమైతే 'గతి' అర్థమవుతుంది. వృద్ధాప్యం ఎంతకాలం ఉంటుంది? ఆ దశ కూడా గతంలోకి జారిపోతుంది. దశలన్నీ మజిలీలే. కాకపోతే మైలురాళ్ళు. వాటిని దాటుకుంటూ పోవడమే జీవితం.

"రోడ్డు వెనక్కి వెళ్ళినట్లు
జీవితంలోంచి
యౌవనం జారిపోయి"

ఐనా దారి విశాలమైంది. జీవితయాత్ర ఆగినా, జీవుని యాత్ర ఆగనిది! ఎన్ని జారిపోయినా, ఎన్ని మారిపోయినా, ఆత్మ స్వరూపజ్ఞానానికి ఢోకా ఉండదు. 'ప్రవహించిన నదిని నేను, మైదానంలో ప్రవేశించాను' అనడం ఆత్మదృష్టికి చక్కని ఉదాహరణ.

ప్రాణమే జీవుణ్ణి శరీరంలోకి తీసుకొని వచ్చేది, శరీరం నుంచి వెలుపలికి తీసుకొనిపోయేది. ఆ ప్రాణ మహత్తు తెలిసిన కవి నోట వచ్చిన పలుకులే 'నేను బయటకు రావడం సబబు కాదు' అనేవి. శరీరాన్ని 'సంచిత ఐతిహాసిక ప్రకాశంగా' అభివర్ణించడం ఆత్మతత్త్వం బోధపడని కవికి సాధ్యం కాదు.

ఈడూజోడూ కుదిరినవాళ్ళు దంపతులైతే, వెంటవెంటనే వృద్ధులౌతారు.




అప్పుడు భార్య భర్తకు మరింత దగ్గరవుతుంది. "సూర్యుడుదయించడం ఆలస్యమైతే (అంటే భర్త పడకమీంచి లేవడం ఆలస్యమైతే) మబ్బుల దుప్పటిని లాగి పారేస్తుంది. అతణ్ణి చైతన్యవంతుణ్ణి చేసే శక్తి ముమ్మాటికీ ఆమెదే.

ఈ కవిత్వంలో 'ఒల్డేజి పెన్షన్', 'నాయనమ్మ', 'జ్ఞాని', 'పాత ప్రేయసి', 'మృత్యువుతో ముఖాముఖీ', మరణం లేని మరణం' మొదలైన అధ్యాయాలు కవి తాత్త్విక భూమికకు బలాన్నిస్తున్నవి, ఒకటికి రెండుసార్లు చదవదగినవి.

కవి వృద్ధాప్యాన్ని అన్ని పార్శ్వాల నుంచి అనుశీలించి, లేదా అనుభవించి గ్రహించిన సారాన్ని వెల్లడించిన తీరు అమోఘం! ఒకచోట 'వృద్ధాప్యమతని క్రీడకు చిట్టచివరి మైదానం మాత్రమే' అంటారు కవి. జ్ఞాపకాలను మైలురాళ్ళుగా నాటుతాడని ఉత్సాహపరుస్తాడు కూడా.

గతంలో అర్థం కాని పాటల్ని అర్థం చేసుకునే అవకాశం వృద్ధాప్యంలోనే వస్తుందని, ఐతే తన ముందుకు వచ్చే అన్నం గిన్నెలో కోడలి చిరునవ్వులుండవని చెప్పిన మాటలు సత్యదూరమైనవి కావు. జీవితం ఎంత విలువైందో వృద్ధాప్యమే చెప్పుందంటానికి 'కృతం స్మర' అన్న వేదవాక్యం బలాన్నిస్తుంది.

వృద్ధాప్యం జీవితంలో కాదనలేని ఒక అవస్థ. కాని మనిషి నా దృష్టిలో ఒక వ్యవస్థ. జీవిత గమనాన్ని గుర్తిస్తూ, లక్ష్యాన్ని చేరుకోవడమే అతని పని. నిర్భయంగా, నిజాయితీగా, నిశ్చలంగా ఎలాంటి కష్టాలు వచ్చినా నిలబడగలిగిన ధీశాలి కావాలని, చావును చంపేటంతటి శక్తివంతుడు కావాలని గోపిగారు ఈ కృతిని రచించారు. యథార్థ విషయాలను తాత్త్వికంగా వచించారు. అందుకే ఇది ఉపనిషత్తయింది, అద్భుత కవితాస రిత్తయింది.

కవిత



# స్ఫటిక వీక్షణం



**ఆంగ్లమూలం: సారా టీస్ డేల్**
**తెలుగు అనువాదం: ఎలనాగ**

నన్ను నేను నాలోపల మళ్లీ కూడగట్టుకుంటాను
కలువరేడునూ కాంతిని విసిరే సూర్యుడినీ చూడగలిగేలా సంయోజించి,
మెరుగు పెట్టిన స్ఫటికపు బంతిని తయారు చేస్తూ,
చెల్లాచెదరైన 'నేను'లను ఏకీకృతం చేసుకుంటాను.

గంటల తరబడి భావి కాలపు రాకడను, వర్తమానపు పోకడను వీక్షిస్తూ,
జరగబోయేదాన్ని చెప్పే తరుణి లాగా ఏకాగ్రతతో కూర్చుంటాను
స్వీయప్రాధాన్యంతో అశాంతిగా లోపలికీ బయటికీ రాకపోకలు సాగించే
మనుషుల చిన్నచిన్న తరళ చిత్రాలను గమనిస్తుంటాను.

కథ

# మాంజా

దుర్మార్గానికి చిక్కిన బాల్యం..



పి.వి. శేషారత్నం
94929 25291

అందరూ దిగిపోయాక తను కూడా తాపీగా బస్సు దిగి చుట్టూ చూసాడు యాదగిరి.

పట్నంలో సరుకమ్ముకుని ఖాళీ తట్టలు బుట్టలతో ఆ పల్లెలో దిగినవాళ్లంతా చాలావరకు పాటక జనమే..... ఊరేమంత మారలేదు... అదే చెరువుగట్టు... చెరువు దగ్గరి మర్రిచెట్టు పెద్దపెద్ద ఊడలతో అలాగే ఉంది.

ఒక్క క్షణం యాదగిరి మనసు అనిర్వచనీయమైన ఆనందంతో ఊగిపోయింది. అసలు బస్సు ఆ పల్లె చేరడానికి రెండు నిమిషాల ముందు నుంచీ అతని కలాగే వుంది,

'ఈ ఊళ్ళోనేగా బాల్యం గడిచింది'. బాల్యం తిరిగిరాని కాలానికి తరలి పోయినా మది జ్ఞాపకాలు మాత్రం ఈ ఊరిని చుట్టుకుని పరిమళాలు చిందిస్తూనే ఉన్నాయి. చిన్నతనం ఎంత చిత్రమైందో? తెలిసిన ప్రపంచమే చిత్రాతి చిత్రంగా కనిపిస్తుంది. ఏదో చేసేయ్యాలన్న ఉత్సాహం ఉరకలు వేస్తుంటుంది. సాహసాలవైపు పరిగెడుతుంది.

బాల్యంలోని భావాలు అపురూపం. భుజాల మీద జట్టు వేసుకుని తిరిగిన నేస్తాలను మరిచిపోవడం ఎవరికయినా అసాధ్యం. తన దోస్తులు.. ఎక్కడున్నారో ఏంచేస్తున్నారో? ఆ వయసు చిత్రమేంటో గాని... ఏక్షణాన ఎందుకు పోట్లాడుకుంటారో మళ్లీ ఎప్పుడు కలిసిపోతారో తెలియని అపురూప క్షణాలవి.

దోస్తులను తలుచుకునేసరికే యాదగిరి మనసు పులకరించింది. అక్కడ గోడలకు అంటుకున్న రకరకాల రంగులు చూసి చప్పున చిన్నప్పటి హోలీ రోజులు గుర్తొచ్చాయి. ఇప్పుడైతే ఫాషన్ కోసం చేసుకునే హోలీకి అన్ని రంగులున్నాయి. మరి అప్పుడో...???

ఈ ఊరు వదిలే ముందు ఆఖరి హోలీ సమయానికి తను ఏడోతరగతి, ఎందుకోగాని తమ దోస్తుల్లోని సరోజిని, ప్రతాప్ పోట్లాడుకుని రెండురోజులుగా మాటల్లేవ్.

ఆ ముందురోజే సోషల్ మాస్టారు రంగుల పండగ హోలీ గురించి చెప్పారు.

"హోలీ సమయానికి వసంతం తాలుకు బంగారు రంగులు వ్యాపిస్తుంటాయి. ఆ రంగులను తమ మనసుల్లో నింపుకునేందుకు జనం రంగులతో హోలీ ఆడతారు... ఈ పండగరోజున ఎంతటి శత్రువులయినా మిత్రులవుతారు? మనసుల్లో కోపాలు పోయి అందరూ ఒకటైపోతారు. అదంతా హోలీ రంగుల్లోని మహిమ. రంగులను ఎవరికి స్నేహంతో పూస్తే వారు తప్పకుండా పాత పగలు కూడా మరిచిపోయి, కొత్త మైత్రీబంధంలోకి వస్తారు. ఎవరిమీద నయినా కోపతాపాలున్నా వాటన్నింటినీ రంగులు చల్లి కడిగేసినట్టుగానే మనసులోని మాలిన్యాలను కడిగేయాలని హోలీ సందేశం."

ఆ క్షణమే తమ మిత్రబృందం హోలీ ఆడాలని ఒట్టేసుకుంది.

అయితే అప్పుల్లో రంగులు కొనుక్కుని కలుపుకోవడం అంతగా తెలియదు. ఊళ్లో దొరికే సహజ రంగులకే ప్రాధాన్యం ఇచ్చేవారు. అందుకే సరోజిని ఎక్కడెక్కడో వెతికి ఊదారంగునిచ్చే బచ్చలి పళ్లను పోగుచేసింది. లలిత తిలకం సీసాలను, సిరాబుడ్డిని పట్టుకొచ్చింది. ఇంక సుబ్బు, తను ఆకుల వేటలో పడ్డారు. వెంకటేశం వాళ్ల పక్కింటి నర్సును మచ్చిక చేసుకొని పాత ఇంజక్షన్ గొట్టాలు సంపాదించాడు.. మొత్తానికి దోస్తులంతా పాత బకెట్లు సంపాదించి అన్ని రంగులూ కలిపేసి రంగుల నీళ్ల పిచికారీల్లా జల్లుకుంటూంటే సరోజినికి, ప్రతాప్‌కి మాటలు కలిసిపోయాయి.

ఆ తర్వాత పెద్ద చిక్కొచ్చి పడింది. అందరికీ ఒళ్లంతా దురదలు మొదలయ్యాయి. చెరువు దగ్గరకి పోయి అందులో ఎంతసేపు మునిగినా దురదలు పోలేదు. ఆఖరికి వెంకటేశం పక్కింటి నర్సు ఇచ్చిన మందు బిళ్లలు వేసుకున్న గంటకి గానీ అందరికీ దురదలు తగ్గలేదు. చివరకు తేలిందేమిటంటే... తాము కోసిన ఆకుల్లో దురదగుంటాకు

క
థ

కూడా కలిసిపోయిందని, ఆరోజంతా తలుచుకుని తలుచుకుని ఎంత నవ్వుకున్నారో దోస్తులంతా. ఆ దెబ్బతో మళ్లీ ఎప్పుడూ ఆ ఆకుల జోలికే పోలేదు.

ఈ చెరువుగట్టు దగ్గరే ఎన్నెన్ని కబుర్లు ఎన్ని ఆటలు?

బతకమ్మ పండక్కి పెద్ద బొట్టెట్టి చీరలుకట్టి అమ్మోరి ఘటాలు ఎత్తిపెట్టుకుని సరోజిని లలిత చిందేసేవారు.

సంకురాతిరి వస్తోందంటే అయిదు గురికీ ఒకటే సందడి... మగపిల్లలతో పోటీపడి సరోజిని లలిత కూడా గాలిపటాలు తయారు చేసేవారు. వెంకటేశం దారానికి గాజుపొడి రాసి మాంజా తయారు చేసేవాడు..

గాలిపటాలు వయ్యారంగా తోక ఊపుకుంటూ అలాఅలా గాలిలో తేలిపోతూ నాట్యం చేస్తుంటే... అబ్బ ఎంత సంబరపడిపోయేవారని... ఎవరి గాలిపటం ఎత్తుకు ఎగురుతుందో అని పోటీలు పడేవారు. గాలిపటం గాని దారం తెగిపోయి చాలాసేపు గాలిలో చక్కర్లు కొడుతూంటే... తర్వాత కిందకి రాలిపోతుంటే దానిని పట్టుకోవడానికి కింద, ముందూ, వెనుకా చూసుకోకుండా ఎలా పరుగులు పెట్టేవారని?

ఓసారి పక్కింట్లో పడిన గాలిపటం కోసం సరోజిని సాహసం చేసి మగరాయుడిలా ఎత్తుగా ఉన్న గోడ ఎక్కి అటువైపు గబాలున ఉరికేసరికి కాలు బెణికింది...దూకిన చప్పుడుకి ఆ యింటివాళ్లు ఎక్కడ వచ్చేస్తారోనని లలిత ఒకటే ఏడుపు... ఇంటివాళ్లని ఆపేందుకు వాళ్ల గుమ్మాల ముంగిట గొంతులు మార్చి.. దోస్తులంతా పాడుతూ ఎంత హంగామా చేసారని..

చివరికి సరోజిని తేరుకుని... మళ్లీ గోడ ఎక్కింది కాని, కాలి బెణుకు వల్ల ఇవతలికి దూకలేక అయింటి వాళ్లకి దొరికిపోవడం.... వాళ్లు సరోజిని అవ్వకి చెప్పడం.,,, అవ్వ పిల్లలందరినీ కేకలెయ్యడం.. తర్వాత ఊరేసిన ఉసిరికాయలను చేతిలో పెట్టడం..... అవన్నీ నిన్నా మొన్నా జరిగినట్టున్నాయి....

ఒకసారి సుబ్బు, తను ఎగరేసిన గాలిపటాల తాలూకు మాంజా ఓ పావురం రెక్కలకి తగిలి అది రెక్క తెగి విలవిలా కొట్టుకుంటూ కిందపడేసరికి... దోస్తులంతా ఏంచెయ్యాలో తెలియక ఒకటే ఏడుపు. ఇంతలో అటువైపు తెలుగు మేష్టారు శర్మగారు వచ్చారు. ఆయన ఆయుర్వేద వైద్యం కూడా చేసేవారేమో.. తమచేత ఏవో ఆకులు తెప్పించి, నూరించి ఆ పావురాయికి పూయించి కట్టు కట్టించారు. మాస్టారితోటే వారం రోజుల పాటు దోస్తులంతా దానిని వంతులు వేసుకుని కాపాడారు. లలిత రోజూ ప్రేమగా దానిని చేతుల్లోకి తీసుకుని గింజలు తినిపించేది. చివరకి అది స్వేచ్ఛగా ఎగిరిపోతుంటే అంతా తృప్తిగా నిట్టూర్చారు.

ఇక ఆరోజు నుంచి గాలిపటాల దారానికి గాజుపొడి పూసిన మాంజా పూస్తే ఒట్టు. ఊళ్లో పిల్లలెవరినీ కూడా పూయని చ్చేవారు కాదు... కానయితే పట్టులేని దారం తొందరగా తెగిపోయి గాలిపటాలు గాలిలో దారీ తెన్నూ లేక కొట్టుకు పోతుంటే బాధగా నిట్టూర్చేవారు.

చివరికి తమ జీవితాలు కూడా ఆ గాలిపటాల్లాగే తలో దిక్కుకు పోయాయి.

చేప తనంత తానుగా కొంగ నోటికి చిక్కినట్టు తను, వెంకటేశం ఆరోజున

> **ఇంతలో** అటువైపు తెలుగు మేష్టారు శర్మగారు వచ్చారు. ఆయన ఆయుర్వేద వైద్యం కూడా చేసేవారేమో.. తమచేత ఏవో ఆకులు తెప్పించి, నూరించి ఆ పావురాయికి పూయించి కట్టు కట్టించారు. మాస్టారితోటే వారం రోజుల పాటు దోస్తులంతా దానిని వంతులు వేసుకుని కాపాడారు. లలిత రోజూ ప్రేమగా దానిని చేతుల్లోకి తీసుకుని గింజలు తినిపించేది. చివరకి అది స్వేచ్ఛగా ఎగిరిపోతుంటే అంతా తృప్తిగా నిట్టూర్చారు.

చేసిన తెలివితక్కువ పనికి తమ బ్రతుకులే మారిపోయాయి. బతకమ్మ పండగసంబరాల్లో... నాటక సమాజం ఓవ్యక్తి... 'మీరందంగా ఉన్నారు. సినిమాల్లో చేరితే బోల్డు డబ్బొస్తుందని ఆశపెడితే గుడ్డిగా నమ్మి ఇంట్లో చెప్పకుండా బస్సెక్కి ఆ వ్యక్తి వెంట వెళ్లారు ఇద్దరూ. అతను మాయమాటలాడుతూనే తీసికెళ్లి ఓ పాడుపడిన భవనంలో పడేసాడు. అక్కడ తమలాగ చాలామంది పిల్లలున్నారు.

"వీళ్లంతా మీలాగ నాశిష్యులే." అన్నాడా వ్యక్తి.

ఆ వయసులో అది మోసం అనే ఆలోచన ఎక్కడొస్తుంది? సినిమాల్లో నటించేసి డబ్బు సంపాదించేసి ఏదో సాధించేసి అందరి మెప్పు పొందాలనే ఉత్సాహం ఉరకలు వేసే వయసు ఆ పదహారు.

ఇప్పుడు ఎంత అనుకుని ఏంలాభం... ఆ వయసే అంత... ఆలోచిస్తున్న యాదగిరి నిట్టూర్చాడు.

అందుకే పెద్దవాళ్లంటారు... పదహారులో 'నా' అనేది రాజ్యం చేస్తుంది. ముప్పయిలో కాస్త వివేకం మేలుకుంటుంది. నలభై వచ్చాకే నిదానం వచ్చి చేరుతుంది అని. తను చూసాడు కదా! ఇప్పటికీ ఆ పదహారు వయసు హోరులో... దోస్తీ పేరుతో ఎందరో మత్తుమందులకి తాగుడికి, బలవుతూనే వున్నారు.

అమ్మాయి పక్కనుంటే ఒళ్లు తెలియకుండా ఎంత స్పీడుగా నడిపితే అంత థ్రిల్... గర్ల్ ఫ్రెండ్ మెచ్చుకుంటే ఇంక ఆనందానికి ఆనకట్ట ఎక్కడుంటుంది? యాక్సిడెంటులవడానికి సగం కారణం ఇలాంటి అత్యుత్సాహమే.

ఆవయసులో తనకీ, వెంకటేశానికి నూనూగు మీసాల వెనుక ఎక్కడలేని స్వతంత్ర భావాలు.. బోలెడు డబ్బు సంపాదించి పెద్దలకి చూపిస్తే ఎంత గర్వంగా చెప్పుకుంటారో అనేగా ఉచ్చులో చిక్కుకున్నారు?

ఆనాడు భవనంలో స్పృహ తప్పించి ఆవ్యక్తి ఎక్కడెక్కడికి తరలించాడో

కథ



> **ఆనాడు** భవనంలో స్పృహ తప్పించి ఆవ్యక్తి ఎక్కడెక్కడికి తరలించాడో ఇప్పుడు ఏం చెప్పగలడు? ఆతర్వాత వెంకటేశాన్ని మరి చూడలేదు. వాడిని ఏంచేసారో ఏమో? తనకయితే కాలు విరిచేసారు. కొందరికి జిల్లేడు పాలతో కళ్లు పోగొట్టారు. కొందరికి జేబులు కత్తిరించే పని... చివరకు తన బ్రతుకు అడుక్కోవడమే అయింది. అడుక్కుని డబ్బులు తేనిరోజున ఒంటిమీద కమ్చీలు నాట్యం చేసేవి. తనలాంటి వాళ్లని ఎన్నిరకాలుగా అడ్డదారుల్లో ఉపయోగించుకోవాలో అన్ని మార్గాల్లోను ఉపయోగించుకున్నారు.

ఇప్పుడు ఏం చెప్పగలడు? ఆతర్వాత వెంకటేశాన్ని మరి చూడలేదు. వాడిని ఏంచేసారో ఏమో? తనకయితే కాలు విరిచేసారు. కొందరికి జిల్లేడు పాలతో కళ్లు పోగొట్టారు. కొందరికి జేబులు కత్తిరించే పని... చివరకు తన బ్రతుకు అడుక్కోవడమే అయింది. అడుక్కుని డబ్బులు తేనిరోజున ఒంటిమీద కమ్చీలు నాట్యం చేసేవి. తనలాంటి వాళ్లని ఎన్నిరకాలుగా అడ్డదారుల్లో ఉపయోగించుకోవాలో అన్ని మార్గాల్లోను ఉపయోగించుకున్నారు.

పట్టుబడితే జనంచేత తన్నులు... డబ్బు తేలేదని యజమాని చేత దెబ్బలు... అతనిచ్చే దాంతోనే బతకాలి. అక్కడ తనలాగ ఎంతమంది పిల్లలో... ఎన్ని భాషలవాళ్ళో. తనలాగే వాళ్లనీ ఎక్కడెక్కడినుండో ఎత్తుకొచ్చి ఉంటారు, పని చెయ్యకపోతే వీపుల మీద కమ్చీలు... పారిపోయేందుకు లేకుండా యమభటు లాంటి రాక్షసులు కాపలా....

కొన్నాళ్ల తర్వాత ఓ కాంట్రాక్టరుకి ఓ యాభైమంది పిల్లల్ని అమ్మేసారు.

అక్కడ మరీ నరకం... ఓపికలేక పోయినా ఆ గనులు తవ్వాల్సిందే... ఒకోసారి మట్టిపెళ్లలు విరిగి తనలాంటి పిల్లల తలలు పగిలిపోయేవి. లేదా ఆ సొరంగంలోనే భూస్థాపితమయి పోయేవారు. అయినా ఆ రాక్షసులకు కనికరం ఉండేది కాదు. తమ దోస్తు చచ్చిపోయాడని కొత్తల్లో గుండెల విసిపోయేలా ఏడ్చేవాళ్లు. తర్వాత తమగతీ అంతేనని భయంతో వణికిపోయేవారు. అలా చచ్చిపోయినవాళ్లని అక్కడే పూడ్చేసేవారు. వాళ్ల దృష్టిలో తాము మనుషులు కాదు.. బానిసలు, అంత పనిచేసినా చాలీచాలని తిండి తింటే బలిసిపోతామని కడుపు మాడ్చేసేవారు. ఆ జీవితం ఓ నరకం.

అప్పట్లో తను ఆ పని ఎందుకు చేస్తున్నాడో తనకు తెలియదు. చెయ్యకపోతే వాళ్లు కొడతారు. చిత్ర హింసలు పెడతారు. అంతకంటె పనిచేసి ఎండిన డొక్క నింపుకోవడమే అప్పట్లో తాము చెయ్యగలిగింది. అంతులేని తవ్వకాలవి. కొన్ని చోట్లయితే గాలిలోనే ప్రాణాలు. ఆ తవ్వకాలన్నీ విలువైన రంగురాళ్లకోసమని ఆతర్వాత ఎప్పుడో తెలిసింది..

అక్కడి కొండలు నిట్ట నిలువుగా ఉండేవి. వాళ్లు అపుడప్పుడు తమకు కల్లు పట్టించి మరీ పంపేవారు బాధ తెలియకుండా తవ్వగలుగుతామని. ఊపిరి సలపకపోవడం... ఎక్కడినుంచి ఏ రాయి తలమీద పడుతుందోనన్న భయం. ఒకవేళ చచ్చినా తమ ప్రాణాలు ఎవరికి విలువ కనుక.....

ఎప్పుడయినా పోలీసులొస్తారని వాళ్లకు ఎలా తెలిసేదో గాని నిముషాల్లో తమని అక్కడినుంచి తరలించేసేవారు. తరువాత మళ్లీ మరో చోట... అక్కడా అదే జీవితం... వెంకటేశు తనతో ఉంటే కనీసం

ఇద్దరూ కష్టసుఖాలయినా చెప్పుకునేవారు అసలు... బక్కలా ఉండేవాడు బ్రతికి ఉన్నాడో లేదో చెప్పడం కష్టం..

తలచుకుంటున్న యాదగిరికి కన్నీళ్లొరాయి.

ఆరోజు తన జీవితంలో బంగారు అక్షరాలతో రాసుకోవలసిన రోజు.... అదృష్టవశాత్తూ ముందు సమాచారం లేకుండా పోలీసు రైడింగ్ జరిగింది. అంతా పారిపోతున్నారు కొందరు పోలీసులకి దొరికారు... తనుకూడా దొరికితే బాగుండుననుకున్నాడు... కనీసం ఈ నరకం అయినా తప్పుతుంది...

కాని ఆ పరిగెత్తడంలో పెద్ద రాయి తగిలి పడిపోయాడు. లేచి ఎలాగో నిలబడ్డాడు కాని తలకు దెబ్బ తగిలి రక్తమోడుతోంది.

తనకి స్పృహ తప్పేలోగా పోలీసులు తనని చూడకపోతే... అటు పోలీసులు వెళ్లగానే మళ్లీ వచ్చేసే ఈ దుండగులు తమని బందీలుగా చేసి మరో చోటుకి తరలించేస్తారు. ఇంక జీవితాంతం ఈ బందిఖానా తప్పదు. అంతకంటే చావు నయం. తన నోటి నుంచి మాట రావడంలేదు అరవడానికి... అరవకపోతే తను అక్కడున్నట్టు తెలియక పోలీసులు వెళ్లిపోతారు. అందుకే లేని ఓపికనంతా తెచ్చుకుని తన చేతిలోని గునపంతో ఎత్తి తన ఎడమపాదంమీద దిగేసాడు... అంతే భూమీ ఆకాశం బద్దలయ్యేలా కేక... తన కంఠంలోంచి...

ఆ పోలీసాయన వెనక్కి తిరిగాడు. తనవైపుకు పరిగెత్తుకు రావడం కనిపించింది. బాగా రక్తం కారడంతో తనకు స్పృహ తప్పింది. ఆయన బృందం తనలాంటి కుర్రాళ్లను మాత్రం యాభైమందిదాకా రక్షించగలిగారు. వాళ్లందరినీ ఒక సేవాసంస్థలో ఉంచి తమ చిరునామాలు చెప్పగల వాళ్లని వాళ్ల ఇళ్లు చేర్చే ఏర్పాట్లు చేసారాయన. వెళ్లడం ఇష్టంలేక ఉండిపోయిన వాళ్లను బళ్లో చేర్చారు. తను కోలుకునేందుకు చాలా కాలమే పట్టింది. అయినా తనకు బాధకలగలేదు. ఆ నరకం నుండి విముక్తి కలిగింది. అంతే చాలు. అమ్మానాన్నలను చూడాలని ఉన్నా తను ఈ పరిస్థితిలో వెళ్లి వాళ్లకేం ఉపయోగపడగలడు... పైగా భారం అవుతాడు కూడా. అందుకే చదువుకుని సంపాదనాపరుడయ్యాక ఇంటికి వెళ్లాలనుకున్నాడు....

తన చదువులో సదనం మేనేజరు సహకారమే లేకపోతే తను ఇటువంటి ప్రతిష్టాత్మకమైన సంస్థలో ఉద్యోగస్తుడయేవాడే కాదు. చివరకు అంచెలంచెలుగా సిబిఐ తరపున... పిల్లలను తరలించే గ్యాంగ్ వివరాలు సేకరించాడు. అందుకోసం ఎంత పరిశోధన చేసాడో... ఎంతమందిని ప్రశ్నించాడో... ఎంతగా శ్రమపడ్డాడో... ఎందరు బాలలకో దాస్య విముక్తి కలిగించాడు... అయినా ఏదో అసంతృప్తి... తనని కాల్చేస్తోంది.. ఒక్కసారి ఈ ఊళ్ళోని తన దోస్తులను కలుసుకోగలిగితే? అందుకే తను ఈ ఊరొచ్చారు.

కాని ఏంలాభం? ప్రతాప్ అమెరికా వెళ్లిపోయాడని తెలిసింది. లలిత అత్తారింటికి వెళ్లిపోయిందిట. వెంకటేశం అసలు బ్రతికున్నాడో లేడో... సరోజిని గురించి ఎంక్వయిరీ చేస్తే... చాలాకాలం క్రిందట వాళ్ల కుటుంబం ఆ ఊరు వదిలేసారని తెలిసింది. ఇది ఒకప్పుడు తన ఊరే...తనకు అమ్మ ఒడి. కానీ దురదృష్టం.. అసలు తనవాళ్లెవరూ అక్కడ మిగల్లేదు.

కనీసం దోస్తులలో ఒక్కడైనా కనిపించలేదు. ఆలోచించినకొద్దీ యాదగిరి మనసును అంతులేని నిరాశ దుఃఖం ఆవరించాయి. పిచ్చివాడిలా... రాములువారి గుడి... తన పాత స్కూలు... బెమ్మంగారి చెయ్యాలతోట.. తిరిగాడు.

చివరికి దోస్తులతో చిన్నప్పుడు కేరింతలు కొడుతూ ఉయ్యాలలూగే పాత చెరువుగట్టు దగ్గరకు వచ్చాడు... అప్పటి రోజుల్లోలాగా అక్కడ పిల్లలే లేరు... బహుశా చదువుల పరుగులో ఇంట్లో గదుల్లోనో... స్కూళ్లలో స్టడీ అవర్స్‌లో చిక్కుకుపోయి బాల్యాన్ని బలిదానం చేసేస్తూ ఉంటారు. యాదగిరి చెరువు గట్టున కూర్చుని నీళ్లలోకి చూసాడు... తన ప్రతిబింబం మాత్రమే కనిపిస్తోంది. అప్పట్లో పోటీ పడి మరీ చెరువునీళ్లల్లో ప్రతిబింబాలు చూసుకునేవారు దోస్తులంతా..

చిన్నప్పటిలాగా నోట్లో రెండు వేళ్లేట్టుకుని ఈల వేస్తే ఆత్రంగా పరిగెత్తు కొచ్చే దోస్తులకోసం ఆక్రోశిస్తూనే పదేపదే వెతికి చూసాడు. ఊహూ... ఒక్కరంటే ఒక్కరు కూడా దొరకలేదు. ఏమయి పోయారు? ఎక్కడికి వలసపోయారు?

విసుగ్గా చెరువులోకి చిన్న రాయి విసిరాడు. గుండ్రని వలయాలు.. అందులో ఆనాటి వసంతం దొరుకుతుం దేమోనని... అనాటి తోటలో పూల గుభాళింపు నాసికాపుటాలకు సోకుతుందేమోనని ఆశపడ్డాడు. ఊహూ..

గట్టునే ఉన్న మర్రిచెట్టు మీంచి కోకిల కూస్తోంది....అది ఖచ్చితంగా ఆనాటి వసంత కోకిల కాదు. తనలాగే... అదీ... దోస్తులకోసం ఎక్కడ్నుంచో వెతుక్కుంటూ వస్తే అవి కనిపించలేదేమో... పాపం... పదహారేళ్లవయసు తిరిగి రానట్టే.. ఆ వసంతం మరి రానప్పుడు.. ఆనాటి తోటలో పూల పరిమళింపు ఆనాటికే పరిమితమైనప్పుడు......ఆనాటి కోకిల మాత్రం ఎక్కడికొస్తుంది? ఆనాటి ఆపాట ఎందుకు వినిపిస్తుంది?

తిరిగి పట్నం పోయే బస్సుకోసం చెరువుదగ్గర కూర్చుని ఎదురుచూడడం మొదలెట్టాడు యాదగిరి.

అతని మనసు బావురుమని ఏడుస్తోంది...

యాదగిరి భుజం మీద చల్లగా చెయ్యి పడింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు.

"ఇద్గో నువ్వు... యాద్గిరి కదూ... గిరీ!" రైతులా పంచెకట్టి బనీను వేసుకున్న వ్యక్తి...

యాదగిరి కళ్లు మెరిసాయి. ఏదో తెలిసిన పోలికలు. ఆ వ్యక్తి గట్టిగా యాదగిరి భుజం చరిచాడు.

'ఏం మారిపోయావు బయ్... నేను యాద్కి రాలా?... వెంకటేశాన్ని...'

కథ

'వెంకటేశూ?' యాదగిరి గాఢంగా కౌగలించుకున్నాడు అతన్ని. చెంపల వెంబడి కన్నీరు ధారగా కురుస్తోంది.

ఆ తర్వాత వెంకటేశం నోట్లోంచి క్షణం కూడా విరామం లేని మాటల ప్రవాహం...

"ఈడనే... పొలం చేస్తున్న గిరి! చిన్న ఇల్లు కట్టుకున్న బయ్.. మావకూతుర్ని చేస్కున్న. ఇద్దరు బిడ్డలు.. తమ్ముడు చెన్నయ్ పోయిండు... మాట్లాడవేం బయ్.. మనిసి మారినా నీ చూపు మారలే గిరీ! ఈ బుగ్గమీద ఆ మచ్చ... నువ్వెట్టిందేగా. దెయ్యాల తోటలో జామకాయను కొట్టిన... నీకు తగిలింద్రా... ఒరేయ్... వూరివాళ్లంతా నువ్వు ఆ ముఠాకి చిక్కి సచ్చినవనుకుండ్రు. ఆళ్లనుంచి తప్పించుకుని తిరిగొచ్చినంక నేను చెప్పింది విని.... నీకోసం మన ఊరు ఊరంతా... ఎంత ఎదికిండ్రో? సుబ్బు పట్నంలో పెద్ద ప్లీడరయింద్రా. నీ కాళ్కేమయింద్రా... ఆ బద్మాషులు నరికిండ్రా??'

భుజంమీద చెయ్యేసి అనర్గళంగా మాట్లాడుతూ తనను వాటేసుకుని కన్నీళ్లు కారుస్తున్న మిత్రుడిని చూస్తుంటే తెలియని పారవశ్యంలో మునిగి తేలుతున్నారు యాదగిరి. చెంపలమీంచి వరద ప్రవాహంలా ఉరికి ఉరికి వస్తున్నాయి కన్నీళ్లు... చిన్నప్పుడు దోస్తులతో ఎగరేసిన గాలిపటం దారం తెగి గాలిలో పల్టీలు కొడుతూ చివరికి పొలాల మధ్యలో దొరికినప్పుడు కలిగిన వెర్రి ఆనందం అది...!!!

మాంజా దెబ్బకి విలవిల్లాడిన పావురం గుర్తొచ్చింది. పావురంలాగే విలవిల్లాడిన జీవితానుభవాలు గుర్తొచ్చాయి.

హోలీ గుర్తొచ్చింది. రంగుల్లో కలిపిన దురదగుంటాకు దురదలు గుర్తొచ్చాయి. చెట్లెక్కి ఆడిన ఆటలు గుర్తొచ్చాయి. తగిలించుకున్న దెబ్బలు గురుతొచ్చాయి.

అయితే ఈసారి బాల్య మధురానుభూతులు పంచుకోవడానికి వెంకటేశం అనే ఓ ప్రాణి దొరికింది. సంబరంతో భుజాల మీద చేతులేసుకు నడుస్తున్న ఆ దోస్తులను చూసి ఏమనిపించిందో ఏమో మర్రి చెట్టుమీది కోకిల రాగం మార్చింది.

కోకిలకు రాగాలు కొత్తగా నేర్పాలా?

కవిత

# సౌందర్య పిపాసి



కొరుప్రోలు హరనాథ్, 97035 42598



చిగురాకుల సొగసులతో
చిరునవ్వుల దివ్వెల చెలియా....
అణువణువున గుండెల్లో కొలువైన
హరిత పత్ర రమణీ చక్కని నగుమోము
కనుల విందు చేయగా
పరువాల పెదవులు రసరమ్యామృత
మధురిమలే చిలుకంగా
కాంతిపుంజాల పలువరుసలు
మెరుపులై మెరవంగా ఆ చేప కనుల చిన్నదాని
సొగసు చూడతరమా....
నుదుటిన సిందూరం పోటాను పోటీగా
కురుల హొయలు లయలతో
మరుమల్లెలు కురిపించగ
తనువంతా పులకితమై చలించగా
ఆనందాల అందాల ఆ సౌందర్యరాశి
డెందమై నిలువంగా చక్కని ఆ రాణి
పారాణితో చుక్కలాగ మెరవంగా అదో అద్భుతం
ఆ వనిత నా కవితా జనిత

కవిత

# ప్రతిధ్వని



వెల్మల జయపాల్ రెడ్డి, 94411 68976

అలల సడిని..
అనంత జీవన సాగర ప్రతిధ్వనిని..
మహత్తరమైన మమత్వ స్పర్శను
ఒంటి మెరుపుగా నిలుపుకుని
మౌనంగా వంపులు తిరిగే
అక్షర మాలని....

చిగురు పిలుపునూ
చినుకు పలుకునూ
కోయిల పాటనూ
కోమలి మనసునూ
ప్రతిబింబించే నిరంతర భావ దీపికని..

చరిత గతుల అలికిడిని...
మానవతా వన వీచికని..
ఆకలి గొంతుల శ్రమ గీతపు పల్లవిగా
మ్రోగే చిరంతన స్వేద గీతికను....

యుద్ధ రీతులను నిరసించే
శాంతి కపోతాల రెక్కల చప్పుడుగా
వినిపించే నాదాన్ని..

జన జీవన నవ వేదంలా
తర తరాల అక్షర కాంతిని
కాల యవనికపై కళగా మిగిలే
చేతనత్వపు సాహిత్య రేఖని...



వ్యాసం

# మనదేశంలో జంతుజాలం విలుప్తతలు - పర్యావరణం హెచ్చరికలు

0000





చకిలం వేణుగోపాలరావు
98664 49348

శ్రీరామోజు హరగోపాల్
99494 98698


మనిషికి, మనిషి సర్వతోముఖ వికాసానికి ప్రకృతే పాథేయం. మనిషి అభివృద్ధిలో ప్రాకృతిక వనరులు, మనిషితో పాటు సహవాసం చేస్తున్న సమస్తజీవకోటి పాత్ర వుంది. మనుష్యులు నాగరికులైన కొద్దీ తమ సౌకర్యాలకు, అవసరాలకు, వినోదాలకు ప్రకృతిని ధ్వంసంచేస్తూ వచ్చారు. ఫలితంగా తామెక్కిన కొమ్మల్ని తామే నరుక్కున్నట్టయింది. ప్రకృతిలోని జీవావరణం, ఆహారచక్రం, ప్రాకృతిక సమతుల్యతలు దెబ్బతినిపోతున్నాయి. కారణంగా మనం మనతోపాటు జీవిస్తున్న జీవజాలాన్ని కోల్పోతున్నాం. ఈ విలుప్తతలు మానవ చరిత్రలో మచ్చలుగా మిగిలిపోరాదు. మనమే పూనుకుని మనభూగోళాన్ని ఆనంద నందనవనంగా చేసుకోవాలి.

భారత ఉపఖండంయొక్క పర్యావరణ చరిత్ర గత 10లక్షల సంవత్సరాల నుండి పరిశీలించినప్పుడు ఎన్నో ఆసక్తికరమైన ఒక్కోసారి ఆందోళనకరమైన విషయాలు కనిపిస్తాయి. ముఖ్యంగా గత 10వేల సం.రాల భౌమచరిత్ర అతి త్వరితంగా అంతరిస్తున్న జీవజాతులు వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తాయి. మరీముఖ్యంగా మానవ వికాసం తర్వాత అంటే గత 1000 సం.రాలలో ఈ మార్పులు కొట్టవచ్చినట్టుగా కనిపిస్తాయి. 10లక్షల సం॥రాలు



ఒక మానవజీవితంతో పోలిస్తే చాలా ఎక్కువ వ్యవధిగా కనిపిస్తుంది. కాని, 450కోట్ల వయసున్న భూమి చరిత్రతో పోలిస్తే కొన్ని నిమిషాలతో ఇది సమానం. వేల సంవత్సరాలు కొన్ని సెకన్లలో కనిపిస్తాయి. ఈ కొద్దికాలంలో జరిగిన మార్పులు వాతావరణంలో, పర్యావరణంలో ఏవిధంగా ఉన్నాయి. వీటి పర్యవసానం జీవజాతులలో మార్పులు, విలుప్తత సంభవించిన మొదలైన విషయాలను పరిశీలించుదాము.

వాతావరణ మార్పులు, సముద్ర మట్టం పెరగడం వంటి కారణాలవల్ల అడవులు అంతరిస్తున్నాయి. దానికితోడు మానవజనిత కారణాలైన అడవులు నరకటం, వేట మొదలైనవి తోడై అడవిజంతువులు వేగంగా అంతరిస్తున్నాయి. ముఖ్యంగా బలానికి, ఆరోగ్యానికి ప్రతీకగా కనిపించే పులులు త్వరగా తరిగిపోతున్నాయి. ఆవాస నాశనం (Habitat distruction), అనియంత్రిత పీడనం (uncontrolled persecution)

వ్యాసం

దీనికి ముఖ్యకారణాలు.

స్వాతంత్ర్యానికి పూర్వం హైదరాబాద్ నగరానికి అతి చేరువగా ఉన్న సరూర్ నగర్ నవాబుల 'షికార్ ఘా' గా వుండేది. ఇప్పుడు ఇది మానవుల కాంక్రీటు అరణ్యంలో భాగం. ఒకప్పుడు ఆస్మాన్ గఢ్ ప్రాంతంలో పులులు తిరిగినట్లు చరిత్రలో ఉంది. ఇప్పుడు ఈ ప్రాంతం నగరం నడిబొడ్డుగా మారింది. ఇదే వేగంతో పులులు తగ్గిపోవటం జరిగితే మన తరువాత తరం వీటిని సినిమాలు, పుస్తకాలలో మాత్రమే చూడగలరు.

బ్రిటిష్ ఇండియా కాలంలో లక్షల సంఖ్యలో ఉన్న పులులు 2014నాటికి 2226కు తగ్గిపోయాయి. 2018నాటికి మొత్తం 53 అభయారణ్యాలలో వీటి సంఖ్య అభివృద్ధిచెంది 2967 పులులు న్నట్లు రికార్డు. 2021లో దాదాపు 120పులులు వేటాడం, వ్యాధులు మొదలైన కారణాలవల్ల మృతిచెందినట్లు గణాంకాలు చెపుతున్నాయి. ప్రభుత్వం ఈ పులుల సంఖ్య ముందుముందు 6 వేలకు పెంచనున్నట్లు ప్రకటించింది.

చీతా ఒక పరుగెత్తి వేటాడే పులిజాతి ప్రాణి. ఇవి గడ్డిమైదానాలలో వీటి ఉంటాయి. ఆహారమైన జింకలు, అదే పరిమాణంలో ఉండే ఇతర జీవులను వేటాడుతాయి. పెద్దపులుల వలెనే ఇవి కూడా మారుతున్న పరిస్థితులకు మానవుని దురాశకు బలి అయిపో యాయి. చివరిసారిగా 1970 ప్రాంతంలో దక్షిణాదిలో ఇది కనిపించింది. ఇరాన్ నుండి దిగుమతి చేసుకొని చీతాలను

**చీతా ఒక పరుగెత్తివేటాడే పులిజాతి ప్రాణి. ఇవి గడ్డి మైదానాలలో ఉంటాయి. వీటి ఆహారమైన జింకలు, అదే పరిమాణంలో ఉండే ఇతర జీవులను వేటాడుతాయి. పెద్దపులుల వలెనే ఇవి కూడా మారుతున్న పరిస్థితులకు మానవుని దురాశకు బలి అయిపోయాయి. చివరిసారిగా 1970 ప్రాంతంలో దక్షిణాదిలో ఇది కనిపించింది. ఇరాన్ నుండి దిగుమతి చేసుకొని చీటాలను భారతదేశపు అడవులలో ప్రవేశపెట్టే ప్రభుత్వ ఆలోచన ఇంకా కార్యరూపం దాల్చలేదు.**

భారతదేశపు అడవులలో ప్రవేశపెట్టే ప్రభుత్వ ఆలోచన ఇంకా కార్యరూపం దాల్చలేదు.

చీతా పరిణామం, చరిత్ర ఆసక్తికరమే కాదు, గుర్తింపదగినది కూడా. దాదాపు అన్నిఖండాల అవతరణ జరిగిన కాలంలో చీతా 70 లక్షలేండ్ల కింద పరిణమించి వుంటుందని అంటారు శాస్త్రవేత్తలు. మనుష్యులతో చీతాల అంతశ్చర్యలు 32 వేల యేండ్ల నుంచి వున్నట్టు గుర్తించారు. మానవచరిత్రలోని అనేక నాగరికతల, సంస్కృతులలో ఒక చిహ్నం వంటిది చీతా. ఈజిప్షియన్ పాలకుల నుంచి మొన్నటి బ్రిటిష్ ఏలికల దాకా చీతాను పెంచుకోవడం హోదాగా, గౌరవంగా భావించేవారు. కళ్యాణీ చాళుక్య చక్రవర్తి 3వ సోమేశ్వరుడు రాసిన 'మాన సోల్లాసం'లో రాజులు చీతాలను వేటలో వాడుకునేవారని రాసి ఉంది.

Great Indian Bustard (GIB)గా పిలుచుకునే 'బట్టమేక పిట్ట' పరిస్థితి కూడా దాదాపు ఇదే. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలలో విరివిగా కనిపించిన ఈ పక్షి ప్రస్తుతం పదుల సంఖ్యకు పరిమితమయి రోళ్ళపాడు అభయారణ్యానికి పరిమితం అయింది. వీటి సంఖ్య పెరిగితే కాని భావితరాలకు ఇవి దక్కవు.

భారతీయ ఆరోచ్ (Bos primigenius) అనబడే ఈ ఎద్దు మన పెంపుడు జంతువు ఎద్దుకు పూర్వజీవి, పెద్దశాకాహారి. దీని కొమ్ములు చాలా దృఢంగా విశాలంగా ఉండేవి. చివరిదశ (10,000సం.రాలు)లో హాబిటాట్ లాస్, వేటాడటంవల్ల ఇది పూర్తిగా అంతరించిపోయింది. ఆఖరి 'ఆరోచ్' 1627లో పోలాండులో చనిపోయినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈ అంతరించిన ఎద్దు అవశేషాలు 1800 బి.సి.కి చెందినవి. వీటి శిలాజాలు ఉత్తరప్రదేశ్‌లో లభించాయి. 5500-4000 బి.సి.లో భారత ఉపఖండంలోని సింధ్ ప్రాంతంలో ఈ ఎద్దుజాతి విస్తృతంగా ఉండేది. దక్షిణాదిలో దీని ఉనికి తక్కువ. ఈ ఎద్దుజాతి నుండి వచ్చినవే Zebu పశు వులను కూనో వైల్డ్ లైఫ్ సాంక్చువరి మధ్యప్రదేశ్‌లో చూడవచ్చు. ఇవి ఆసియాజాతి సింహాలకు ఇప్పటికి కూడా ఉపయోగపడుతున్నాయి. ఒకప్పుడు ఈ ఎద్దుజాతి పూర్వీకులే సింహాలకు





ఆహారమయ్యేవి.

రైనోసిరాస్ ఇనెర్మిస్ అను శాస్త్రీయనామంగల చిన్నసైజు ఖడ్గమృగం సుందరవనాలలో(సుందర్ బన్స్) తిరుగాడుతుండేది. దీనికి ఒంటికొమ్ము ఉండేది. కొమ్ములు లేని ఖడ్గమృగాన్ని ఫ్రెంచ్ ఎక్స్ ప్లోరర్ 1826-1829లో వేటాడినట్లు తెలుస్తున్నది. ఇది Rhynoceros inermisకి ఉపప్రజాతిగా భావించబడుతున్నది. మొత్తం మీద ఇప్పుడు రైనోలు అస్సాంలోని అభయార ణ్యాలకు పరిమితమైపోయాయి. ఈ ఖడ్గమృగం ఎగువ ప్లీస్టోసీన్ కాలంలో (25,000 బి.సి.) దక్షిణాది వరకు వ్యాపించి ఉండేదని కర్నూలు గుహలలో లభించిన శిలాజాల ద్వారా తెలుస్తుంది. ఇది పరిమాణంలో కాస్త చిన్నది 'రైనో కర్నూలెన్సిస్'గా దీనికి పేరు.



పేలియోలాక్సోడాన్ నమాడికస్ (నిలువుదంతాల ఏనుగు) మధ్య చివరి ప్లీస్టోసీన్ కాలం(34000-24000 సం.ల) వరకు జీవించి ఉన్నాయి. అడవులు తగ్గిపోయి, గడ్డిమైదానాలు పెరిగిపోవటం ఈ నిలువుదంతాల ఏనుగు విలుప్తతకు కారణం అంటారు. ఇది 5.2మీ. ఎత్తు, 22టన్నుల బరువు ఉండేది అని అంచనా. ఇది భారతదేశానికి చెందిన అతిపెద్ద ఏనుగుగా చెప్పుతారు. దీని అవశేషాలు ఉత్తరప్రదేశ్‌లో దొరికాయి. వీటి వయసు 56,000 యేండ్లవిగా అంచనా.

స్టెగోడాన్ రకం ఏనుగులు పెద్ద దంతాలు కలిగి ఉండేవి. ప్లీస్టోసీన్ చివరికాలంలో(25,000 సం.లు బి.సి.) ఆసియా ఖండం నుండి పూర్తిగా విలుప్తమైనాయి. వీటికి వారసత్వంగా ఎలాంటి జాతి లేదు. శివాలిక్ కాలంలో 10లక్షల క్రితం ఈ ఏనుగులు చాలా ఉచ్ఛదశలో ఉండేవి అని ఫాసిల్ రికార్డు వల్ల తెలుస్తున్నది. వీటి ఉనికి దక్షిణాది వరకు విస్తరించిందని ఇటీవల గోదావరిలోయలో దొరికిన స్టెగోడాన్ శిలాజాలవల్ల తెలుస్తున్నది.

బొమ్మలు చెక్కిన నిప్పుకోడిగుడ్డు పెంకులు మహారాష్ట్రలోని పట్నే అనే గ్రామంవద్ద దొరికాయి. భింబేట్కా గుహలలోని చిత్రాలలో కూడా నిప్పుకోడి బొమ్మలున్నాయి. దీన్నిబట్టి ఎగువ ప్లీస్టోసీన్ (25000సం.లు) వరకు భారతదేశంలో నిప్పుకోడి నివసించేదని తెలుస్తున్నది. దీని విలుప్తతకూడా shrinkage of Habitat మరియు మానవులవేట కారణం కావచ్చు.

ఇక హిప్పోపొటామస్ విషయానికి వస్తే రక, రకాల హిప్పోలు శివాలిక్ (10లక్షలేండ్లు) కాలం నుండి ఉత్తరాన నర్మదా, దక్షిణాన భీమానది వరకు గత పదిలక్షలేండ్ల నుంచి 50వేల యేండ్ల వరకు ఉండేవని తెలుస్తున్నది. గుల్బర్గా జిల్లాలోని కొల్కూరు అనే ప్రదేశంలోని క్వాటెనరీ సెడిమెంట్స్ లో చెక్కు చెదరకుండా ఉన్న ఒక హిప్పోకపాల శిలాజం దొరికింది. దీని వయసు 50వేల యేండ్లు.





శివాలిక్ అవక్షేపాలు తయారైన కాలం అంటే ఒక పదిలక్షలేండ్ల క్రితం భారతదేశంలో శివాథెరియమ్ అని పిలువబడే 4కొమ్ముల జిరాఫీ, సాబర్ టూత్ టైగర్, పెద్దమెట్ట తాబేళ్ళు, మొసళ్ళు, అనేక జాతుల ఏనుగులు, హిప్పో మొదలైనవి నివసించిన దట్టమైన విశాలమైన అడవులు ఉండేవి. వీటిలో అత్యంత అభివృద్ధి చెందిన కోతులు రామాపిథికస్ వంటివి జీవించాయి. ఈ ఏప్స్ పూర్వీకులెవరో తెలియదు. అవి ఎట్లా అంతరించిపోయాయన్నది ఒక మిస్టరీ. ఈ కోతుల నుంచి వచ్చిన వారసులెవరో తెలియదు. రామాపిథికస్ అనేది ఒక మృతసమూహం. ఇంతటి విలక్షణమైన శివాలిక్ జీవావరణ వ్యవస్థ కనుమరుగు కావటానికి విరూపకారక కారణాలు, హిమాలయ పర్వతాల పర్వతోద్భవనం (orogeny) కారణాలు.

నర్మదా జీవావరణ వ్యవస్థ శివాలిక్ వ్యవస్థ అంతటి Biodiversity లేకపోయినా 6 లక్షల సం.రాల నుంచి హోలోసీన్ (10,000 సం.రాలు) వరకు పరిఢవిల్లింది.

వ్యాసం

ఈ అవక్షేపాలలో కూడా అనేక రకాల ఏనుగులు, గుర్రాలు, ఇతర క్షీరదాలతోపాటు మొదటిసారిగా భారతదేశంలో ఒక మానవశిలాజాన్ని కనుగొనటం జరిగింది. దీనికి హెూమో ఎరక్టస్ నర్మదెన్సిస్ అని పేరు పెట్టడం జరిగింది. ఈ హెూమో ఎరక్టస్ శిలాజంవల్ల మానవపరిణామం మరియు హెూమో ఎరక్టస్ మైగ్రేషన్ రూట్ గురించి విలువైన సమాచారం దొరికింది. దీని వయసు దాదాపు 6లక్షల సం.రాలుగా అంచనా వేసారు. దీనికి ముందు కానీ తరవాత కానీ మానవ శిలాజాలు లభించలేదు. హెూమో ఎరెక్టస్ ఎలా అంతరించిందో తెలియదు.

నర్మదాశిలాజాలతో పోలిక ఉన్న అవశేషాలు ఇతరనదీలోయలో దక్షిణాదివైపు దొరికాయి. ఇందులో ఈ మధ్యనే గోదావరిలోయలో లభించిన స్టెగోడాన్ దంతాలు ముఖ్యమైనవి. కృష్ణా, భీమా, మంజీరా మరి ఇతర నదీ లోయలలో కూడా మానవనివాసాల ఆధారాలు దొరికాయి. జ్వాలాపురం వద్ద ఉన్న వల్కానిక్ యాష్ బెడ్ పై విస్తృత పరిశోధనలు జరిగాయి. ఈ బూడిద ఇండోనేషియాలో టోబా అగ్నిపర్వతం పేలటంవల్ల వచ్చింది. దీని పర్యవసానంగా మానవపరిణామంలో చాలామార్పులు వచ్చినట్టు కొందరు ఆర్కియాలజిస్టుల వాదన. అగ్నిపర్వతాల పేలుడు వంటి వినాశకరమైన సంఘటనలు జీవ జంతువుల ఉనికిపై ప్రభావం చూపుతాయి అనటానికి ఈ టోబా బూడిదదిబ్బలు ఒక ఉదాహరణ. మానవుడు పరికరాలు వాడటం, నిప్పురాజేయటంపై పట్టు సాధించిన తరువాత భూమిపై మార్పులు త్వరితగతిలో జరిగాయి. ఆస్ట్రేలియా ఖండంలో జరిగిన భూవాతావరణ మార్పులన్నింటికి మానవుడే కారణం అంటారు. 'డోడో, టాస్మానియల్ ఊల్ఫ్' వంటి అనేకజీవులు అక్కడ అంతరించి పోయాయి.

నదుల పునరుజ్జీవంపై శ్రద్ధ చూపించకపోతే దక్షిణాదిలో విపత్కర పరిస్థితులు ఏర్పడతాయి. అనంతపురం జిల్లాలో ఎడారి న్యూక్లియస్ ఏర్పడింది. ఇది త్వరితంగా విస్తరించి రాజస్థాన్ లెక్క ఎడారి వాతావరణం ఏర్పడవచ్చు. రెండుమండలాలలో ఈ పరిస్థితి స్పష్టంగా ఉంది. వేదవతి, హగారి నదులు నిర్జీవంగా మారాయి. ఉపేక్షిస్తే కృష్ణానది, దాని ఉప నదులకు ఇదే పరిస్థితి రావచ్చు.

జీవవైవిధ్య పరిరక్షణ (Biodiversity conservation), అటవీకరణ (aforestation), భూసార సంరక్షణ (Soil conservation) వంటి చర్యలు ఇప్పుడు చాలా అవసరం. ఒకప్పుడు హిప్పో, రైనోవంటి జీవులు నివసించిన జీవనదులు చిత్తడినేలలు ఇపుడు పాక్షిక శుష్క (Semi-Arid) మైదానాలుగా మారాయి. రేపు మన కండ్లముందే ఇవి ఎడారిగా మారుతాయి. జీవజాలంలో కూడా అదే రీతిలో మార్పులు సంభవిస్తాయి.

ప్రకృతి 'నన్ను కాపాడితే, నేను మిమ్మల్ని కాపాడుతా' నంటున్నది. పర్యావరణసందేశం స్వీకరించాలి మనం.

కవిత

# తాటి ముంజలు



వనపట్ల సుబ్బయ్య, 94927 65358

వాళ్ళు కూర్చున్నకాడల్లా
తాటిచెట్లు కాసినట్లేవుంది
పిలిచి పిలిచి
బొటనవేలుతో ఒలిచిస్తుంటే
నాయిననే తినిపిస్తున్నట్లుంది!

తాటిముంజలు తాటికన్నులు
పాలముంజలు పిలుపేదైతేం
బాటపొడూత బొడ్డెలుబొడ్డెలు
ముత్యపుచిప్పల్లా మెరిసిపోతయి
పావురాలలా పిలుస్తున్నరు
తేనెటీగల్లా వాలిపోతున్నరు
ఊరు నగరం తేడానేలేదు
రోడ్లపొడవూ ఐస్ కేంద్రాలు!

శివుడు తలమీది గంగకన్న
తాటిచెట్టు తల్లి నీళ్ల మాదుర్యమే వేరు
లేతకొబ్బరి కుడుకల్లా లేతనీళ్ల రుచేవేరు



మండే ఎండల్ల
పయిని సలువచేసే ఐస్ యాపిల్స్
రెండు ముంజలు లోపలికోతే
క్షణాల్లో పారిపోయే డీ హైడ్రేషన్!

ముంజలు రుచిచూడని నోరు ఉన్నా లేనట్లే!
చల్లచల్లని తియ్యతియ్యని నీటిముంజలు
రోడ్లపొడవూ దూపతీర్చుతున్న చలువపందిళ్లు

తోవపొంటి నది అలల్లా మెరిసిపోతయి
పాదాచారులను ప్రయాణికులకు నోరూరిస్తయి
చెరువుకు కాలువలు చంటిబిడ్డలైతే
తాటిచెట్టుకు పాల ముంజలే కన్నబిడ్డలు

సమృద్దిగా పొటాషియం
జీర్ణక్రియను సక్రమంగా కదిలిచ్చే గుణం
మహాశక్తినిచ్చే ఔషదం
ఎండసొడను తగ్గించే నేచురల్ ఫ్రూటి
నేలకు ప్రకృతి ఇచ్చిన బంగారు కానుక

వెనీలా, చాకోబార్, కోన్, కుల్ఫీ
బట్టర్ స్కాచ్, పైనాపిల్, స్ట్రాబేరీఫ్లేవర్
ఐస్‌క్రీమ్‌లు ఊరు నిండెన్నుంటేం
నాగన్నగౌడ్ తెచ్చిన తాటిముంజలుంటే అమృతమే!

## కవిత్వం, నాటకం, నవల రచనలలో మేటి

# విలియం గోల్డింగ్




1983 సాహిత్య నోబెల్ విజేత....

సర్ విలియం గెరాల్డ్ గోల్డింగ్, బ్రిటిష్ నవలా రచయిత, నాటక రచయిత మరియు కవి. తన తొలి నవల లార్డ్ ఆఫ్ ది ఫ్లైస్ (1954) అతనికి ఎంతో పేరు తెచ్చింది. లార్డ్ ఆఫ్ ది ఫ్లైస్ గోల్డింగ్ యొక్క అత్యంత ప్రసిద్ధ పుస్తకం. ఆధునిక క్లాసిక్‌గా పరిగణించబడుతున్న ఈ పుస్తకం నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో చదవబడుతుంది. 1980లో, అతను రైట్స్ ఆఫ్ పాసేజ్ కోసం బుకర్ ప్రైజ్ అందుకున్నాడు, ఇది అతని సముద్ర త్రయం అయిన టు ది ఎండ్స్ ఆఫ్ ది ఎర్త్‌లో మొదటి నవల. 1983లో సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించింది. విలియం గోల్డింగ్ తన అమ్మమ్మ ఇంటిలో జన్మించాడు, అతని తండ్రి, అలెక్ గోల్డింగ్, మార్ల్‌బరో గ్రామర్ స్కూల్‌లో సైన్స్ మాస్టర్‌గా పని చేశారు. ఆ పాఠశాలలో యువ గోల్డింగ్ మరియు అతని అన్నయ్య జోసెఫ్ చదివారు. అతని తల్లి, మిల్డ్రెడ్ (కర్నో), ఆమె కార్నిష్‌కు చెందినది గోల్డింగ్ 1934 వేసవిలో సెకండ్ క్లాస్ ఆనర్స్‌తో తన BA డిగ్రీని పొందాడు మరియు ఆ సంవత్సరం తరువాత అతని కవితల పుస్తకాన్ని మాక్‌మిలన్ & కో ప్రచురించింది. ది పిరమిడ్, ది స్కార్పియన్ గాడ్, డార్క్‌నెస్ విజిబుల్,  రైట్స్ ఆఫ్ పాసేజ్‌ను అతని ఇతర రచనలు. 1935లో అతను మైఖేల్ హాల్ స్కూల్‌లో ఇంగ్లీష్ బోధించే ఉద్యోగాన్ని చేశాడు. 1938-1940లో మైడ్‌స్టోన్ గ్రామర్ స్కూల్‌లో ఇంగ్లీష్ మరియు సంగీతాన్ని బోధించే స్కూల్‌మాస్టర్‌గా ఉన్నాడు. అక్కడ అతను ఇంగ్లీష్, ఫిలాసఫీ, బోధించాడు. 30 సెప్టెంబర్ 1939న ఆన్ బ్రూక్‌ఫీల్డ్ అనే విశ్లేషణాత్మక రసాయన శాస్త్రవేత్తను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు డేవిడ్, జుడిత్. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, గోల్డింగ్ 1940 లో రాయల్ నేవీలో చేరాడు. 1985లో, గోల్డింగ్ మరియు అతని భార్య కార్న్‌వాల్‌లోని ట్రూరో సమీపంలోని పెర్రానర్‌వర్తల్‌లోని తుల్లిమార్ అనే ఇంటికి మారారు. 19 జూన్ 1993న గుండెపోటుతో మరణించాడు. అతని మరణం తరువాత, అతను పురాతన డెల్ఫీ నేపథ్యంలో రూపొందించబడిన ది డబుల్ టంగ్ అనే నవల యొక్క డ్రాఫ్ట్‌ను విడిచిపెట్టాడు, ఇది మరణానంతరం 1995లో ప్రచురించబడింది. బిషప్ వర్డ్స్‌వర్త్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా ఉంటూనే, 1951లో గోల్డింగ్ ఈ నవల యొక్క మాన్యుస్క్రిప్ట్‌ను మొదట్లో స్ట్రేంజర్స్ ఫ్రమ్ ఇన్‌ఇన్ అనే పేరుతో రాయడం ప్రారంభించాడు. అతని  నవల లార్డ్ ఆఫ్ ది ఫ్లైస్‌గా సెప్టెంబర్ 1954లో ప్రచురించబడింది.

గోల్డింగ్ 1979లో డార్క్‌నెస్ విజిబుల్ కోసం జేమ్స్ టైట్ బ్లాక్ మెమోరియల్ ప్రైజ్‌ను మరియు 1980లో రైట్స్ ఆఫ్ పాసేజ్‌కి బుకర్ ప్రైజ్‌ను గెలుచుకున్నాడు. 1983లో అతనికి సాహిత్యానికి నోబెల్ బహుమతి లభించింది. 1988లో గోల్డింగ్ నైట్ బ్యాచిలర్‌గా నియమితులయ్యారు.






# ప్రాంతాలు వ్యక్తిత్వానికి దోహదం చేస్తాయి

**-అల్లం నారాయణ, ప్రెస్ అకాడెమీ చైర్మన్**

ప్రాంతాలు తప్పకుండా వ్యక్తిత్వానికి దోహదం చేస్తాయని సాంప్రదాయ అభ్యుదయవాదం కచ్చితంగా అవకాశవాదమని ప్రెస్ అకాడమీ చైర్మన్, ముఖ్య అతిథి అల్లం నారాయణ అన్నారు. వాడ్రేవు వీరలక్ష్మి 'పిడికిలి ఇసుక'కు రాసిన ముందుమాటను ప్రస్తావించి ఈ అభిప్రాయం చెప్పిన కాంచనపల్లి గో.రా.ను పూర్తిగా సమర్థిస్తున్నానని అన్నారు. ప్రముఖ రచయిత్రి తిరునగరి దేవకీదేవి రచించిన 'పిడికిలి ఇసుక' ఆవిష్కరణోత్సవం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఏప్రిల్ 30న రవీంద్రభారతిలో జరిగింది. సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరి గౌరి శంకర్ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. 'పిడికిలి ఇసుక' కథా సంకలన కర్త దేవకీదేవి కథారచనలో సిద్ధహస్తులని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్ దేవకీదేవి రచనా సంవిధానాన్ని ప్రశంసించారు. సభలో గోగు శ్యామల, కాంచనపల్లి గోవర్ధనరాజు, నెల్లుట్ల రమాదేవి పాల్గొన్నారు. కథారచయిత్రి దేవకీదేవి వందన సమర్పణ చేశారు.

# మే 21న ఫ్రీవెర్స్ ఫ్రంట్ ప్రతిభా పురస్కారాల ప్రదానం








మే 21న కుందుర్తి శతజయంతి పురస్కారాలు కుందుర్తి ఆంజనేయులు గారి శతజయంతి సందర్భంగా ఫ్రీవెర్స్ ఫ్రంట్ ఆరుగురు సీనియర్ కవులకు ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. అడిగోపుల వెంకట రత్నం,దాట్ల దేవదానం రాజు, రాధేయ, దేవరాజు మహారాజు, సీతారాం, అనిశెట్టి రజితలకు ఒక్కొక్కరికీ పదివేలు రూపాయలనగదు, జ్ఞాపిక మే నెల 21వ తేదీ 4-30 గం॥లకు జూమ్ వేదికగా కుందుర్తి కుటుంబ సభ్యుల నిర్వహణలో బహుమతి ప్రదాన సమావేశం జరుగుతుంది. కవుల పరిచయం సుధామ నిర్వహిస్తారని ఫ్రీవర్స్ ఫ్రంట్ నిర్వాహకులు శిలా వీర్రాజు తెలిపారు.




# కంగ్రాట్స్ టు ది న్యూలీ ఎలెక్టెడ్ బాడీ

**-పసునూరి రవీందర్**

మే 9న జరిగిన ఎలెక్టెడ్ బాడీ మీటింగ్‌లో బహుజన రచయితల సంఘం ఒక లక్ష్యంతో ఏర్పాటు చేయనున్నట్లు పసునూరి రవీందర్ తెలిపారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన బహుజన రచయితల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ రచయిత సంఘం ద్వారా అన్ని జిల్లాలో సాహిత్య సదస్సులు ఏర్పాటు చేయాలని, భారత రాజ్యంగాన్ని అవగాహన పరిచే విధంగా, చైతన్యాన్ని కలిగించే విధంగా రచనలు చేయాలని తమ సంఘం ద్వారా ఒక సహిత్య మాసపత్రిను ప్రచురించాలని తమ బహుజన సాహిత్యం కోసం ఒక పబ్లిషింగ్ హౌస్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా కవులు రచయితలకు క్రాఫ్టింగ్ ట్రైనింగ్ ఇవ్వాలని తీర్మానించినట్లు పసునూరి రవీందర్ తెలిపారు.

***ఈ సందర్భంగా చేసిన కొన్ని తీర్మానాలు మిత్రుల కోసం...***

1. నాగరాజు హంతకులను కఠినంగా శిక్షించాలి. దళిత, ముస్లింల మధ్య చిచ్చు పెట్టే వాదనలను ప్రజలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. 2. ప్రారంభ సభ జూన్ నెలలో ఏర్పాటు చేయాలి. 3. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాహిత్య సదస్సులు నిర్వహించాలి. 4. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే చైతన్యాన్ని కలిగించేలా విరివిగా రచనలు తేవాలి. 5. ఒక సాహిత్య మాసపత్రిక తేవాలి. 6. బహుజన సాహిత్యం కోసం ఒక పబ్లిషింగ్ హౌజ్ ఏర్పాటుచేయాలి. 7. కవులు, రచయితలకు క్రాఫ్టింగ్ ట్రెయినింగ్.



# 'చంద్రకిరణాలు' బాలల గేయ సంపుటి ఆవిష్కరణ

ఏప్రిల్ 30, 2022న రవీంద్రభారతి ప్రాంగణంలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో జరిగిన గద్వాల కిరణ్‌కుమారి రాసిన 'చంద్రకిరణాలు' ఆవిష్కరణ సభలో.. పిల్లల్లో సృజనను తట్టిలేపేందుకు ఎంతో దోహదపడుతున్న తెలుగు బాలసాహిత్యం అక్షర విప్లవాలకు తెలంగాణ నేల భూమికగా నిలవడం గర్వకారణంమని పుస్తక ఆవిష్కర్త సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్ పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత అమ్మవేణుగోపాల్ ప్రసంగిస్తూ ఆరోజుల్లో చందమామ బాలల పత్రికలో వచ్చిన కథలు ఆ తరంలో ఎంతో ప్రభావం చూపాయని తెలియజేశారు. ప్రముఖ రచయిత్రి కొల్లాపురం విమల మాట్లాడుతూ 'చంద్రకిరణాలు' గ్రంథంలోని గేయాల్లో కవయిత్రి గద్వాల కిరణ్ కుమారి ప్రకృతి అందాలను చాలా హృద్యంగా వర్ణించారని పేర్కొన్నారు.




## మనసు పొరలలో

డా॥ పి. కృష్ణమాచార్య
సెల్ : 7675042763

వెల : రూ.150/-




## ఇక్కడ ఎవరైనా ఒకటే

స్వాతి శ్రీపాద
సెల్ : 82972 48988

జెవి పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ.150/-




## మనషాపంచకము మరియు ఉపనిషత్సారము

బ్రహ్మశ్రీ వారణాసి ప్రసాదరావు
ఒంగోలు
సెల్ : 9490112909




## పొగడ పూలదండ

కవితా సంకలనం

సృజన సాహితీ
నల్లగొండ
వెల : రూ.100/-




## జీవన యానం

డా॥ పి. కృష్ణమాచార్య
సెల్ : 7675042763

వెల : రూ.100/-




## నా ఏకాంత బృందగానం

డా॥ అమృతలత
98488 68068

పాలపిట్ట బుక్స్
నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్
వెల : రూ.600/-




## తల్లివేరు

నెల్లుట్ల రమాదేవి
94406 22781

అపురూప పబ్లిషర్స్
జెవి పబ్లికేషన్స్
పాలపిట్ట బుక్స్
వెల : రూ.200/-




## జీవితం

కరుణ
90102 01880

తెలంగాణ ఎన్ఆర్ఐ అసోసియేషన్
వెల : రూ. 250/-




## విలక్షణ పి.వి.

డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి

నీల్‌కమల్ పబ్లికేషన్స్ ప్రై.లి.
హైదరాబాద్
90001 68953
వెల : రూ.395/-




## బాల రసాలం

డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్ : 92465 41699

నవచేతన బుక్ హౌస్
విశాలాంధ్ర బుక్ హౌస్
నవోదయ బుక్ హౌస్
వెల : రూ.100/-

